

ఫిబ్రవరి '64
60NP




పద్మశ్రీ వారి
మురళీకృష్ణ
దర్శకుడు...పి.పుల్లయ్య, బి.ఏ.
నిర్మాత...వి.వెంకటేశ్వర్లు, బి.ఏ.
VIJAYA PUBLICITIES
ఆంధ్ర, సీడెడ్: విజయ రిలీజ్ · నైజాం: ప్రమోద్ పిక్చర్సు · మైసూర్: వీనస్ మూవీస్

Statement about ownership and other particulars about "JYOTI"

FORM IV
('See Rule 8)

1. Place of Publication : VIJAYAWADA.
2. Periodicity of its publication : Monthly.
3. Printer's Name : V. V. Raghavaiah.
   Nationality : Indian.
   Address : Buckinghampet P. O., VIJAYAWADA-2.
4. Publisher's Name : V. V. Raghavaiah.
   Nationality : Indian.
   Address : Buckinghampet P. O., VIJAYAWADA-2.
5. Editor's Name : V. V. Raghavaiah.
   Nationality : Indian.
   Address : Buckinghampet P. O., VIJAYAWADA-2.
6. Names and addresses of individuals who own the newspaper and partners or share-holders holding more than one per cent of the total capital, : Smt. V. Leelavati, Labbipet, Buckinghampet P. O., VIJAYAWADA-2.

I, **V. V. RAGHAVAIAH,** hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

(Sd.) V. V. RAGHAVAIAH

Date : 30—12—63. Signature of Publisher.





తొలిమాట

22 వ పేజీలో కథ చదివాక చింకి సంచీలాంటిది జీవితం అనిపించకతప్పదు.

చలి చలిగా వున్నప్పుడు పుట్టే వేడి వేడి కోరికల చకోరికల కల 30వ పేజీలో వుంది.

నిజం చేదుగా వుంటుందనడంకంటె చేదు నిజం (49 వ పేజీ) మరేముంది ?

ప్రతి థీసిస్‌కు యాంటి థీసిస్ వున్నప్పుడే సింథెసిస్. అవునా? (84 పేజీ)

జ్యోతిని మొదటి పేజీనుంచి చివరి పేజీవరకు చదివినప్పటి అనుభూతి ఎనభై రోజులలో భూప్రదక్షిణం చెయ్యడం లాంటిదే.

సచిత్ర మాసపత్రిక
బకింగ్‌హామ్‌పేట, విజయవాడ-2

మేనేజింగ్ ఎడిటరు : వి. వి. రాఘవయ్య
విడిప్రతి వెల : 60 న.పై. — ఏడాది చందా : ఏడు రూపాయలు
సంపుటి 2 ఫిబ్రవరి 1964 సంచిక 2

పాఠక మహాశయా ! ఈ నెల

కథా-కమామీషూ





ముఖచిత్రం: "మూగమనసులు"లో జమున

సంపాదక వర్గం :
నండూరి రామమోహనరావు, ముళ్ళపూడి వెంకటరమణ, బాపు, వి. ఎ. కె. రంగారావు, రావి కొండలరావు,

Edited and Published by V. V. Raghavaiah for Jyoti Publications and Printed by him at Thrinadh Art Printers Buckinghampet post, Vijayawada-2

ఉత్తరాయణం

మీ చిత్రరథుడిగారికి పదిమందికీ తెలిసిన సామాన్య విషయాలుకూడా తెలియకపోవడం చిత్రం. వెనక జ్యోతులలో వారు "మంచి మనసులు"లోని "శిలలపై శిల్పాలు చెక్కినారూ" అన్న పాట దాశరధి వ్రాసిందని వ్రాశారు. కాదు, ఆత్రేయ. "మూగ మనసులు" సంగీత దర్శకుడు కోదండపాణి అన్నారు. కాదు. మహాదేవన్. పోయిన నెల "జ్యోతి"లో "పూజాఫలం"లో "పగలే వెన్నెలా" కృష్ణశాస్త్రిగారి పాట అన్నారు. కాదు నారాయణరెడ్డిగారిది. ఇంకా చెప్పాలంటే ఇలాంటివింకా వున్నాయి.

పి. శకుంతల, మద్రాసు.

శ్రీ శ్రీ గారి పంచపదులు పసందుగా వున్నమాట కాదనడంలేదు గాని, ఇదివరకు వారు వ్రాసిన "వారం వారం" లాంటి వచన శీర్షిక ఏదైనావారిచేత వ్రాయించి జ్యోతిలో ప్రచురించకూడదూ ?

హెచ్. వి. రెడ్డి, హైదరాబాదు.

అయ్యా, నాకు బాగా నచ్చినవి అడ్డమైన రాతలు. (తలకిందుగా వేస్తున్నారే అవి) అవి ఇంకా విరివిగా వేయగలరు.

కె. శ్రీనివాసరావు, వాల్తేరు.

మీ జ్యోతిలో ఎక్కువగా నన్ను, చాలమంది పాఠకులను ఆకర్షించి అలరిస్తున్నవి జోకులు, కార్టూన్లు, చిన్న చిన్న ఫీచర్లు. అవి ఇంకా ఎక్కువగా వేస్తుండాలని కోరుతున్నాము.

ఎ. సుబ్బారావు, హైదరాబాదు.

రాస్తానన్న కథలు రాయడాయన
రాస్తానని లెక్చర్లురాస్తాడాయన
ఏదిరాసినా రాయకపోయిన
తెలుగు పాఠక జనగణమన
అధినాయకుడు ముళ్ళపూడి రమణ

ఒక రమణాభిమాని, బందరు.

మీ దీపావళి సంచికలో చాడ అనసూయ గారి వ్యాసం చదివాను.

వ్యాస విభాగపరిచ్ఛేదంలోనూ, వస్తూత్పత్తిలోనూ, సమన్వయంలోను, అంగాంగ నిర్మాణకౌశలంలోనూ వ్యాసం మెచ్చుకోవలసిందే.

అయితే రచయిత్రి అంతరాంతరాల్లో కలుక్కుమంటున్న భారతీయ సంస్కృతిపై నైరాశ్యంతోను, పాశ్చాత్య వ్యవస్థపైగల వ్యామోహంతోనూ మనం ఏకీభవించాలని లేదుకదా !

వి. వెంకట్రావు, కాకినాడ.

జ్యోతీ ! నీ జన్మదినోత్సవ శుభ సమయాన నా శుభాకాంక్షలివే అందుకో !

ఇలాంటి జన్మదినోత్సవాలు నింగిపై రవిచంద్రులు వున్నంతదాకా చేసుకోవాలని కాంక్షిస్తున్నా.

కుడుపూడి పట్టాభిరామయ్య, భట్లపాలెం

ప్రసిద్ధ సినిమా కవియైన శ్రీ ఆరుద్ర గారి సొంపైన "కూనలమ్మ పదాలు" తిరిగి జనవరి సంచికతో ప్రారంభం చేయటం చాల ఆనందించాల్సిన విషయం. ఈ కూనలమ్మ పదాలతోనే నూతన సంవత్సరం ప్రారంభం కావడం ఒక విశేషం. శ్రీ శ్రీ

గారి "పంచపదులు" "కూనలమ్మపదాలు"కు పోటీ యున్నటుల కాన్పించును.

ముఖ్యంగా కథలలో "మానినీమానసం" "అగ్ని పుష్పం" బాగున్నాయి. ఇకపోతే "చైత్రయాత్ర" గురించి చెప్పనవసరంలేదు. కవర్ప్యాను. కలువల కన్నెయగు కుమారి కృష్ణకుమారి చాల అందముగా యున్నది.

జి. లక్ష్మిరెడ్డి, కల్వకుర్తి.

జనవరి సంచికతో సంవత్సరం నిండి రెండోయేట ప్రవేశిస్తున్న జ్యోతి అందరిని ఆకర్షించింది. ముళ్ళపూడివారి గిరీశం లెక్చరు చాల బాగుంది. ఏమండోయ్. ప్రతినెలా వీరి కథ ప్రచురించాలి.

అందాలు చిందే తార కృష్ణకుమారి ముఖచిత్రం జ్యోతికి ఓ ప్రత్యేక ఆకర్షణ. రచయితలకు, ఎడిటర్లకు నా హృదయపూర్వక వందనములు.

చిర్ల సుబ్బారెడ్డి, గొల్లలమామిడాడ.

నీ వెలుగుని తొలి నెలనుంచీ చూస్తున్నాను. సూర్యునిలా భలే వెలుగుతున్నావు. నయాపైసకి రూపాయి ఆనందాన్ని కలిగిస్తున్నావు. అంటే మొత్తం 60 రూపాయిల ఆనందం! ఈ నెల ఎన్. ఆర్. నంది వ్రాసిన "మానినీ మానసమ్" కన్నెమనసుకు రూపకల్పన. కథంటే ఇలావుండాలి. పి. బి. శ్రీనివాస్ పాడడంలో నే గాక వ్రాయడంలోనూ పాండిత్యం తొణికిస్తున్నారు.

రాపేటి రామకృష్ణారావు.

సికింద్రాబాదు.

□□□



ఏది సత్యం ఏదసత్యం!
ఏది నీతి ఏది నేతి!
ఓ మహాత్మా! ఓ మహర్షీ!

[వర్ధంతి: జనవరి 30 వ తేదీ]

రాజకీయ వాతావరణం

భువనేశ్వర్ సభలు, నెహ్రూ అస్వస్థత

మనస్సుకు వయస్సు లేకపోయినా, ఆలోచనలకు 'అవధి' అంటూ అక్కరలేక పోయినా - వీటికి ఉపాధి కల్పించిన దేహానికి మాత్రం, ఈ రెండూ వున్నాయి - అక్కడే వస్తోంది బాధ అంతా....

ఏళ్ళు జరిగిపోతున్న కొద్దీ మనస్సు యెంతో ఉత్సాహంగా ఇంకా ఇంకా గంతులేస్తుంటే - యెంతకాదనుకున్నా - వుడిగిపోతున్న వయస్సు నెహ్రూగారిని కుంగదీసి వేస్తోంది.

ఆయనను అస్వస్థత అవహించిందంటే, యావత్ప్రపంచం దిగ్భ్రాంతి చెందింది.

● ● ●

దేశాలను కాలాలను అధిగమించి, విశ్వమానవుల నివాళి అందుకున్న మహామనీషి ఆయన.

అశేష భారతప్రజల ఆశలు, ఆశయాలు, బాధలు ఆవేదనలు - అవే ఆయన కు 'స్వవిషయాలు'.

ఊహలు తెలిసిన నాటినుంచి దేశసేవ ఆయన భావనను పెనవేసుకుని యేడు దశాబ్దాల ఋతువులను జీర్ణించుకుంది....

"డిస్కవరీ ఆఫ్ ఇండియా" ఆయన రాసుకున్న పుస్తకం.

ఒకప్పుడు మహోన్నత పథాలను అందుకున్న భారతజాతి, కాలగతిలో చిక్కుకు నిపతనమై శిథిలమై పోతుంటే - ఆ బాధను భరించలేక, ఆర్తుతతో ఆవేదనతో ఆ శిథిలావశేషాలనే ప్రోగుచేసుకుని, జవసత్వాలను కూడదీసుకుని, పూర్వపు ఔన్నత్యాన్ని అందుకోవాలని తపన పడిపోతున్న మహావ్యక్తి ఆయన.

వికసిస్తున్న పుష్పం పరిమళించాలి—

బాధల పల్లవిలోనుంచి కేదారగౌళ శ్రావ్యంగా సాగిపోవాలి.

● ● ●

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కాంగ్రెసు మహాసభల బహిరంగ సమావే



శానికి శ్రీ నెహ్రూ హాజరు కాకపోవటం యిదే ప్రథమం.

భువనేశ్వర్‌లో బహిరంగ సమావేశానికి ఆరు స్పెషల్ రైళ్ళనిండా జనం దేశం నలుమూలలనుంచీ హాజరైనారు. లక్షమంది జనం - ప్రధాని నెహ్రూకు సుస్తీచేసిందని ఆయన బహిరంగసభలో వుపన్యసించరని తెలుసుకుని యెంతో నిరుత్సాహం పొందారు.

ఈరోజు జనవరి పంధొమ్మిదవతేదీ. ఇంకా ప్రధానికి పూర్తి స్వస్థత చేకూరలేదు. ఆరోగ్యం త్వరత్వరగానే ఆయన కోలుకుంటున్నప్పటికీ మామూలుగా ప్రభుత్వ వ్యవహారాలు చూచుకోటానికి కనీసం మరో రెండు వారాలు పడుతుందని అంటున్నారు.

● ● ●

ప్రధానికి ఆకస్మికంగా సంభవించిన ఈ అస్వస్థత జాతీయ అంతర్జాతీయ రాజకీయాలలో కొంత ఆందోళనను, కొంత సంచలనాన్ని కూడా కలగజేసింది.

అంతర్జాతీయ పరిస్థితులలో సుముఖమైన మార్పులు క్రమంగా జరుగుతున్నాయి. రష్యా, అమెరికాలమధ్య దూరం నానాటికీ సన్నగిలటం ప్రారంభమైంది.

ప్రపంచ అలీన రాజ్యాల ద్వితీయ సమావేశానికి యేర్పాట్లు త్వరితంగా జరుగుతున్నాయి.

ఈలాంటి తరుణంలో శ్రీ నెహ్రూ అస్వస్థతను గురించిన వార్త ఒక్కమాటుగా ప్రపంచ నాయకులను కలవరపరచింది.

ప్రపంచ రాజ్యాలమధ్య సహజీవనం, శాంతి స్థాపించటానికి జరిగిన కృషిలో పరోక్షంగాను, ప్రత్యక్షంగాను ప్రధాని నెహ్రూ వహించిన పాత్ర యెంతో గంభీరమైనది.

దేశ రాజకీయాలలో కూడా ఈ విషయం ఒక హఠాత్ సంచలనానికి దారితీసింది.

కొందరు రాజకీయ పరిశీలకుల దృష్టిలో ప్రధాని అస్వస్థత, భువనేశ్వర్ సమావేశాలలో, జరుగుతాయనుకున్న విషయాలు జరగకుండా చేసినవి.

భువనేశ్వర్ సమావేశాలకు ముందు, కాంగ్రెసులో 'లెఫ్టిస్టు' 'రైటిస్టు'ల మధ్య విభేదాలు తీవ్రంగా పెరిగాయి. బ్యాంకులను తదితర కీలక ఆర్థిక సంస్థలను జాతీయం చెయ్యటానికి శ్రీ పట్నాయక్ ప్రభృతులు ప్రచారం లేవదీశారు. ఈ విషయాలకు భువనేశ్వర్ సమావేశాలలో తుదిరూపం లభిస్తుందని అనుకున్నారు. కాంగ్రెసు సంస్థమీదవున్న 'రైటిస్టు' ప్రభావాన్ని పూర్తిగా తుదముట్టించాలని వారి ప్రయత్నం.

మరొకవైపునుంచి శ్రీ పాటిల్, శ్రీ మురార్జీ బృందం యెటువంటి పరిస్థితులలోనూ కాంగ్రెసులో అధికారం తమ హస్తాలనుంచి జారిపోకుండా వుండటానికి


తీవ్రప్రయత్నం చేశారు. భువనేశ్వర్ సభలో 'లెఫ్టిస్టు' వర్గాలు వెయ్యబోయే ఎత్తుగడలను యెదుర్కొనటానికి తగినన్ని వుపాయాలతో ముందుగానే సిద్ధపడ్డారు.

ఉద్రేకాలకు దారి తీస్తుందనుకున్న వాతావరణం ప్రధాని అస్వస్థతతో చల్లబడిపోయింది. కాస్తంత వివేకం బోధచేసింది. ఇరుపక్షాలు తెగేదాకా సమస్యలను లాగకుండా కొంతవరకు సర్దుబాటు చేసుకున్నారు.

మరో ముఖ్యవిషయం - శ్రీ నెహ్రూ ఇంతకాలం ప్రభుత్వ కార్యకలాపాలకు దూరంగా వుండటం ఇదే ప్రథమం. ఇంచుమించు యెటువంటి కార్యభారాన్ని వహించకుండా యింకా కొంతకాలం ఆయన విశ్రాంతి తీసుకుంటారని కూడా అంటున్నారు.

ప్రధాని కార్యభారాన్ని శ్రీ టి. టి. కృష్ణమాచారి, శ్రీ గుల్జారీలాల్ నందా, కొత్తగా మంత్రివర్గంలోచేరిన శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి పంచుకునే సూచనలు కనిపిస్తున్నాయి. కేంద్ర శాసనసభా నాయకత్వం కూడా ఆయనకు యిస్తారని అంటున్నారు.

ఒకవిధంగా ఆలోచిస్తే భువనేశ్వర్ కాంగ్రెసు సభల పర్యవసానం కాంగ్రెసు సంస్థను ఒకమంచి మార్గాననే నిలబెట్టిందనుకోవాలి. 'కుడి' 'యెడమ'ల వర్గాలను కొంత సంభాయింపుతో అదుపుచేసి, దగ్గరకు లాగేందుకుగాను ఒక 'సెంట్రిస్ట్' (మధ్య) వర్గంకూడా బయలుదేరింది. ప్రత్యక్షంగా కాంగ్రెసు పెద్దెపెద శ్రీ కామరాజ్‌నాడార్ కనిపిస్తున్నప్పటికీ, కాస్తంత జాగ్రత్తగా



అన్ని విషయాలు సింహావలోకనం చేసుకుంటే, శ్రీ లాల్ బహదూర్ వ్యక్తిత్వం యెంతో ఓర్పుగా చాకచక్యంతో మనకు ద్యోతకమవుతుంది. ప్రధానిలేని లోటును ఈయన చాలావరకు సర్దుబాటు చేశారు.

ఇప్పుడు దేశ రాజకీయాలలోకూడా కాంగ్రెసులో 'వర్గాలమధ్య వుద్రేకాలు' కొంతవరకు అదుపులోకి రావటానికి ముఖ్య కారణం శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రి అనిపిస్తుంది.

దానికి తగినట్లుగానే భువనేశ్వర్ సమావేశాలలో 'ప్రజాస్వామ్యసోషలిజానికి' నిర్వచనం లభించింది.

సామ్యవాదం ద్వారా ప్రగతిని సాధించాలి. మానవతను పునీతం చెయ్యాలి. ఉత్పత్తిని పెంచటానికి మార్గాలు ఆలోచించాలి. ఇందుకుగాను కొంతవరకు కీలక ఆర్థికవ్యవస్థలను జాతీయం చెయ్యటం కొంత వుపయోగపడుతుంది.

అంతేగాని, వర్గవైషమ్యాలను పెంచి రక్తపాతం ద్వారా సామ్యవాదాన్ని సాధించటం కాంగ్రెసు లక్ష్యం కాదన్నారు శ్రీ లాల్‌బహదూర్.

"ఎవల్యూషనరీ రెవల్యూషన్"—విప్లవాత్మకమైన మార్పులు క్రమవికాసం పొందాలేగాని, రక్తపాతంద్వారా వర్గపోరాటాలతో కృత్రిమంగా సాధించకూడదు. అలా జరిగితే లక్ష్యం కలుషితం అవుతుంది అన్నారాయన. వ్యష్టికి సమష్టికి మధ్య సమరసభావంతో సొత్తు యేర్పడాలన్నారు.

సామ్యవాదానికి ప్రధానలక్ష్యం ఆర్థిక వికేంద్రీకరణ. అన్ని వ్యవస్థలను జాతీయం చెయ్యటంవల్ల ఈ లక్ష్యానికి భంగం కలగటమే కాకుండా భీకరమైన కేంద్రీకరణ కూడా తయారవుతుందని ఆయన హెచ్చరించారు.

ఏదియేమైనా ప్రస్తుతం, రాజకీయంగా దేశంలో కొన్ని సవ్యమైన, వాంఛనీయమైన పరిణామాలే ద్యోతకం అవుతున్నాయి.

ఇప్పుడు జరగవలసినది మాత్రం ఒకటి ముఖ్యంగా వున్నది.

ప్రధాని నెహ్రూ త్వరలో సంపూర్ణ ఆరోగ్యాన్ని కోలుకుంటారు. ఆ తరువాత మళ్ళీ యథాప్రకారం అన్ని భారాలను ఆయనమీద వేసి ప్రతి చిల్లర విషయానికి ఆయనను వేధించటం ప్రారంభమవుతుంది. అందుకుగాను అలాంటివి జరగకుండా, ప్రధాని నెహ్రూ కొన్ని జాగ్రత్తలు తీసుకొనటం ముఖ్యం.

గాంధీగారి కాలంలోనే 'గాంధీ తరువాత నాయకులు' యెవరు అనేది చాలా తేలికగా సాఫీగా తేలిపోయిన సమస్య. అప్పట్లో నెహ్రూగారిని గాంధీమహాత్ముడు ఆవిధంగా తయారుచేశారు.

కాని ఇప్పుడు, కనీసం ఇంతవరకు, అలాంటి పరిష్కారమార్గాలు ఏవీ కనిపించటంలేదు.

ఈ విషయం చాలామందికి యెంతో బాధకలిగించినా 'హాలాహలాన్ని మిగిల్చి అయినాసరే దీనిని ఇప్పుడే తేల్చుకోవాలి, లేకపోతే రాజకీయ పరిస్థితి 'కుక్కలు చింపిన విస్తరి' అవుతుంది.

"నెహ్రూ తరువాత యెవరు?" అంటే "ఆ తరువాత యెందరో వున్నారు: ఇప్పటి నుంచీ యెందుకు బెంగ" అంటారు చాలా మంది రాజకీయనాయకులు.

అందుకే వస్తోంది మన భయం, బెంగా కూడాను.

క్రమంగా ప్రధాని యథార్థ విషయాలను ఆలోచించి, అన్ని విధాలా అవసరానికి అందుబాటు అయేటట్లు "ద్వితీయ శ్రేణి నాయకులను" ఇప్పటినుంచీ తయారు చేసుకోవాలి.

ఈ విషయం తప్పకుండా జరుగుతుందని మొన్న భువనేశ్వర్ సమావేశాల ద్వారా ఆశలు ఏర్పడినాయి.

రాష్ట్ర రాజకీయాలు

రాష్ట్ర కాంగ్రెసులో ఏకగ్రీవంగా ఎన్నికలు జరుగుతాయని, ఇరువర్గాల మధ్య సామరస్యం కుదిరిందని, మధ్యవర్తిగా పంపబడ్డ శ్రీ కృష్ణప్ప ఒక్కమాటుగా ఇప్పుడు అంటున్నారు.

అట్లా అయితే బాగానేవుంటుంది. కాని బాగా వుంటాయనుకున్న విషయాలు అనుకున్నవి అనుకున్నట్లు జరగటంలేదు. ఈ విషయం మాత్రం యెట్లా జరుగుతుందని ప్రశ్నిస్తున్నారు కొందరు. అయినా జరగవని యెందుకనుకోవాలి అంటున్నారు మరి కొందరు.

రాజకీయనాయకుల చిత్తాలను 'జవరాంధ్ర చిత్తాల'తో పోలుస్తున్నారు వ్యాఖ్యాతలు. రాష్ట్ర రాజకీయాల తుదిఫలితాలు రావటానికి ఇంకా నెలరోజులు గడవాలి. ఏం చెప్పగలం ఈ లోపల!

□□□

శ్రీశ్రీ పంచపదులు

శ్రవణ ప్రాస

లాటాను
ప్రాసం, ఛేకానుప్రాసం భూటాను
లో ప్రారంభించాయి గలాటాను
కోరుకున్నాయి నాకవితలో వాటాను
ఒప్పుకొని వారుభయులూ గొప్పవారే అని చాటాను

శుద్ధ బుద్ధి

మానవుని మనస్సు
కి నా సవినయనమస్సు;
తమాం యూనివర్సు
దాని సామ్రాజ్యం; లేదు దానికివయస్సు
అది గట్లులేని మానసరస్సు



బాల శిక్ష

అల్లాటప్పా
రాతలు రాయడమే చెప్పుకోదగ్గగొప్పా
ఒప్పుకోదగ్గ మెప్పా
అలాంటి రచయితల చెవులు మెలితిప్పా
నంటే అది నాతప్పా.

శ్రీశ్రీ పంచపదులు

ఏనుగు వెనకాతల....



ఆరుద్ర కవిత్వంమీద ఈవారం
మళ్ళీ రేగింది గాలిదుమారం
పాతరాతి యుగాల అవశేషాలసారం
ఇంకా చలామణీ కావడం ఘోరం
ఆధునిక సాహిత్యసౌందర్యానికదెంతోదూరం

పేనుగ

లక్ష్మీనరసింహారావు పానుగంటి
సాక్షివ్యాసాలు చదవడం మానకంటి
ఎంచేతంటే వాటిలో పేనులాంటి
భావానికాయన ఏనుగంటి
రూపాన్నియ్యడం నేను గంటి

కుస్వాతంత్రం

పేరుకుమాత్రం స్వతంత్రం
చేసేదంతా కుతంత్రం
చేరువకాగా జీవిత సాయంత్రం
జపించి అమెరికా మంత్రం
పట్టుకోబోతారు రాజ్యాంగ యంత్రం



శ్రీశ్రీ పంచపదులు

EAST IS WEST

ప్రాక్కు
వాటర్ కలర్సుతో పెక్కు
వర్ణచిత్రాలు రచించగా పశ్చిమదిక్కు
వాటినే తైలవర్ణచిత్రాలుగా చెక్కు
తూండడంచూసి కళాచౌర్యం అన్నాడు క్రిటిక్కు



బ్రహ్మపదార్థం

మాటవరసకి దరిమిలా
అనే మాట వుంది, దానికి చెలిమిగా
దాని పరిమళానికి సరిపడా
మరోమాట లేదని మరి యిలా
గింజుకోవడమెందుకు గిలగిలా

CREDO

నాయింటిపేరు ప్రపంచం
ప్రజలే నా కుటుంబం
వెదజల్లుతా దిగ్దిగంతం
అభ్యుదయ సుగంధం
అప్పుడు నాజీవితమే ఒక ప్రబంధం



జ్యోతి

ప్రొహిబిషన్ జిందాబాద్

మద్యనిషేధం
వద్దనడమే అపరాధం
అదో పెద్ద అగాధం
సర్వం శ్రీ జగన్నాథం
సర్వోదయాశ్వమేధం



ఫై - ఫై

ఫైనార్ట్సూ, ఫైనాన్సూ కలిస్తే
రెండూ ఒకే విశ్వరూపం ధరిస్తే
కాపిటల్ గానే వుంటుందిగాని స్మరిస్తే
మనలాంటివాళ్ళ కదో అవస్థే
అటువైపు వెళ్లొద్దు మిత్రమా నమస్తే

గుం

INTELLEGENTLE MEN అంతా గుంటూరు
పురంలోనే ఉంటారు
సుమా అని (అక్కడ)కొందరంటారు
కాదని వాదుకొస్తే తంతారు
ఎందుకు బ్రదర్ మన కొసలీ తంటాలు

వీరాంజనేయం

బ్రహ్మచర్యం
ఆసేతు శీతాచలపర్యం
తం అనుష్ఠించదగ్గ కార్యం
త్వరలో ప్రభుత్వం ఇది ధైర్యం
గా అమలుచేస్తే వర్ధిల్లుతుంది మన వీర్యం

అమానుషం

జనాభా సమస్యకి విరుగుడు
బ్రహ్మచర్యం అనే మాటకి తిరుగుడు
లేదు, నిజంగా ఇది కొరుకుడు
పడనిసత్యమే కాని అంతా ఆదారినే నడువుడు
అప్పుడు భూమ్మీద మనిషే మిగలడు






ప్రెడ్ నికి బాక్సర్లైపు
బాహాలకి సంకెళ్ళు లేవు
ఆయన మానవజాతినే హరించబోవు
యుద్ధానికి విధించి చావు
శాంతినొకని చేకుస్తాడు రేపు


— శ్రీశ్రీ



నేస్తం కౌమరాజు నేర్పిన పాఠం
అస్తమానం అంటిపెట్టుకోకూడదు అధికారపీఠం
జనుల అభిమానం పవరుకు మూలం
జల్లుకొని గ్రహించె సంజీవరెడ్డి నీలం
తమ రాజకీయాలలో ఘటనా ఘటన
సమర్థతకి కీలకం వారి నిత్యపర్యటన




మెడ మీద తల నొప్పో నాలిక
ఉండనుకునే ప్రతివాడూ డొక్క చీలిక
చేవికల్చేసి చెండాడి పారెయ్యడానికే బహుతేలిక
ఋన, బాధ్యతలేని సబ్జెక్టు పంచవర్ష ప్రణాళిక



చింకి సంచి

ఎం.జే. రామం



వేణు అప్పుడే ఆఫీసునుంచి ఇంటికి వచ్చి ఏదో ఇంగ్లీషు పత్రిక తిరగ వేస్తున్నాడు. దాంట్లో నానా చెత్తరాసి వుంది. ఒక పెన్సిలు పూర్తిగా అరిగి పోయేవరకు గీస్తే ఎంత పొడవు గీత అవుతుందో. అది మైళ్ళలోను. గజాల్లోను. అంగుళాల్లోను వేరు వేరుగా ఇచ్చాడు ఎవడో ఓ మూల. ఎవరికి కావాలి ఇలాంటి విషయాలు? ఎవడో దరిద్రుడు ఇలాంటివి చదివి గొప్పగా ఏదో తెలిసినట్టు ఎప్పుడో నలుగురిలోను చెబుతాడు. అందుకే వస్తున్నాయి ఇలాంటి విషయాలు. అనుకొన్నాడు వేణు.

ఇంతవరకు కాఫీ తెచ్చి ఇచ్చే సూచన లేవీ వేణుకి కనపడ లేదు. అయితే ఇక మరి రాదన్నమాట. ఇంత కాఫీ గురించి అడుగుతే అమ్మ పంచదార లేదనో, కాఫీ గుండ అయిపోయిందనో చెప్తుంది. నోరు మూసుకొని వూరుకోవడం మంచిది. అలాగే నోరు మూసుకొని వూరుకొన్నాడు. కొంత సేపటికి లేచి వీధిలోకి బయలు దేరడానికి తయారయ్యాడు.

ఇంతలో వీధిలో రిక్షా ఆగింది. వరండాలో చదువుతున్న రవి. శ్యామల అంటే వేణు తమ్ముడు. చెల్లెలూను. కీచు గొంతుకలతో కేకలు పెట్టారు. "అన్నయ్యా. శాంతం పిన్ని వచ్చిందోయ్" అని

అహా వచ్చిందన్నమాట. అనుకొన్నాడు వేణు. వేణుకి ఈ ప్రపంచంలో ఏం జరిగినా ఆశ్చర్య పడవలసిన అవసరమేమీ లేదని ఒకనమ్మకం. అయినా ఇప్పుడెందుకు వచ్చినట్లు. ఏదైనా సంబంధం మోసుకొచ్చిందేమో. వెంటనే పొమ్మంటే బావుంటుంది. ఇంతలో అమ్మ వచ్చింది.

"ఎవర్రా వచ్చింది. శాంతేనా? నేను మధ్యాహ్నమే అనుకొన్నాను. ఆ నల్లకాకి అదేపనిగా అరుస్తూవుంటేను."

అప్పుడే అనుకొందిట అమ్మ! ఆ వెధవ కాకి ప్రతిరోజూ మధ్యాహ్నం అరుస్తూనే వుంటుంది.

"రావే. లోపలికిరా. గుమ్మంలోనే నిలబడి పోయావేం?" అమ్మ ఆందోళనగా ఆహ్వానించింది. వేణు చిరునవ్వుతో పలకరించాడు.

"అంతా కులాసాయేనా" అడిగింది శాంతం పిన్ని.

"షస్టుగా" అందరి తరఫునా చెప్పాడు రవి.

గుంట వెధవ వీడికేంతెలుసు. ఎంత చస్తున్నామో. అయినా పాపం వాడినెందుకు తిట్టడం. ఇప్పుడు చేయవలసిన పనిఏమిటో జ్ఞాపకం రావడంలేదు-ఆ. అదీ నేను వీధిలోకి తిరగడానికి వెళ్లాలి. అని తేల్చుకొన్నాడు వేణు.

అలాగే బయలుదేరాడుకూడాను.

అమ్మ పక్కకి పిలిచి చెవులో చెప్పింది కళ్ళు చిట్లించి బయలుదేరాడు వేణు. ఎక్కడైనా. వీలైతేనే. పదిరూపాయలు పుట్టించుకు రావాలిట! ఇవాళ రేపూనూ అప్పు అడుగుతే తంతున్నారు వూళ్ళో. అయినా ప్రయత్నం చేద్దాం.

ఖాతా కొట్లో ఒకే ఒక్క సిగరెట్టు తీసుకొని ముట్టించాడు. ఎటువెళ్దామా అని ఆలోచిస్తూ ఆ కొట్టుదగ్గరే ఒక సైకిలుంటే దాని మీద కాలుపెట్టి ఏదో మునిగిపోతున్నట్లు దాన్ని పరీక్షగా చూస్తూ మరీ ఆలోచిస్తున్నాడు, ఇంతలో ఆ సైకిలతను వేణుని

తెమ్మననేనా చెప్పకుండా సైకిలు లాక్కొని పోయాడు. ఎంత విస్పాటం. ఒహవేళ తను నిలకడతప్పి పడిపోయుంటే? అయినా వాడి సైకిలు జోలికి తనెందుకు పోయినట్లు? ఆ....అదీ....ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది.

చాలాఏళ్ళక్రితం నాన్నగారి సైకిలుపోయినప్పుడు, మరో పనీపాట లేకుండా కనపడ్డ సైకిల్లా తమ దేమోనని చూస్తూ వుండేవాడు. పై వూరికి చదువుకి వెళ్ళిన తరువాత, అది బాగా తగ్గిపోయి, ఒక సైకిలు పోయినట్లుకూడా జ్ఞాపకంలేకుండా అయిపోయింది. ఇప్పుడు గాని మళ్ళా తిరగ బెట్టిందా. కొంప తీసి. నవ్వుకుంటూ బయలు దేరాడు.

పై వూరికి తను ఎందుకు వెళ్ళినట్లు? ఆ ప్రశ్న పంపించిన నాన్నగారే అడిగి సమాధానం లేదని కాబోలు మళ్ళీ వూరుకొనే వారు. ఎందుకేమిటి. బుద్ధిలేక.

"టౌను పక్క కెళ్ళద్దురా. డింగరీ

డాంబికాలు పోవద్దురా,

టౌనుపక్క కెళ్ళావో. డౌనై పోతావో

రబ్బీ నారంగసామీ.

అని హుషారుగాపాడటం మొదలెట్టాడు. అసలింతకీ ఇప్పుడు ఎవడిని అడగడం పది రూప్యములు. దండోరా వేయిస్తేనో?

"టౌను పక్క కెళ్ళద్దురా...." జోరుగా పాడుతూ నడుస్తున్నాడు.

"ఎక్కడికోయ్ అలాపారిపోతున్నావ్?" వెనకనుంచి వెంకట్రావ్ కేక. ఆగిచూశాడు ఇంతలో వెంకట్రావే కొత్త రాలీ సైకిలు మీద దగ్గరకొచ్చి ఆగాడు. వీడి సైకిలుని పరీక్షగా చూడకూడదు! ఇది కొత్తది. చస్తే నాన్నగారిది కాలేదు.

"ఏమిటోయ్. చెప్పావు కాదేం! ఎక్కడికి పారిపోతున్నావూ అంట" మళ్ళీ అన్నాడు వెంకట్రావ్. "అదేనోయ్.... మా పిన్ని వచ్చింది ఇవాళ సాయంత్రం." అదే కారణం అన్నట్లు చెప్పాడు.

"అయితే...."

"అదే. మా అమ్మ ఎక్కడైనా ఓ పది రూపాయలు తెమ్మంది. అందుకని బయలు దేరాను."

చచ్చాడు వెంకట్రావ్. అనుకొన్నాడు వేణు. కోరి కోరి కొరివితో తల బరుక్కొన్నాడు. అదిగో చూడు ఎలా మాడిపోతోందో వాడి మొహం. వీడిని ఇవ్వమని ఎవరడిగారు. అయినా చూద్దాం ఏం చెప్తాడో.

"పది రూపాయిలా?.... ఎక్కడికో ఎందుకు. నేనిస్తా నీకు నిజంగా అవసరం వుందంటే కాని. తెలివి తక్కువ ఖర్చు మాత్రం చేయకూడదు."

తెలివి తక్కువ ఖర్చు. వీడివుద్దేశం అదే కదూ. వీడెగరేసే డబ్బు ముందర తన ఖర్చు ఏ మాత్రం. అయినా నేనేం చేస్తే వీడికెందుకు- నా యిష్టంవుంటే పది రూపాయలుపెట్టి తాగేస్తాను. ఏమనుకున్నాడో.

"చూడు వెంకట్రావ్. నిన్ను పదిరూపాయలు నేను అడగలేదు. ఒకవేళ ఏదైనా అడిగితే, అవసరం తీర్చమని అడుగుతాను తప్ప నీ సలహా మాత్రం ఎప్పుడూ అడగను. అడగని సలహాలు ఇవ్వడం ఎంత మాత్రం ఉచితంకాదు."

"భేష్" ఏమనుకొన్నాడో ఏమో. పది రూపాయలనోటు చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు.


ఇనీ వకందుకు మంచిదే. కష్టంలేకుండా పని జరిగిపోయింది. కాని తిరుగుముఖం పట్టకుండా ఇంకా మీదికి నడుస్తున్నాడు.

"టౌను పక్కకెళ్ళద్దురా. డింభకా లారి లాల్లు లోలొద్దురా" ఇష్టంవచ్చినట్లు పాడుతున్నాడు.

అవును. ఇప్పుడేం చేయడం? ఇంటికి ఇంతవేగం పోవడమేనా. వెధవ వెంకట్రావ్ ఎందుకలా అన్నాడు? టక్కమని ఆగిపోయాడు వేణు ఓ దీపస్తంభందగ్గర. ఇది ఖర్చుపెట్టేస్తేనో? పెట్టవచ్చు.

ఒక్కసారి హుషారంతా కరిగిపోయింది. ఇంతవరకు వున్న హుషారుకు కారణం కూడా దొరికింది. పదిరూపాయలు పుట్టించడానికి మంచి కారణం ఒకటి ఇంతకు ముందు కనపడింది. అంటే అప్పుయిచ్చే వాడికి కారణం కావలసి వస్తుందనికాదు. తనకి తనుసమాధాన పరచుకోడానికి. అబద్ధం ఆడక్కరలేకుండా అడగడానికి. వీలుదొరికింది పిన్ని రాకవల్ల. డబ్బు దొరకగానే తెలివితక్కువ ఖర్చు పెట్టచ్చు. అందుకే తనకి తెలియకుండా ఈ హుషారు. కాని ఖర్చుపెట్టేముందు ఎంత విచారం! నేరకపోయి ఈపురుగు బుర్రలోకిదూరింది. దీనికంతకీ వెంకట్రావే కారణం. ఇప్పుడేం చేయడం?

రాత్రి పదకొండున్నర అయింది. నిషా మెల్లిమెల్లిగా విడుగుతోంది. "ఇంత వేగంగా ఇంటికి వెళ్ళడం మంచిదికాదు" రాత్రికి కుమారం లాడ్జిలో పడుకొని పొద్దున్న అక్కడనుంచి తిన్నగా ఆఫీసుకిపోతే మంచిది. మధ్యాహ్నం కాకి అరిచే వేళకి ఇంటికి చేరవచ్చు. ఇలా అయిపులేకుండా



కటి రెండు రోజులు మాయమైపోవటం ఇంట్లో అలవాటే. మహాఅయితే శాంతం పిన్ని ఇంట్లో వుండబట్టి అమ్మకి కొంచెం కష్టం కలగవచ్చు. కలగనీ.

కుమారం లాడ్జిలో చోటుదొరికింది. వాసన ఇంకా బాగా వస్తోందికాని వాళ్ళెవరూ నిద్రమత్తులో పోల్చినట్టులేదు.

దొరికిన పదిరూపాయలు ఖర్చు పెట్టేశాడు కాని, యిప్పుడు విచారం పట్టుకుంది వేణుకి. అ విచారంలోనే ఇటూ అటూ దొర్లుతూ రాత్రి ఏ రెండుకో ముడుకో పడుకున్నాడు.


పొద్దున్న కుమారం కుదిపి కుదిపి లేపాడు. టైము చూస్తే ఎనిమిదయింది. ఒక్క ఉదుటున గెంతి లేచాడు వేణు.


"చచ్చానురా. ఇంతవరకు నన్నెందుకు లేపలేదు?" కుమారం చెపుతున్న జవాబు వినిపించుకోకుండా ఇంటికి పరిగెత్తాడు. జోరుగా నడుస్తున్నాడే కాని వళ్ళంతా చితక్కొట్టినట్లుంది. గబగబా తెమిలి ఆఫీసుకి వెళ్ళాలి. అక్కడ మళ్ళ వెధవచాకిరి. ఎంతకీ తెమల్దు. ఈ ఒక్క రోజేకాదు. తన లాంటి వాళ్ళు తరతరాలుగా చేస్తున్నారు ఆ పనిని. ఇంకా చేస్తారు కూడాను. అయినా పరవాలేదు. పని మాత్రం వుంటుంది.


గుమ్మంలో అడుగుపెట్టాడు. "వచ్చేవా, వేణూ, రాత్రి ఎక్కడికి పోయినట్లు?" శాంతం పిన్ని అడిగింది.

"అన్నయ్య అలాగే వెళిపోతూవుంటాడు పిన్నీ. అది మాకు అలవాటే!" రవి తన తరఫున చెప్పాడు. వాడి జవాబులోంచి తప్పించుకుంటూ, నవ్వేసి వూరుకున్నాడు. ఇంతలో కాఫీతీసుకొని అమ్మవచ్చింది. అరే కాఫీ వచ్చిందే. ఎంతకైనా అమ్మ అసాధ్యురాలు. పదిరూపాయల సంగతి అమ్మ అడగలేదు. వేణు కాఫీ ఎక్కడనుంచి వచ్చిందని అడగలేదు.

భోజనం చేసి ఆఫీసుకి బయలు దేరుతూ వుంటే వేణు అమ్మ అంది. "బాబూ, డబ్బు కోసం ఎక్కువ ప్రయత్నం చేసి బాధ పడకు. సుబ్రహ్మణ్యం మేష్టారుగారుసద్దారు. ఎలాగో ఈ రెండురోజులుగడిపేయవచ్చులే." ఎంతో సున్నితంగా. ఎంతో సహనంతో అంది. పాపం మాష్టారుగారిని అడిగిందన్న మాట. జీతం అందుకున్న మర్నాటి నుండి అప్పుకి బయలుదేరే సుబ్రహ్మణ్యం గారు డబ్బుసాయంచేశారంటే వేణుకికళ్ళు చెమ్మగిల్లాయి. అంతా మంచివాళ్ళే. ఆఖరికి వెంకట్రావ్ కూడాను. ఒక్క తనే ఇలా తయారయి దగా చేస్తున్నాడు. జరిగిన సంగతంతా చెప్పేసి భోరుమని ఏడుద్దామనిపించింది అతనికి. కాని అలాంటి పనేం చేయలేదు. కళ్ళు మాత్రం చిట్లించకుండా ఆఫీసుకి బయలు దేరాడు. □□□







కూనలమ్మ పదాలు
ఆరుద్ర

'అతడు – ఆమె'ల ఫైటు
అతివ ఛాన్సులు బ్రైటు
ఆడదెపుడూ రైటు
ఓ కూనలమ్మా!



ఆత్మవంచన వల్ల
ఆడు కల్లలవల్ల
అగును హృదయము డొల్ల
ఓ కూనలమ్మా!

వాతలుండిన నక్క
వ్యాఘ్రజాతిలో లెక్క
అనును కద తలతిక్క
ఓ కూనలమ్మా!




నూతిలోపలి కప్ప
పాత ఘనతలు తప్ప
మెచ్చ దితరుల గొప్ప
ఓ కూనలమ్మా!



రాజముద్రికె మొహరు
ప్రజల నేతయె నెహూరు
స్వేచ్ఛ పేరే యుహూరు,
ఓ కూనలమ్మా,




జనులు నమ్మేడి వరకు
కనులు తెరవని వరకు
వెలుగు నకిలీ సరుకు
ఓ కూనలమ్మా!



పాత సీసాలందు
నూతనత్వపు మందు
నింపితే ఏమందు?
ఓ కూనలమ్మా!



అయిదు రోజులు వేస్టు
అగుట కెయ్యది బెస్టు?
చూడుము క్రికెటు టెస్టు
ఓ కూనలమ్మా!



చెక్కు చెదరని వక్త
చేదు నిజము ప్రయోక్త
చంప బడును ప్రవక్త
ఓ. కూనలమ్మా!

ఎంకి పాటల దారి
ఎడద గుర్రపు స్వారి
చేయులే నండూరి
ఓ కూనలమ్మా!





చలిలో చిన్నవాడు

కె విహా రా

ఏమీ తోచని వాడి మనస్సులో ఆలోచనల్లా – నక్షత్రాలు ఆకాశం నిండా చెదురుగా మెరుస్తున్నప్పుడు, భూమ్మీద సముద్రంలో కెరటాలు ఎగిరి పడుతున్నప్పుడు, ఏమీ తోచక బాల్కనీ పిట్టగోడమీద కూర్చుని దగ్గర్లో వున్న సముద్రంకేసి, దూరంగా వున్న ఆకాశంకేసి కళ్ళు చురుగ్గా తిప్పుతున్న బాలరాజు యౌవనం వయస్సు చలిలో ఒక్క పెట్టున గజగజ వణికి పోయింది; కోరికల మంచు కురిసి తడిసిపోయింది.

ఒక్కసారి సముద్రపుగాలి వడిగా వీచింది. మనస్సుతోపాటు వొళ్ళుకూడా చలిలో వణికింది. హృదయానికి వేడిపుట్టి మళ్ళీ తారామతి గుర్తుకొచ్చింది. ఇలా రెండు రోజులుగా గుర్తుకొస్తోంది బాలరాజుకు తారామతి. ఎందుకు?– అని అతను ప్రశ్న వేసుకోలేదు. కారణం అతనికి తెలుసు.

హాస్టల్లో తిండి పడక ఊళ్లో సముద్రం వొడ్డున మేడమీద గదిలో రెండు రోజుల క్రితం అద్దెకు ప్రవేశించాడు. యూనివర్సిటీలో "ఎమ్మెస్సీ" చదువుతున్న బాలరాజు. ఎదిగే వయస్సులో వున్న బాలరాజు అందంగా వుంటాడు. ఎప్పుడూ నుదుటిమీద చెదిరి పడుతున్న జుత్తు, చురుగ్గా చూసే కళ్ళు 'కారీగ్రాంట్'ని గుర్తుచేస్తాయి. బాలరాజు

ముఖం ఆడముఖం. ఒకసారి అతను 'అయ్యో! నాది ఆడమొహం!' అని విచారించబోగా అతని అంతరాత్మ 'నీ మొహం' అంది కోపంగా. అందుకే బాలరాజు ముఖ విషయంలో ఎప్పుడూ విచారించడు.

ఎప్పుడూహుషారుగా వుండే బాలరాజుని ఇప్పుడు ఒక విచిత్రమైనబాధ బాధిస్తోంది. అతదిమనస్సుమీద పగతీర్చు కొంటోంది. అతని వయస్సు ఇరవైఏళ్ళు నిండి, మనస్సు పాతికేళ్లుపెరిగినా– పదహారేళ్ళకుర్రవాడిలా లేతబాలరాజులా కనిపిస్తాడు వయసొచ్చిన బాలరాజు. అలా కనిపించినందుకు అతనేమీ విచారించడు. కాని లేచింది మొదలు ప్రతీ వ్యక్తీ, ప్రతీ సంఘటనా, ప్రతీ విషయం ప్రతీక్షణం అతన్ని చిన్నవాడిగా పరిగణిస్తాయి. పదహారేళ్ళ బాలాకుమారుడిలా ఎంచి కాలాన్ని వెనక్కి నెట్టేసి అతనికి లేని చిన్నతన్నాన్ని అంట గడతాయి. అందుకే తను సిగరెట్టు కాల్చేవాడయినా నలుగురిలో నిర్భయంగా కాల్చలేడు. అతనికి ప్రేమించాలని వున్నా నలుగురిలో ప్రేమను గురించి స్వేచ్ఛగా మాట్లాడలేడు. మాట్లాడుదామనుకున్నా అతని లేతముఖం లేతగా కనిపించి అతని చిన్నతనాన్ని నలుగురికీ గుర్తుచేసి మాట్లాడనీయదు. అతన్ని ఇరవైయ్యేళ్ళ యువకుడిగా నలుగురిలో మసలనివ్వదు. సాయంత్రం జరిగిన సంఘటన యిప్పుడా బాధని మరింత పెక్కువచేసింది. తన పుట్టిన రోజువండగ విందులో అందరికీ సిగరెట్లు యిచ్చి తనకి స్వీట్సు యిచ్చిన మిత్రుడు శేఖరాన్ని తల్చు కుంటే కోపం వస్తోంది. సిగరెట్టు యివ్వనందుకు బాలరాజు బాధపడలేదు. కాని అలా

చెయ్యడంద్వారా తనకు తన ముఖం అంటగట్టిన చిన్నతనాన్ని అందరి యెదటా ప్రదర్శించడమే అయింది. అందుకే బాలరాజు బాధ.

తనకీ వయస్సు వచ్చింది. తనకీ మనస్సు పెరిగింది. చలివేసినప్పుడల్లా తనకీ వేడి కోరికలు పుడుతున్నాయి. ఎవర్నైనా ప్రేమిస్తే బాగుండును అని తనకీ అనిపిస్తోంది. కాని మధ్యలో ఈ 'చిన్నతనపు బాధ' వచ్చిపడింది. ఈ బాధ బాధలా వుండదు. మనస్సుని కొరుక్కుతింటోంది. హృదయాన్ని రంపపుకోత కోస్తోంది. తనను ఎవ్వరిచేతా ప్రేమించబడనీయదు. అందమైన ఈడైన ఆడపిల్లలచేత 'పరాయి మగాడి'గా గుర్తింపబడనీయదు. కోరికల్ని పెంచడమే దీనిపని. ఇలాగే క్రమంగా మనస్సు ముసిలిదైపోతే?– అమ్మో!– ఇంకేమన్నా వుందా?

చివరిదమ్ములాగి సిగరెట్టు పారేసి ఇరవై ఏళ్ళ వయస్సు, పాతికేళ్ళ మనస్సు గల బాలరాజు తలపైకెత్తి ఆకాశం వైపు చూశాడు. పున్నమి వెళ్ళి నాలుగు రోజులైంది. పున్నమితోపాటు చల్లటి చలి, వేడి వెన్నెల కూడా నిరుపయోగమై వెళ్ళిపోయాయి. ఇప్పుడు ఆకాశం మధ్య వొంటరి చంద్రుడు చేతకాని వాడు చేసిన చపాతీలా వున్నాడు. నక్షత్రాలు ఉండుండి మెరుస్తూ, చంద్రుణ్ని చూసి చిన్నబుచ్చుకుంటున్నట్టున్నాయి.

బాధపడినబాలరాజు, మనస్సులో లెక్క వేసుకున్నాడు.

ప్రేమించే దాకా మనస్సు ఊరుకోదు. ప్రేమిస్తే గాని పెద్దవాడిగా గుర్తింపబడటం

కష్టం. కాబట్టి ప్రేమించాలి. చూడగా ప్రేమే శరణ్యంగా కనిపిస్తోంది.

అలా కనిపించగానే అతని వయస్సు స్త్రీని గురించి ఆలోచించింది. అతని మనస్సు ప్రేమను గురించి ఆలోచించింది. మగాడు కోరికతో ప్రేమని ప్రారంభించి ప్రేమతో ప్రారంభించా ననుకుంటా డన్న సంగతి ఒకటి ఇప్పుడూ బాలరాజుకి విదితమైంది. అవును. ప్రేమజన్మస్థానం కోరిక. కోరిక జన్మస్థానం స్త్రీ.

ఇంటిముందు కారాగిన శబ్దమైంది. సముద్రంమీది దృష్టి యింటిముందు కారుమీదికి మళ్ళింది. కారులోంచి దిగింది - తారామతి. మనస్సులో పెద్ద ఆలోచన. తల వొంచకుండా ఠీవిగా నడుస్తూ లోపలకి వెళ్ళింది. వొయ్యారం మరిచిపోయినట్టు. ఎందుకో, ఠీవి ఆడవాళ్ళలో బా గుం డ దు. తారామతి అంతా బాగుంటుంది. ఒక్క నడకే - హంసలా నడవకూడదూ?- హంస నడక తెలియదేమో ! పోనీ - గు ర్రం పిల్లలా నడిచినా బాగుణ్ను. తన ప్రేమ సఫలమయితే ముందు నడక నేర్పాలి. విచిత్రం ! రెండురోజుల క్రితం పరిచయం మనస్సు నిండా యెంత పెద్ద ఆలోచనగా వ్యాపించి పోయింది !

వచ్చిన రోజునే ఇంటాయన పరిచయం చేశాడు - మెడిసిన్ చదివే తారామతిని. ఆమె బాబాయట. తన తండ్రికి బాల్య స్నేహితుడుట. ఆమె తల్లీ తండ్రీ మరో వూళ్ళో వుంటున్నారుట. ప్రస్తుతం ఈయన దగ్గిరే పెరుగుతోందిట. ఆయన చాలా నెమ్మది. ఎక్కువగా ఏమీ పట్టించుకోడు. మాట్లాడడు. మంచిమనిషి. ముఖ్యంగా తారామతి పరిచయం.

ఆమె లోపలికి వెళుతూ మొక్కలమధ్య నిలబడి క్షణం ఆగి మరీ వెళ్ళింది. ఆమె ఆగి నిలిచినచోటు చూశాడు. పవిత్రంగా - వెలితిగా వుంది. పక్కగా కుండీలో ఎండిన ఫెరన్ మొక్క. విరిసిన జాజులమధ్య కనకాంబరాలమధ్య. ఎర్రటి గు లా బీ ల మధ్య - వొంటరిగా. దిగులుగా యెండిన ఫెరన్ మొక్క - తారామతి వదిలిన చోటు వద్ద క్రుంగి వుంది.

వేడికలల మధ్య చలిగాలిలో కొత్త మేడమీద బాలరాజు వొళ్ళు మరచి నిద్రపోయాడు.

● ● ●

ఎవరో తన్ను లేపుతున్నారు. చల్లటి చేతులు - చల్లగా. మంచికల. మంచినిద్ర పాడు చేస్తున్నారు. చేశారు. కంటి మసకలో పల్చటి చీరలో. పల్చటి జాకెట్టులో పల్చటి మనిషి - పెదాలమీద పల్చటినవ్వు. కులూ లోయలో విరిసిన తెల్ల కలువ పు వ్వు లా వుంది - తారామతి. చటుక్కున లేచాడు బాలరాజు. క్షణం సిగ్గు పడ్డాడు.

"ఎక్కువసేపు నిద్రపోవడం ఆరోగ్యానికి మంచిదికాదు.

"మీరు మెడిసిన్ ఎన్నో సంవత్సరం!"

ఆమె వినలేదు. "లేచి త్వరగా స్నానం చెయ్యండి ఎనిమిదయితే కుళాయి కట్టేస్తారు. నీళ్ళుండవు."

"మీకు మేలుకొలపడం బాగానేవచ్చు."

"మీ నిద్రతో నాకు పనిలేదు. ఇంట్లో సోమరితనంవుంటే బాబాయి పట్టించుకోక పోయినా నేనుమాత్రం సహించలేను. లేచి వేగిరం స్నానం చెయ్యండి." అని క్రిందికి వెళ్ళింది.

తారామతిలో ఈచొఱవ బాగుంటుంది అనుకొని బాత్రూమ్‌లోకి నడిచాడుబాలరాజు.

గదిలోకి వచ్చిన బా ల రా జు చకితుడయాడు. తను యెన్నో కథలు చదివాడు. చరిత్రలు చదివాడు. ప్రాచీన ప్రబంధాలు పఠించాడు. వాటిలో యెక్కడా ఏ కథానాయికకీ ఈ అ ం ద ం కూర్చబడలేదు. ఏమైనా కల్పన సహజాన్ని అనుకరించలేదు. అందంగా, అందానికి నిర్వచనంలా, తెల్ల చీరలో, నల్ల జాకెట్టుతో దేవతలా - తారామతి. చేతిలో మదిర నింపిన చషకం. కంటిముందు మసకపోయి మత్తుపేరుకుంటోంది.

"ఏమిటా చూపులు ? జంతువుని చూసినట్టు. కాఫీ మీకే. గాలికికాదు."

తడబడి బాలరాజు కాఫీ కప్పు చేతికి తీసుకుని సాసర్లో సగం పోసుకుని. కప్పుని ఆమెకి అందివ్వబోయాడు.

"నేను తాగాను."

"తాగిన వాళ్ళుకూడా కాఫీ తాగుతారు తీసుకోండి. చాలికిపోతుంది."

ఆమె నవ్వింది. తీసుకుంది. సిప్ చేసింది. గొంతులో దిగువకి దిగిన కాఫీజాడ కనబడింది. కాఫీ ముగించి అన్నాడు. "చాలా బాగుంది."

"ఏమిటి ? కాఫీయేనా ?"

"కాదు. కప్పు. మంచి పి ం గా ణీ తో తయారు చేసినట్టుంది - నాకు పింగాణీ వస్తువులంటే చాలా యిష్టం. మీకు ?"

"స్నానం చేసినా యింకా నిద్రమత్తు పోనట్లుంది."

"నిద్రపోయింది. కాని మత్తు-"

"నేనువెళ్తాను. కాలేజీకి టైమవుతోంది."

"నాదగ్గరికి యిలా పొద్దున్నే రావాలని. నిద్ర లేపాలని."

"బాబాయి పంపించారు. కొత్తముఖం. చిన్నముఖం, అలవాటులేని ముఖం. మేడ మీద వున్నాడు. ఏం కావాలోచూడు. ఎలా వుండాలో చెప్పు- అని. బాబాయికి మీరంటే తగని అభిమానం." అమెవెనక్కి తిరిగింది. ఓరకంట చిలిపిగా చూసింది.

"రేపూ రండి. నాకు రోజూకొత్తే. అన్నీ మరచిపోతాను - మిమ్మల్ని చూస్తుంటే." చివరిమాట మనస్సులో అనుకున్నాడు. ఆమె గదివిడిచి వెళ్ళిపోతోంది. సుదీర్ఘమైన వేణీద్వయం క్రిందికిదిగి వె ను క వై పు అందాన్ని దాస్తోంది. చిలిపిగా మాట్లాడే టప్పుడు తలని స్థిరంగా ఉంచిన ఘనత దానిదేనేమో ! అందం మేడదిగింది. తారామతి వెళ్ళగానే బాలరాజు మనస్సు 'చిత్రం!' అనుకుంది. చలాకీతనం, చొఱవ, అనుకోని ప్రవర్తన - అందంలో దాగిన అందాలు - బైటపడితే విచిత్రాలు. విచిత్రం ! తన ప్రేమకోరిక యింత త్వరగా ఒకతీరానికి వస్తుందనుకోలేదు.

● ● ●

సాయంత్రం పిట్టగోడమీద బాలరాజు చేతిలో కాలుతున్న సిగరెట్టూ, కంటిముందు దూరంగా క్షితిజం మీద మంచు తెరలాంటి వెలుగూ ముగిసి పోతున్న వేళ తారామతి మేడమీదకు వచ్చింది.

"రండి. మీ గురించే ఆలోచిస్తున్నాను." బాలరాజు అన్నాడు.

ఏమిటి?-అని అతను ఊహించుకొన్నట్టు ఆమె అడగలేదు.




"మీరు సిగరెట్లు కాలుస్తారన్న మాట:"

"ఏం? మీ కిష్టంలేదా?"

"అవును. ఇష్టంలేదు. అవి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. అయినా ఇంత చిన్నతనంలోనా అలవాటు?."

బాలరాజు మనస్సు చివుక్కుమంది. ఈమె కూడా తన చిన్నతనాన్ని గుర్తు చేస్తోంది. ఎందుకిలా తన చిన్నతనం మీద ప్రతీవ్యక్తి పగతీర్చుకుంటున్నారు? తను వాళ్ళనేం చేశాడూ. అయినా తనేం చిన్నవాడని?



"నేను చిన్నవాణ్నా?" కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాడు. ఆ ప్రశ్నలో కనిపించని జాలి ధ్వనించింది.

"సిగరెట్లు కాల్చినంత మాత్రాన పెద్ద వాళ్ళయిపోరు." అని కెరటాలకేసి చూసింది. ఆమె కళ్ళు అప్పుడే కడిగిన బెల్జియం అద్దాల్లా మెరుస్తున్నాయి.

"ఏమైనా మీకంటే పెద్దవాణ్నే!" అ మాటలో అతని కోరిక స్పష్టమైంది. ఆమె నవ్వింది. విరిగిన కెరటాల వొంపులా బుగ్గలు వొంగాయి. తల విచిత్రంగా తిప్పి. "సరే. మీరుపెద్దవాళ్ళేకాని. సిగరెట్లు కాల్చడం మానేయండి. అవి మంచివి కావు." అంది. ముడుచుకున్న ఆమె పెదాల మరుగులో ఆప్యాయత కనబడింది. ఇన్నాళ్ళయి ఎవ్వరూ తనమీద ఇంతగా శ్రద్ధ చూపలేదు. బాలరాజు చిత్రంగా సంతోషపడ్డాడు.

సిగరెట్టు ఖర్చయిపోయింది. సముద్రం అంచుమీద వెలుతురు పోయింది. చీకటి పడింది. చలిగాలిలో బాలరాజులో ఆలోచనలు రేగాయి. తనకి ఆలోచనలంటే చాలా యిష్టం. ఏమీ లేకపోయినా వాటి సాయంతో హాయిగా బ్రతగ్గలడు. మనస్సులో వీటి పుట్టుకకి కారణాలు ఆలోచించాడు - సముద్రం. సిగరెట్టు. నవ్వొస్తోంది. సముద్ర తీరంమీద మోజుపడి హైదరాబాదు విడిచి. చదువుకోసం యింతదూరం వచ్చాడు. అక్కణ్నుంచి వచ్చేముందు ఇక్కడ ఇలా ప్రేమ. ప్రేమలో తారామతి యెదురవుతారని తనెప్పుడూ ఊహించలేదు. అంతా యాదృచ్ఛికం. ఎవరో నిర్ణయించినట్టు. కలలో లాగ వుంది.

దీపం వెలుగులో తారామతి చెంపలు మెరుస్తున్నాయి. ముంగురులు చెంపలమీద వ్రాలాయి - నిన్నరాత్రి కలలో తారామతి తన గుండెలమీద వాలినట్టు కనబడింది. ఆమెకేసి చూశాడు. తనొక ముంగురైపోయినా బాగుణ్ను.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది.

"ఆలోచన."

పిట్టగోడమీదికి వాలిన ఎదిగిన కొబ్బరి చెట్టు ఆకులు త్రుంపి ముఖంమీదకి కొడుతోంది. బాలరాజుకి పరవశంగా వుంది. క్షణం ఆగి ఆమె మాట్లాడింది.

"మిమ్మల్ని నువ్వు అని పిలిచేదా?"

ఆ ప్రశ్నమళ్ళీ తన చిన్నతనాన్ని గుర్తు చేసింది. బాలరాజుకి కోపం వచ్చింది.

"నేనేం చిన్నవాణ్ని కాను."

"మీరు చిన్నవారని నేననలేదు. ఎందుకలా మీ అంతట మీరు బాధపడడం? మీ కిష్టం లేకపోతే పోనీ లెండి" గోముగా అంది.

బాలరాజు తడబడ్డాడు. అంతలో సామీప్యానికి ఏకవచన ప్రయోగం ఉపకరణేమో అనుకున్నాడు. "ఇష్టం లేకపోవడం కాదు-"

ఆమె కళ్ళు పెద్దవి చేసి చూసింది. తను కళ్ళతో నవ్వాడు.

"బాలరాజూ!"

"తారామతీ!-" అని బాలరాజు పిలుద్దామనుకున్నాడు. కానీ క్రిందనుండి ఆమె బాబాయి పిలిచారు. గుడ్‌నైట్ చెప్పి మెట్లు దిగి ఆమె వెళ్ళిపోయింది. 'నామాటలు యింకొకరు ఎందుకు మాట్లాడాలి?' అని నిద్రపోయేముందు అనుకున్నాడు బాలరాజు.

మర్నాడు కూడా ఉదయాన్ని తారామతి కాఫీ యిచ్చింది. మనస్సుకి దగ్గర

పడుతూ మాట్లాడింది. ఈ అలవాటుకి బాలరాజు, తారామతి పదిరోజులలో పాతబడ్డారు.

● ● ●

ఆ ఉదయం మామూలుగా కాఫీ తెచ్చేసరికి తారామతి కంటికి 'మొరేవియా' రాసిన నవల చదువుతున్న బాలరాజు కనిపించాడు. అలాకనిపించిన మరుక్షణం ఆతనిచేతిలో పుస్తకం లాక్కొని మూలకు విసిరికొట్టి అంది. "ఇలాంటి పాడుపుస్తకాలు చదవమని నీ కెవరు చెప్పారు?"

"అది పాడుపుస్తకమని నీ కెవరు చెప్పారు?"

"బుద్ధిలేక నేనే ఒకసారి చదివాను. చదివింతర్వాత తెలిసింది. అది పాడుపుస్తకమని. అసలీ మగాళ్ళెప్పుడూ ఇంతే. సెక్సు తప్ప మరి మంచి విషయాలు మనస్సుకి తట్టవు. ఆ మొరేవియాని యెవరేనా చంపేస్తే బావుణ్ను."

"సెక్సు మంచిది కాదనుకోవడం మన పొరపాటు. సృష్టించడానికి దేవుడికి సిగ్గులేకపోయింది; అనుభవించడానికి మనుష్యులకి సిగ్గులేక పోయింది. వ్రాయడానికి మొరేవియాకి. చదవడానికి మనకీ యెందుకు సిగ్గు?"

"సిగ్గులేకపోతే సరి. ఏమిటా మాటలు? దేనికైనా పరిమితి వుండాలి. ఆ పుస్తకాలంటే అంత పడిచచ్చేవాడివయితే మెళ్ళో కట్టుకు తిరుగు. ఇక్కడెవరూ నిన్ను కాదనరు. ఇక నేను కాదన్నా నీకులెక్కేముంది గనుక?"

"తారా?" బాలరాజుపిలుపు గుమ్మంలోనే ఆగిపోయింది. ఆమెదిగి వెళ్ళిపోయింది అనుకోని ఈ సంఘటనకి బాలరాజు చకితుడయాడు. తను తారలో కోపం. బాధ చూడలేదు. తనమీద ఆమెకుగల ఆప్యాయతకు అతని మనస్సు రెపరెప లాడింది.

మర్నాడు ఆమె కాఫీతో కనిపించలేదు.

నిజంగా. చాలా పెద్ద కోపం వచ్చిందేమో? ఆ రోజంతా బాలరాజుని ఆమె లేని వెలితి బాధించింది. తను క్రిందకి వెళ్ళి పలకరించలేదు. తనకి చొరవలేదు. ధైర్యం లేదు. ఇన్నాళ్ళయి ఆయింట్లో మనిషయినా అతనికి తారామతి. ఆమె బాబాయి తప్ప మరోమనిషి జాడతెలియదు. అతను సరదాగా. స్వేచ్ఛగా. తృప్తిగా ఆమెతో తప్ప మరొకరితో మాట్లాడ లేదు. కాఫీ తాగినప్పుడల్లా తారామతి గుర్తుకొస్తోంది. తారామతిని తలుచుకున్నప్పుడల్లా కాఫీ గుర్తుకొస్తోంది. బాలరాజు మనస్సు అలా నాలుగు రోజులు పాటు తారామతి లేని తనంతోనూ. తారామతి లేని కాఫీ త్రాగడంతోనూ గిజగిజ లాడిపోయింది. అయిదో రోజు సాయంత్రం. అయిదు రోజుల క్రితం అనుభవాన్ని గుర్తు చేసింది.

అడుగుల చప్పుడువిని తలెత్తి చూసిన బాలరాజు కంటి ముందు నవ్వుతూ కాఫీతో తారామతి నిలబడి వుంది. ఆ నవ్వులో జీవం లేదు. చిక్కిపోయి. వాడిపోయి యింటి ముందు వాడి ఎండి పోయిన ఫెరన్ మొక్కలా వుంది. మిగిలిపోయిన వెన్నెల రేకలావుంది.

కాసేపుమౌనంతర్వాత అంది. "కాఫీ:"

"ఇప్పుడే త్రాగాను." అన్నాడు బాలరాజు. ఆమె కాఫీకప్పు టీపాయ్ మీదపెట్టి. టేబులుమీద ఎడంచేతిని ఆనించితలవంచుకు నిలబడింది. కుర్చీలో కూర్చోడానికి కష్ట పడుతున్న బాలరాజు పైకి చూశాడు. తారా

మతి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరుగుతున్నాయి. అతని గుండెలో వెయ్యి జెట్ ఫైటర్లు వడి వడిగా పరుగెత్తాయి. మొదటిసారిగా ఆమె కళ్ళలో పొర్లిన నీటిని చూసిన బాలరాజు కంగారుగా అడిగాడు.

"ఏడుస్తున్నావా ?"

"అవును."

నిజంగా చిన్నవాడిలా. "ఎందుకు ?" అని అడిగాడు. వేదనమధ్య కనిపించిన సానుభూతికి కన్నీరు పరాకాష్ఠ. ఒక్క-లిప్తలో ఆమె ఆవేదనంతా పెల్లుబికింది.

ఇన్నాళ్ళకి యెల్లాగయితేనేం నీ అంతట నువ్వు కాఫీ తాగేటంత పెద్దవాడివయి పోయావ్ ! నాలుగురోజులు జ్వరంతో వున్నాను - ఒక్క-డైనా నన్ను చూడాలని పించిందీ నీకు ?-ఎందుకనిపిస్తుంది ? అసలు నాగురించి నువ్వెందుకు పట్టించుకుంటావ్ ? నేను నీ కేమవుతాను ?"

"అది కాదు తా-"

"ఏదికాదు ? - నీ అంత నువ్వు వచ్చి నన్ను పలుకరిస్తావని ఈ నాలుగురోజులూ ఎంతగా యెదురుచూశాను ? ఇప్పుడు నీలో యెంత సానుభూతి కోరి వచ్చాను ? నేను కోరింది, ఆశించింది ఏమీ జరుగలేదు. ఈ ఇంట్లో ఎవరెలా పోయినా నాకు బాధలేదు. కాని ఆఖరికి నువ్వు -" దుఃఖంపొర్లింది. ఆమెచేతుల్తో ముఖం కప్పుకోలేదు. ఏడుపులో కూడా శీవి. నాటకంలో పాత్రలా బాలరాజు త్వరగా మాటలు పేర్చాడు.

"అలా ఏడవకు. నాకు మాటలు పెగలవు. నీకుకోపం వచ్చిందనుకున్నాను గాని, జ్వరం వచ్చిందనుకోలేదు. నిజంగా యిక్కడ నాకుమాత్రం 'నా' అని చెప్పుకో తగ్గవాళ్ళు యెవ్వరున్నారు ?- నువ్వుతప్ప. ఇప్పుడు నీ ఆసరా లేకపోతే అగాధంలోకి జారిపోతాననిపిస్తుంది. ఇలా చూడు తారా ! నాకేమీ తెలియదు. తప్పుచేశాను. నన్ను క్షమించవూ ?"

"అదుగో. అలా మాట్లాడితేనే నాకు కోపం వస్తుంది. ఎందుకంత పెద్దమాటలు మాట్లాడుతావ్ ? ఆడవాళ్ళని క్షమించమని అడగడానికి మగాడు ఎంతవెనుకాడాలి? నీలో ఆదేమీలేదు. అసలు నీకు మాటలుకూడా నేర్పాలి. ముందు కాఫీ తాగు"

"ఏం? కాఫీ తాగిం తర్వాత నేర్పుతావా?"

"ఏవిటి?"

"మాటలు."

"నేర్పావులే."

ఇద్దరూ ఒక్క-సారిగా సంతోషంగా నవ్వుకున్నారు. బాలరాజు మనస్సు తేలిక పడింది. అతను కదిలాడు. కాఫీ ముగిశాక ఇద్దరూ గదిబైటికి వచ్చి పిట్టగోడ మీద కూర్చున్నారు. రోజూలాగానే చీకటిపడింది. బాలరాజు అనుకున్నాడు - తారామతి నన్ను ప్రేమిస్తోంది. సందేహంలేదు. నేను తారామతిని ప్రేమిస్తున్నాను. సందేహంలేదు. నాది సందేహం లేని ప్రేమ. ఇంకా ఎందుకీ ఆలస్యం తెర ? మనసు విప్పి చెప్పేస్తే హాయి కన్పిస్తుంది - అని.

"తారా ?"

"ఊఁ,"

"నిన్నరాత్రి నాకు కల వచ్చింది - చెప్పేదా ?"

"చెప్పు."

"మళ్ళీ కోపగించుకోనని మాట ఇస్తావా"

"సరేలే. ముందు విసిగించక చెప్పు" ఆమె ఖరీదయిన పౌడరువాసన వేస్తోంది. దగ్గరగా వుంది. అబ్బ ! ఎంత దగ్గరికి !-

"ఏమీలేదు. మనిద్దరం చలిలోసముద్రం మీద పడవ షికారు వెళ్ళామట. చిన్న పడవ. అందులో మనిద్దరమే వున్నాం. ఇంతలో సన్నటి చినుకులతో వర్షం ప్రారంభమయింది. ఇద్దరం తడిసిపోతున్నాం. నేను పడవంతా కలియచూశాను. మూలగా ఒకే ఒక రైన్ కోటు—అదుగో నీకు కోపం వస్తోంది. చెప్పను."

పూర్తికాని కల విన్నతరువాత అప్రత్యాశితంగా తారామతి ముఖకవళికలు మారాయి. క్షణంలో ఆమె ముఖం ఉదాసీనంగా మారిపోయింది. "ఇక చెప్పొద్దులే రాజూ ! నాకు తెలిసిపోయింది. ఇప్పుడు నీ మనస్సు నాకు బాగా తెలిసిపోయింది" ఆమె ఆగి అంది. "నేను పెద్ద పొరపాటు చేశాను."

అతనిగొంతు వణికింది. "ఏమిటితారా?" అన్నాడు.

"నువ్వు నన్ను ప్రేమిస్తున్నావ్ కదూ?"

"అవునుతారా! - ఈ ఇంట్లో అడుగు పెట్టిన క్షణంనుండీ ప్రతీ క్షణం నిన్ను ప్రేమిస్తూనే వున్నాను. నీ మీద ఆశలు పేర్చుకుంటూనే వున్నాను - తారా! చాలా రోజులుగా నిన్ను అడుగుదామనుకుంటున్నాను. యింటిముందు మొక్క-లమధ్య ఎండి వాడిపోయిన ఫెరన్ మొక్క- నాకు కావాలని. ఎందుకో యిప్పుడు ఆ మొక్క-ని చూస్తుంటే నువ్వే జ్ఞాపకాని కొస్తున్నావు దానికి నీలాగా ఎప్పుడో జ్వరం వచ్చింది. ఎండిపోయింది. వాడిపోయింది- ఈ నాల్గు రోజులుగా నువ్వు ఎండి వాడి పోయినట్లుగా. ఈ నాల్గు రోజులూ ఏవో మందులు నీ ఆరోగ్యాన్ని బాగు చేశాయి. నిన్ను నిలబెట్టాయి, అయినా వాడిపోయావు. నా కెందుకో ఆ ఫెరన్ మొక్క-నీ, నిన్నూ దక్కించుకోవాలని నాదిగా చేసుకోవాలని అనిపిస్తుంది. నువ్వు నన్ను కోరితే, ప్రేమిస్తే - ఆ మొక్క-పువ్వులుపూసినట్లుగా-"

"ఫెరన్ మొక్క-లుపువ్వులు పూయవు-"

బాలరాజు మనస్సు స్తంభించింది

"నిజమా?"

"నిజం రాజూ! యిదివరకెన్నడూ పూయలేదు కూడా. - నేనూ అంతే"

"అంటే?" అతనికళ్ళు సమాధానంకోసం ఆమె ముఖాన్ని వెతుకుతున్నాయి. మనస్సు చూస్తోంది. ఇంద్రియాలు ఒకదానిపనిని మరొకటి చేస్తున్నాయి.

"అవును. ఇన్నాళ్లూ నిన్ను ఆ దృష్టితో నే నెప్పుడూ చూడలేదు. నిన్ను కేవలం ఒక తమ్ముడిగా చూశాను. ప్రపంచం అంటే ఏమీ తెలియని వాడిలాగ, పసివాడిలాగ చేతుల్లో పెరిగినట్లు కనిపిస్తావు రాజూ. ఎందుకలా నామీద ఆశలు పెంచుకున్నావ్? ఎందుకు నన్ను ప్రేమించావ్ ? ఎందుకింత పొరబాటు చేశావు !"

"తారా ! అలా అనకు. నాకు పిచ్చెత్తుతుందేమోనని భయంగా వుంది. నా ఆలోచనలు చచ్చిపోతాయి. ఇన్నాళ్ళూ నా ఆలోచనలమీదే ఆశతో బ్రతుకుతున్నాను. అవి త్వరలో అనుభవాలవుతాయని నా ఆశ. చూడు తారా: నాకు కావలసింది నీ సామీప్యం. నీ మనస్సుదగ్గర చోటు.అంతే.

నాబాధనీ నన్నూ అర్థంచేసుకో. నిన్ను చూసింది మొదలు నాలో ప్రతిశక్తీ నశించి పోయింది. తుదకు ప్రేమ మిగిలింది. అది నాకు లేకుండా చెయ్యకు తారా!"

ఆమె దూరంగా చీకటిలోకి చూస్తూ అంది. "నాకిప్పుడు నవ్వాలో ఏడవాలో తెలియడం లేదు. నిన్ను తమ్ముడిగా నాలో ఊహించుకుని నీమీద ప్రేమని ఎలా మలుచుకోమంటావు చెప్పు." ఆమె ఏడుస్తోంది.

అతనూ ఏడుస్తున్నట్టు ముఖం పెట్టాడు.

"నాలో ఆడది కోరే అధిక్యత లేదనేగా నీ వుద్దేశ్యం? తారా! ఏమీ వ్రాయని తెల్ల కాగితాల పుస్తకం నీకు దొరికింది. నీవ్రాతని బట్టేగా దాని అర్హతలు నిర్ణయమయేది. నా గుండెల్లో బాధ నీకు తెలుసు. నేను నీకు తెలుసు. నా కోసం ఆలోచించలేవూ?"


ఆమె లేచింది. "ఎలా ఆలోచించాలో తెలియడంలేదు. మంచి ఆలోచనలు లేకే ఈ నాలుగు రోజులూ చిక్కిపోయానా అనిపిస్తోంది-నీకేంతక్కువ రాజూ? నాకంటే అందమైన వాళ్ళెందరో జీవితమంతా నీతో కలిసి బ్రతకడానికి సిద్ధపడతారు."

"నేను మాత్రం అలా సిద్ధపడలేను. నీలో చూసిన అందాన్ని వాళ్ళల్లో చూడలేను. నా కిప్పుడు కావలసింది కోరికతీరడం కాదు తారా! నీతో కలిసి బ్రతకడం. నీ మనస్సు పంచుకోవడం-ఒక్క మాటలో 'నువ్వు'."

"ఇక నీతో మాట్లాడలేను. ఎటూ ఆలోచించుకోలేకపోతున్నాను. వస్తాను" అని చెప్పి తారామతి వెళ్ళిపోయింది. బాలరాజుకి పిలవాలనిపించలేదు. అతను హతాశుడై పోయాడు. మంచి జ్ఞాపకం స్మృతిని వీడినట్టు వెళ్ళిపోయింది తార. అతని మనస్సులో కోరికలు ఎండి తగులబడి పోతున్నాయి. మనస్సులో రూపం తయారుచేసిన వయస్సుని నిందించుకున్నాడు. ప్రేమలో ఎంత బలంవుందో అతనారోజు తెలుసుకున్నాడు.

ఆరాత్రి నిద్రపట్టక దేవుణ్ణి సంబోధిస్తూ యిలా వాపోయాడు:

"ఓ దేవుడా! హే భగవాన్! - నాకిప్పుడు నిజంగా ఇరవైయేళ్ళు. నామనస్సుకి పాతికేళ్ళు. నా పాడుముఖానికి పదహారేళ్ళు. నాకింత 'పెద్దమనస్సు' ఇంత పసిరూపం ఎందుకిచ్చావ్ దేవా? ఇంతపెద్ద మనస్సుతో యింత చిన్నవాడిగా ఎలా బ్రతగ్గలనను కున్నావ్ దేవదేవా! అన్నీ తెలిసి నన్నెందుకిలా ఏడిపిస్తావ్ భగవంతుడా! మగాడికి ఆడదితియ్యటికల అనీ, ఆడదానికి మగాడు తియ్యటి అనుభవమని నీకుమాత్రం తెలియదా పరాత్పరా! నా ఖర్మ కాకపోతే నేను తారామతి మేడమీదే ఎందుకు దిగాలి? నా ఖర్మకాకపోతే తారామతి రోజూ నాకు కాఫీ తెచ్చి ఎందుకివ్వాలి? నాతో ఎందుకంత చనువుగా మసలాలి? నా మహాఖర్మ కాకపోతే నన్ను తారామతి తమ్ముడిగా ఎందుకు భావించాలి?— తార ఎంతబాగా నవ్వుతుందని! నీకు తెలియదు లోకరక్షకా! తారనవ్వులో నిన్నుకూడామరచిపోతాను. ఓ దీనబాంధవా! నాబాధ నీకు తెలుసు. నా క్కావలిసింది - సెక్సు కాదు, ప్రేమ. నాకున్నదివాంఛకాదు, ప్రేమ. ఇప్పుడు సెక్సు బజార్లో ఖరీదుకి దొరుకుతోంది. ప్రేమ అలా దొరికేది



కాదు. దానికి ఖరీదులేదు. దానికి నిర్వచనం కూడాలేదు. అది అమూల్యము. కాబట్టి ఓ దీనదయాళూ! నన్ను త్వరగా పెద్దవాణ్ణి చేసి, నా యీ చిన్నతనపు బాధని పోగొట్టవూ!-నా తార నన్ను ప్రేమించాలని శాసించవూ!-" అంటూ ఈ విధంగా ప్రతి వాక్యంలో, ప్రేమనీ, దేవుణ్ణీ, తారామతినీ, తన మతినీ రంగరించి మరీ వాపోయాడు, విలపించాడు-వేడుకున్నాడు-పదహారేళ్ళ రూపం, ఇరవైయేళ్ళ వయస్సు పాతికేళ్ళ మనస్సుగల ప్రేమపక్షి బాలరాజు.

● ● ●

తెల్లారాక తారామతికి దాదాయి చెప్పినప్పుడు తెలిసింది-కారణం చెప్పకుండా బాలరాజు మేడగది వదిలి వెళ్ళిపోయాడని. ఆమె అదిరిపడింది వెంటనే. త్వరత్వరగా మేడ ఎక్కి అతని గదికి వెళ్ళింది. ఖాళీగా వెలితిగావుంది. తారామతికి మతిపోయింది. ఎందుకిలా హఠాత్తుగా తనకు తెలియబరచకుండా వెళ్ళిపోయినట్టు? ఎక్కడికి వెళ్ళిపోయినట్లు?- తను లేకపోయిం తర్వాత ఈ ఇంట్లో అతనికి ఏమీ లేదని నిర్ధారణకొచ్చాడా?-క్షణంసేపు విపరీతంగా భయపడింది తారామతి. మనస్సులో ఆలోచనలు సాగలేదు. చుట్టూ కలయజూసింది. ఎదురుగా టేబులుమీద బాలరాజు డైరీ. సందేహంలేదు. అది తనకోసమే వదిలివెళ్లాడు. తను చూడాలని. చేతిలోకి తీసుకుంది. అట్టమీద పందొమ్మిది పక్కన అరవైనాలుగు పెన్నుతో కొట్టేసి డెబ్భై అంకెవేసి వుంది. కొత్త డైరీ. దాదాపు పేజీలన్నీ ఖాళీగా వున్నాయి. పైకి చెప్పలేని మూగబాధని మధ్య పేజీల్లో పొందికగా వ్రాశాడు బాలరాజు.

—పదేళ్ల ప్రవాసంలో గడిపి వెలుగుని చూసినట్టయింది నాకు తార కనిపించాక. ఇన్నాళ్ళూ ఆలోచనలకి అలవాటు పడిన మనస్సు అనుభవాలకి అలవాటు పడుతుంది అనుకున్నాను. ఫలితంగా నిరాశ నిలిచింది. అన్నీ పోయాయి ఇప్పుడు మనస్సుకి తోడు నిలిచేందుకు ఏమీలేదు. ఆలోచిస్తే బ్రతుకులో భయపెట్టే ఒంటరితనం వుంది. పాలుపోసి ఆప్యాయంగా పెంచిన నా రూపం నాకు ద్రోహం చేసింది. రూపాన్ని నమ్మకూడదు. దానికి కృతజ్ఞత లేదు.

—ఎంత ప్రయత్నించినా ఈ ప్రేమ నన్ను వదలట్లేదు - చేసుకున్న పాపం లాగ, తార రూపంలాగ. నిజంగా తారని పొందడానికి నేనే తగిన వాణ్ణి. ఆమెను నేను అర్థం చేసుకున్నాను. అర్థం చేసుకున్న వాళ్ళే అనుభవానికి అర్హులు.

—ప్రేమంటే ఏమీలేదు. ఆత్మ విశ్వాసాన్నీ, తృప్తినీ, గర్వాన్నీ, నిండుతనాన్నీ సంపాదించుకొనడానికి యవ్వనం ఆడే ఆట. ఉత్త షోక్సు. ఇద్దరు కలిసి బ్రతకాలనుకునే బలహీనత, నరాల పటుత్వం సన్నగిల్లినప్పటి వింతవ్యాధి.

—రోజూ యింటి పక్కనుంచి వెళ్ళినప్పుడల్లా ఓ కుంటి కుక్కపిల్ల నావేపు జాలిగా, సఖ్యతగా చూస్తూవుంటుంది. నిన్న దానివేపు చూస్తూ నడుస్తూవుంటే రాయి తన్నుకొని కాలి రక్తం బొటబొటా కారింది. ఆ కుక్క అరుస్తూ, గిలగిలా కొట్టుకుంటూ నా కాళ్ళచుట్టూ తిరుగుతూ, నాలికతో గాయాన్ని నాకుతానంటుంది. హఠాత్తుగా నాకో విషయం అర్థమయిపోయింది. అదే అదే! ప్రేమ - అయ్యో! కుక్కలకి పెట్టినంతనుంచి ప్రేమని మానవుడికి యివ్వలేదే!-

—కలలో దేవుడు కనిపించాడు. తుమ్మెదలనారి. చివురు, బాణము-వాడే-మన్మథ!- ఏంకావాలి?-అన్నాడు. 'నువ్వు మాత్రం వద్దు' అన్నాను. ప్రేమ లేకపోతే బ్రతగ్గలవా?-అన్నాడు. అదొక్కటే లేకపోతే ఆరోగ్యంగా ఉంటానన్నాను. నన్ను క్షమించి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయాక తార జ్ఞాపకానికి వచ్చింది. హా! తెలిసెను. బ్రతకలేను. మన్మథుణ్ణి ప్రేమ చంపేసింది.

—ఉన్నట్టుండి పెద్ద పక్షినయిపోయాను. రెక్కల్ని టపటప లాడిస్తూ ఎగురుతున్నాను. కొంతసేపు ఎగిరాక తీరా చూస్తే రెక్కలు లేవని తెలిసింది. తెలిశాక పడిపోతానేమోనని భయమేసింది. భయమేశాక దబ్బున పడిపోయాను. ఆలోచిస్తే తేలింది యిది. నేను ప్రేమ పక్షినయాను. రెక్కలు నా కోరికలు. లేవని గుర్తించడం చిన్నవాడనయిపోవడం. క్రింద దబ్బున పడడం నా ప్రేమ జీవితం కూలిపోవడం.

—నిజానికి నాకేం తక్కువ?- ఎందుకో ఎన్నియుగాలు గడిచినా మగాడిలో నిర్లక్ష్యాన్నే ప్రేమిస్తానంటుంది ఆడది. ఇక క్షణంకూడా యిక్కడ వుండాలనిపించడం లేదు. దూరంగాపోయి ఒంటరి తనంలో తారని చూసుకుంటూ బ్రతకాలని వుంది. మధ్యాహ్నం మెయిలులో వెళ్ళిపోతాను.

డైరీ చదివిన తారామతి చలించిపోయింది స్త్రీలో ఆర్ద్రతకి మల్లే మగాడిలో దైన్యత కూడా మనస్సుని కదుపుతుంది. ఆమె అలాగే నిలబడి పోయింది.

• • •

[illegible] గడిచాయి. చాల విషయాలు, సంఘటనలు పాతబడిపోయాయి. [illegible] ప్లాట్‌ఫారం ఎందుకో వెలిగా వుంది. రైలుకోసం ఎదురుచూస్తున్న తారామతి అనుభవాల పుట్టలాగ వుంది. పక్కన భర్త పేపరు చదువుకుంటున్నాడు - నుదుటిమీద గీతలు స్ఫుటంగా కనిపిస్తున్నాయి. సంసారానికి సాక్ష్యాల్లా మిగిలిన ఇద్దరు పిల్లలూ, బెంచీమీద ఆడుకుంటున్నారు. తారామతిదిక్కులుచూస్తోంది. ఇప్పుడు యాంత్రిక జీవితానికి అలవాటు పడిపోయింది. బ్రతుకులో అనుభూతులేవీ యిప్పుడు మనస్సు దరికి చేరట్లేదు.

ఉన్నట్టుండి ఆమె చూపులు ఒక్కక్షణం వెయిటింగ్‌రూమ్ గుమ్మంలో నిలబడి సిగరెట్ కాలుస్తూన్న వ్యక్తిమీద నిలిచాయి. అవును-అతనే.

బాలరాజు కళ్ళు మునుపటికంటె చురుగ్గా చూస్తున్నాయి. పెదాలు - ఎంత బాగుంటాయి. సిగరెట్లు కాల్చినా ఎంచేతనో వాడిపోలేదు. ఇంకా నవ్వుతున్నాయి. ముఖంలో లేతదనం చెరిగి పట్టుదల సిద్ధమౌతోంది. పదహారేళ్ళవాడిలా కనిపించిన బాలరాజు ఎంతగా ఎదిగిపోయాడు. ఇప్పుడు పాతికేళ్ళుంటాయి. నిండుగా, ఠీవిగా, స్ఫుటంగా-గొప్ప ప్రేమకి సిద్ధపడుతునట్టు. బాలరాజు బావున్నాడు. ఆ రోజు ఎందుకలా వెళ్ళిపోయాడు! మళ్ళీ ఆ రోజులు స్మృతిలోకి వస్తున్నాయి. గతం మనస్సుని కదిపి బాధాస్థిరత్వాన్ని జ్ఞాపకం చేస్తోంది. అప్పుడు తను ఎంత సుఖంగా వుండేది! బాలరాజు సరసన మాటల్లో-మళ్ళీ యిన్నాళ్ళకి సుఖం గురించి ఆలోచన! నవ్వొస్తోంది. అప్పట్లో బాలరాజుని మన్నించి పెళ్ళి చేసుకొనివుంటే ఎలా వుండేదో! ఛా! ఈ ఆలోచన కూడదు. తనకి పెళ్ళయిపోయింది. తన గతం చీకటిలో మిగిలిపోయింది. అతని జీవితంతో తనకేం సంబంధం? అయినా ఎందుకో మనస్సు సమాధాన పడటంలేదు.

సిగరెట్టు పారేశాడు.

ఎటో చూస్తున్నాడు. ఆ చూపులు ప్రపంచాన్నంతా క్షమించ గలవు. ఒకప్పుడు అవే చూపులు తన క్షమకోసం ప్రాకులాడాయి. అప్పట్లో తనకి క్షమించడం చేతకాలేదు. ఇప్పుడు చేతనయినా తను క్షమించలేదు. జీవితంలో తప్పటడుగు వేశానేమోనని పిస్తోంది. ఇప్పుడు బాలరాజు ప్రతిభని చూస్తుంటే మనస్సులో బాధ వరదై ప్రవహిస్తోంది. దాటిపోయిన రైలులాగ తన జీవితం ముందుకు లంఘించింది. ఇన్నేళ్ళ జీవితంలో నిజంగా, తన మనస్సుకి దగ్గరపడ్డ వ్యక్తి ఇంకెవ్వరున్నారు - ఒక్క బాలరాజు తప్ప. ఆ రోజు బాధపడి వెళ్ళిపోయిన బాలరాజు యింకా బాధ పడుతూనే వున్నాడా? ఇంకా తన్ను గురించి ఆలోచిస్తున్నాడా? అంత మంచి అందాన్ని తన ఆలోచనల్లో వృథా చేస్తున్నాడా? చేయకూడదు. అలా చేస్తే తను సహించలేదు. భరించలేదు. అతనికి పెళ్ళయి వుంటే బాగుణ్ను - తన మనస్సుకి ఊరట. అదిగేదా? అవును. మాట్లాడాలనిపిస్తోంది. ఇంకా అక్కడే నిలబడి వున్నాడు.

ఆమె వడివడిగా నడిచి అతన్ని సమీపించింది. "రాజూ!"

ఆ పిలుపు ఐదేళ్ళ పాతది. అయిదేళ్ళ క్రితం ఆప్యాయత కంటె ఆప్యాయంగా వుంది. అతను చూశాడు. విస్మితుడయ్యాడు.

"తారా !"

ఆమె వణికింది. ఎంతచక్కగా పిలిచాడు. మాటలో భావంలో కొత్తనిండుదనం కౌగిలించుకోవాలని పిస్తోంది. నుదుటిమీద పడే జుట్టు తొలగించి నుదురు చూడాలనిపిస్తోంది. ముచ్చటగా - చిన్న నుదురు.

"పెళ్ళి చేసుకున్నావా?" అదే తన మొదటి ప్రశ్న.

"లేదు. ఆరోజునుంచి అలాగే వుండిపోయాను. నీ గురించే ఆలోచన. అప్పుడప్పుడు పిచ్చివాణ్ణయ్యానేమోనని అనుమానం. అయినా బ్రతుకులో నిలబడగలిగాను. ఇప్పుడు నాకు బాగా లొంగిపోయింది బ్రతుకు. దేవుడు నా మనస్సు పాడు చేశాడనుకుంటాను ఎప్పుడూ. అలా అనుకుంటూనే ప్రతిక్షణం నీ గురించి ఆలోచించాను. కాని నువ్వు దక్కలేదు. మరొకర్ని పెళ్ళి చేసుకున్నావు. ఇల్లాలివైపోయావు. దూరమైపోయావు."

"మమ్మల్ని చూశావా యిప్పుడు?"

"అవును. అరగంట క్రితం నిన్నూ. ఆయన్నూ. పిల్లల్నీ కూడా చూశాను. ఇప్పుడు నిజంగా నాకంటె పెద్దదానివిలా కనబడుతున్నావ్. కులాసాగావున్నావా?"

"ఏం కులాసా? అంతా యాంత్రికంగా వుంది. అప్పుడు నువ్వు వెళ్ళిపోయిన కొద్దిరోజుల్లోనే పెళ్ళయింది. అప్పట్నుంచీ సుఖమంటే ఏమిటో మరచిపోయాను."

"అవును. వివాహం వల్ల మగాడు స్వేచ్ఛనీ. ఆడది సుఖాన్ని నష్టపోతారు."

"చాలా పెద్దమాటలు మాట్లాడుతున్నావు. పెరిగిపోయావు."

"పోసిలే - యిప్పుడు చిన్నవాణ్ణనే బాధలేదు. ఇన్నాళ్ళకయినా నా పెద్దతనాన్ని గుర్తించావ్ - కాని చాల ఆలస్యంగా గుర్తించావనే నా బాధ"

అవన్నీ పాతరోజులు. దయచేసి మరచిపోదామనుకున్నా. అవి నన్ను మరచి పోవట్లేదు. అందుకే నా ఆలోచనలు పెరగకుండా అలాగే వుండిపోయాయి. చివరికి పెరిగింది మనస్సూ. నేనూ. అంతే."

తారామతికి మనస్సు వికలమై పోయింది. మంచు శిఖరం కూలి మీదపడి నట్లయింది. బాలరాజు తన మూలంగానే పెళ్ళి చేసుకోకుండా వుండిపోయాడు! అతని ఒంటరితనానికి తనే కారణమా! తనే అయితే ఎంత పొరపాటు చేసింది. అతని బ్రతుకుని ఎంతగా పాడుచేసింది. ఎందుకలా చేసింది. అతనిలో అసమగ్రత ఏం కనిపించిందని?- ఉరుములనదుము, మెరుపులనదుమ నిలబడి మేఘాలనుండి పడే నీటికోసమే ఎన్ని యుగాలైనా ఆశతో ఎదురు చూస్తుంది కాని మరోనీటిని కోరదుట చాతకపక్షి. చూడగా బాలరాజూ అంతే ననిపిస్తూంది.

ఏమిటో మాట్లాడు తున్నాడు - ఫెరన్ ముక్కు అలాగే వుందా? బాబాయి బావున్నారా?-' తనకేమీ వినిపించడం లేదు. పిచ్చి బాలరాజు అనుకోబోయింది. ఇంతలో రైలు వేగాన్ని చంపుకుంటూ స్టేషన్లోకి వచ్చేసింది.

● ● ●

డైరీ పట్టుకొని అలాగే నిలబడిపోయిన తారామతి కొన్ని క్షణాలపాటు ఈ విధంగా

కలగంది. తర్వాత-అమ్మో!- యిది నిజమైతే యింకేమన్నా వుందా? ఇక ఆలస్యం చెయ్యకూడదు. బాలరాజుని వదిలి తను దూరంగా వుండలేదు. వెళ్ళాలి. త్వరగా స్టేషన్‌కివెళ్ళి బాలరాజుని ఆపాలి అనుకుని కంగారుగా తొట్రుపాటుతో మేడదిగి కారెక్కి స్టేషన్‌కి బయలుదేరింది. మధ్యలో ఎందుకో దుఃఖం వచ్చింది. దారిపొడుగునా అనేక ఆలోచనలు విచిత్రంగా ఆమెలో చెలరేగాయి.

తారామతి తడబడుతూ స్టేషన్లోకి అడుగు పెట్టేసరికి. రైలు ప్లాట్‌ఫారం వదిలింది. ప్రయత్నానికి లొంగని అసంకల్పిత లక్ష్యంలా.

గుండె పగిలింది. హతాశయై వెనక్కి తిరిగింది.

చేతిలో సూట్‌కేసుతో బాలరాజు వేగంగా నడుస్తున్నాడు. తన్ను చూసి తడపడ్డాడు. ఆమె అడిగింది తేరుకుని. "నువ్వు వెళ్ళిపోయావనుకున్నాను."

"వెళ్ళిపోయేవాణ్నే. కాని రిజర్వేషన్ లేదన్నారు. సాయంత్రం తప్పక వెళ్ళిపోతాను" అతను తిరిగాడు.

"రాజూ !"

"ఎందుకు?" అటువైపు తిరిగి ముక్తసరిగా తలవంచుకునే అడిగాడు. ఆమె అతని భుజంమీద చెయ్యివేసింది. "ఇంటికి పోదాం రావూ !" ఆ పిలుపులో లాలింపు. వేడికోలు. అతని మనస్సుకోరిన ఉత్కర్ష ధ్వనించాయి.

"ఎందుకు? అక్కడ నాకింకా ఏం మిగిలిందని?"



"నేను."

అతను తలతిప్పి విచిత్రంగా చూశాడు. అతని నరాల కదలికలో ఆకస్మిక చైతన్యం ప్రవేశించింది.

"రాజూ ! నిన్ను..................నిజం !" ఆమె తడి పెదాలు చిత్రంగా కదిలాయి.

"తారా !" ఆమెకు భయంవేసింది. స్టేషనులో కౌగలించుకుంటాడేమోనని. అతను మొదట్నుంచీ అంతే. కంగారు మనిషి. ఏ భావాన్నీ దాచుకోలేడు.

తారామతి ముందుకు కదిలింది బాలరాజు ఆమెను అనుసరిస్తూ-తల్చుకుంటే పురుషుడికంటే స్త్రీయే సెంటిమెంట్లనితెంపుకోగలదు. తనకు కావలసినవిధంగా మలుచుకోగలదు- అని నిర్వచించుకున్నాడు.

బాలరాజుకి యిప్పుడు చలిరహస్యం తెలిసిపోయింది. ◻◻◻

ఫిబ్రవరి

1. పాపం చేస్తే పశ్చాత్తాప్పడవచ్చు
పాపం చేయకుండా కాలయాపన చేస్తే
పశ్చాత్తాప్పడీ లాభంలేదు.

2. పసువు ప్రతిష్ఠగల ఆట క్రికెటు

3. పదవికోరను నేను
నేను కోరేది పెదవి

4. పంట పండించటంలో పూజ్యమయినా,
కోతలు కోయటంలో మొనగాడు

5. వర్తమానకాలంలో వంశప్రతిష్ఠకంత
ప్రాముఖ్యంలేదు; - గుఱ్ఱాలలోతప్ప

6. కాంగ్రెసు వాళ్ళకు
వణకటం తగ్గి ఏకటం హెచ్చింది

7. పంజాబును ఐదు పదిచేయటమే గాక
మనదేశాన్ని సగం వంగదీశాడు
మహమ్మదలీ జిన్నా.

8. పురాణాలను ఆరు మూడు
చేస్తానంటాడు, ఈ. వి. రామస్వామి
నాయకర్.

9. "మావ్ మావ్ మావ్"
పిల్లికూతకాదు, చీనాపులిది

10. ప్రస్తుతం చాలామంది సినిమా
ప్రొడ్యూసర్లు డబ్బుచేస్తున్నారు.

11. పంచశీలం నేడు
పటాపంచశీలం

12. మాట దప్పుటకు మహాత్ముడు సరి
అల్పునికి మాట అనుల్లంఘనీయము

13. విద్వేషాలు విపరీతమయినందున
ఆనాడు ఆటలంను కూడా ఆడుకోడానికి
అర్ధద్వయం కలుగుతోంది

14. పాశ్చాత్యసంఘం:- తనస్నేహితులంతా
తనభార్యను, తాను తన స్నేహితుల
భార్యలను కామించుటకు
వీలున్న వినోద విధానము

15. ముఖ్యవిషయాలను చులకనగాను,
చులకనగువాటిని ముఖ్యముగాను
చూచుట భాగ్యవంతుల అభ్యాసము

16. ధనం చాలా అనర్థకం
ధనంవుండు దానికన్నా అనర్థకతరం
ధనం లేకుండుట

17. ఎయిర్ హోస్టెసు = విమానవతి.

18. మందువల్ల యుద్ధంలో
మనుష్యులు చస్తారు

19. తలకు అందం లోనవున్న బుద్ధి;
మీదవున్న పాగాకాదు.

20. దాగుపడాలన్న
భయంవద్దు భక్తివద్దు

21. సర్వాధికారం వున్నప్పుడు, ఆ
అనుభవంలో అంత సంతోషములేదు.
భయముతో కూడిన అనుభవమే
బ్రహ్మానందము.
ఇదే పరకీయ ప్రేమకు హేతువు

22. స్కిన్ డాక్టర్ల వద్దకుపోవటం పొరపాటు
చర్మం వలిచేస్తారు

23. పాంచాలి = పంచపాండవుల ఆలి

24. కాంచనం, కాంత, కాదంబరి అనేవి
జగత్తులో ముక్కాలు,
మిగిలింది నేను.

25. ప్రపంచములోని అభ్యుదయం
చాలాభాగం సంశయాత్ములవల్ల
సమకూరినదే.

26. నిరాశకన్నను దురాశ మంచిది.

27. తమిళదేశస్థులు గల్లంతా చేయడంతప్ప
ఇంతకూ వారిభాష అరవంగదూ!

28. నీవు కూర్చునట్టి డబ్బు ఇతర్లపాలు;
నిజానికి నీవు ఖర్చించునదే నీది.

29. పురాణములు నాకిచ్చలేదు
నాకునచ్చినవి, పుక్కిటి పురాణములు.

జ్యోతి

ఉగాది సంచిక

మార్చి, 1964

వచ్చేనెల ఎక్కువ పేజీలతో, కొత్తశీర్షికలతో
చక్కని కథలతో, మామూలు వెలతే
జ్యోతి ఉగాది సంచికగా వెలువడుతుంది

మచ్చుకు ఒక కొత్త శీర్షిక :
భామాకలాపం

మచ్చుకు ఒక మంచికథ :

గళ్ళరుమాలు (రచన) ధనికొండ హనుమంతరావు

చేదునిజం

"మిమ్మల్ని చూస్తూంటే ఆ పిల్లని తీసుకుని ముద్దులాడేట్టు వున్నారే"

మౌనంగానే నవ్వాడు రాజు – దూరంగా తల్లి పక్కన ఇసుకలో ఆడుకుంటూన్న పాపని లాలనగా చూస్తూ.

"మీకు చిన్నపిల్లలంటే అంత ఇష్టమెందుకో కొంచెం చెబుదురూ - బుద్ధవిగ్రహంలా కూచుని ఆ అలల్నీ, పాపని చూస్తూకూచోక"

ఆమెవైపు తిరిగాడు రాజు. నువ్వంటే నాకెంత ఇష్టమో చెప్పగలిగానా. పిల్లలంటే ఎందుకంత మమతో చెప్పడానికి?"

విశాలమైన ఆమె కళ్ళు బరువుగా వాలాయి. చెక్కిలలో అరుణిమ అలుముకుంది. కాసేపటికసద్దుకుని, కంటికొసనుంచి చూసింది. అతని గాంభీర్యం చూసి ఆమెకు నవ్వొచ్చింది.

"ఆ నీ వాలుకళ్ళుచూసి నీ వెంట తిరుగుతున్నాను అని చెప్పకూడదా?. నీలో ఆ మాత్రం 'రొమాన్స్' లేకపోతే ఎలా?" అంది నులిగా నవ్వుతూ.

ఆమె మాటలకి అలవాటు పడిన అతనికే [illegible]

"ఆ మాత్రం 'రొమాన్స్' చేతనయిన [illegible] నీతో చెప్పాలను కుంటున్నది ఇలా చెప్పలేకుండా వుందునా?"

అతని నిజాయితీ అర్థమైనా పోల్చుకో నట్టే నటించింది.

"అదికాస్త అడిగి ఔననిపించుకున్న తర్వాత 'రొమాన్స్' కాస్త చల్లారి పోతుందటగా?- అని విజ్ఞులన్నారులే" అందితేలిగ్గా నవ్వుతూ.

ఇంటికి తిరిగి వెళ్తూ రాజు ఉన్నట్టుండి మొదటిసారిగా ఆమె చేతులు తనచేతులోకి తీసుకున్నాడు.

అతని వదనంలో నిలిచిన నిశ్చయానికి ఆమె విచలితురాలైంది.

"నీ కభ్యంతరం లేకపోతే...."

"నా కభ్యంతరం లేదని నీకు తెలీదా రాజూ? కాని ఇది చాల లోతుగా వేళ్ళు పాతుకున్న అతి సున్నితమైన విషయం: మనం వున్న పరిస్థితులు కొంచెం మనసులో వుంచుకోవాలి. కావలసిన వాళ్ళ ఆశలను,

నవ్యకం ఎం.టి. జగన్నాథరావు

ఆచారాలను....నువ్వు సున్నితంగానడుచుకో వాలి. నీమీద నాకు విశ్వాసం వుంది. నీకు తెలీని విషయం చెప్పడంలేదు" అంది సుధ మృదువుగా తనచేతులు విడిపించుకుంటూ.

"అనుకోని పరిణామాలు అతి స్వల్ప కాలంలో వస్తున్నాయి. మన చుట్టూ వున్న మనకు కావలసిన వ్యక్తులు వారు పుట్టి, పెరిగి, జీవిస్తూన్న వాతావరణంనుండి విడి వడి ఆలోచించడం కష్టమేనేమో! మా వాళ్ళ కీ సంగతులు చెప్తాను. కాదనరనే నా నమ్మకం. రేపే మావూరు వెళ్తాను" అంటూ వెళ్ళాడు రాజు.


ఆమె తన చేతులు చూసుకొని సిగ్గు పడింది. ఆ రాత్రి ఆమె మనసులో ఎన్నో ఆలోచనలు సుళ్ళు తిరుగు తున్నాయి.

రాజు మనసు తనకు తెలుసు. అంత కన్న ఎక్కువగా అతని ఆలోచనా క్రమం తెలుసు. అతని వ్యక్తిత్వం తెలుసు. పెద్ద. పెద్ద విషయాలు మాట్లాడడు. ఆదర్శం కోసమని కుప్పిగంతులు వేసి తన సాహ చర్యం కోరడంలేదు. అసలు ఆశయాలు, సంఘం వీటి జోలికి పోయి కబుర్లు చెప్పడు. అయినా అతని నిండుహృదయంలో నిండిన విలక్షణమైన ప్రకృతి తనకు అనుభవమే అతనిద్వారా అతనికుటుంబం, తల్లిదండ్రుల ఆలోచనా క్రమం తను విన్నది. చదువు కొని ఉద్యోగం చేసే కోడలంటే వారి కున్న అభిప్రాయాలు తెలుసును. కాని అతడుమరీ పట్టుబడితే, తమ 'అడ్డు' తాత్కాలికంగా తొలగించి అతని కోరిక కాదనక పోవచ్చు! కాని ఆ 'అడ్డు' తామి ద్దరూ ఒకటైన తర్వాత కూడా నిలిచి. ఛేదింపలేని అడ్డుతెరలు. అసాంతం మిగి లితే, అతడు ముందు ముందు, ఏనాడైనా, తను చేసింది 'ఒప్పా?' అని ఆలోచిస్తే, తనకు బాధకాదా?! ఆ బాధ స్త్రీ సహజ మైన ఓర్పుతో తాను ఇముడ్చుకోగలదా? అసలు ఇముడ్చుకోవాలా? అసలు ఆ ఓర్పు తనలో వుందా? తనని వాళ్ళ వాళ్ళ 'దూరంగా' చూస్తే తన తప్పు లేకపోయినా వృధా శరీరమయిన జీవితం గడపాలేమో! అది త్యాగమనిపించుకుంటుందా?

ఏమో! తనకి 'త్యాగం, సహనం' ఈ పెద్ద మాటల అర్థం అంతగా తెలియదు.

ఆలోచనల నుండి తప్పించు కోడానికి 'సుమిత్ర'కు ఉత్తరం రాస్తూ కూచుంది:

చివరన వ్రాసింది-" ఈ మధ్య 'రాజు' గురించి ఏం రాయలేదని రాశావు - ఏం వ్రాయను? అంతా మామూలే .... అలా కాదులే. ఈ రోజు కొంచెం తేడా కనిపిం చింది. ఎందుకయినా మంచిదని కొంచెం హితోపదేశం చేశానులే! మనకుటుంబాల ఆలోచనలు కూడా కొంచెం మననం చేసు కుని నిర్ణయిస్తే మంచిదని చెప్పాను.



నువ్వు మరీ చిలిపిగా రాశావు - అతను చాలాబుద్ధిమంతుడు తెలుసా? మీ శ్రీవారిలా అద్భుతంగా 'కోర్టింగ్' చేయలేడనుకో: మీలాగా పెళ్ళికి ముందే ఫోటోలు, బీచి షికార్లూ, పిక్నిక్స్ - మాకివేం లేవు. నేను చూడా చాలా కుదురైన పిల్లని - నువ్వేమనుకుంటున్నావో కాని నువ్వు వూహించినంత రసవత్తర ఘట్టాల్లోకి దిగలేదులే.

ఇదిగో చెప్తున్నాను - నువ్వు చిలిపిగా వ్రాయడం మానేయక పోతే నాకు చాలా సిగ్గుగా ఇబ్బందిగా వుంటుంది. నేను పెళ్ళికాని, బుద్ధిమంతు రాలైన పిల్లనని జ్ఞాపకముంచుకొని వ్రాయి."

పన్నెండవరోజున సుమిత్ర జవాబు చదువుకొని నవ్వుకుంది. "పెద్ద 'సుమతి' కబుర్లు నాదగ్గర తీసెయ్! నువ్వెంత దాద్దామనుకున్నా మీ'రాజా'గారిమీద నువ్వు పెంచుకుంటూన్న మమతలు నీ ఉత్తరంలో గుబాళించాయిలే: ఆరోజున కొంచెం మారి ఏదో చేసేడన్నావు - అది కొంచెం చెబుదూ....విని ఆనందిస్తాను. దాచుకుంటే ఊరుకునేదిలేదు. నాకొక్కసారి నీదగ్గర కొచ్చి, నువ్వు ఆరాజాగారి గురించి ఆలోచిస్తూంటే, ఎరుపెక్కిన ఆ చెక్కిళ్ళు చూసి నీ సంగతి తెలిసిందని ఉడికించాలని వుంది ఎలాగూ నీ ఊహ తెలుస్తోంది. కనుక ఓ అమృతంగారూ - కాస్త యికనైనా 'ఆయన గారు' అని వ్రాయడం, అనడం అలవాటు చేసేసుకో ఇప్పట్నించీ"

'అల్లరిపిల్ల' అనుకుంది సుధ ఉత్తరం పూర్తిచేసి.

రాజు ఇంటికొచ్చి తన ఉద్దేశం చెప్పాడు. తండ్రి అంతా విని, ఏం మాట్లాడక, చివరన మాత్రం 'నీఇష్టం' అన్నాడు. ఆ అనడం అయన మనస్ఫూర్తిగా అనలేదని అనిపించింది రాజుకు. తల్లి గాత్రం బయటపడి పోయింది.

"మన దగ్గరవాళ్ళల్లో పిల్లలు లేరనా ఆ సంబంధం? అయినా అంత చదువుకుని ఉద్యోగం చేస్తున్న పిల్లతో నువ్వు సుఖపడతావన్న నమ్మకం నాకు లేదు"

రాజు విడమరచి చెప్పబోయాడు తల్లికి "మీరు ఊహించనైనాఊహించని మార్పులు పదిసంవత్సరాలలోవచ్చాయి. ఈపరిస్థితుల్ని కాదనలేము. చదువుకోకపోవడమే సుఖం ప్రసాదించేలక్షణమైతేమన అత్తయ్య సంసారం ఈ నాడింతఊబిలోఉండేదా? ఉద్యోగం చేయడమే తప్పయితే ఆడపిల్లల్ని చదివించడమెందుకు? చెల్లాయి కాలేజీలో చేరలేదా? అది పుట్టినప్పుడు అది కాలేజీలో చదువుతుందని నీకు తెలిస్తే, నీ కా రోజు 'ఫిట్టు' వచ్చినంత పని అయివుండేది. ఈ రోజున 'మా అమ్మాయి కాలేజీలో చదువుతోందని, నీవే చెప్తున్నావు. దేశంలోవచ్చిన మార్పుల్ని కాదనడం మూర్ఖత్వమే అవుతుందమ్మా!"

"'పాప' చదవడంవేరు. అయినా ఈ ఏడు దానిపెళ్ళి చేసేస్తాము. పైగా నాకు దాన్ని 'బి.ఏ.'లో చేర్పించడం సుతరామూ ఇష్టంలేక పోయినా మీనాన్నే చేర్పించారు" అంది ఆవిడ తన 'అడ్డు' కొనసాగిస్తూ.

"పిల్లల సుఖం కోరే మీరు, వాళ్ళ ఊహల్ని మన్నించలేనప్పుడు, మాకూ మీకూ బాధే మిగులుతుంది. నే చేసుకున్న నిర్ణయం మంచిదనే నా నమ్మకం"

అప్పటిదాకా ఊరుకున్న తండ్రి "వాడి మాట నువ్వెందుకు కాదనాలి? వాడికన్నీ తెలుసు. ముందు వచ్చే విషయాలు వాడికే అన్నీ తెలియజేస్తాయి, నువ్వు కాదనకు" అన్నాడు.

ఆవిడ రెండురోజులు మంతనాలు సాగించి చివరకు ఒప్పుకుంది.

తిరిగి వచ్చినరాజు, సుధతో అన్నీ చెప్పి "మనం సుఖంగా ఉండగలమనే నమ్మకం నాకువుంది. నామీద నమ్మకం వుంచి, నా కోరిక పాటించి, నాతో జీవితం పంచుకునేందుకు నువ్వు అంగీకరిస్తే నేను చాలా అదృష్టవంతుణ్ణి" అన్నప్పుడు ఆమెలో మధురమైన వివశత్వం అలముకొంది.

ఆ రాత్రి ఆమె ఆలోచనలు వింతగా సాగాయి.

....ముందురాబోయే జీవితం, రాజుకు తనమీదవున్న ఆప్యాయత, అతనిపై తను పెంచుకున్న మమతలూ - అన్నీ దివ్యానుభూతిని కలిగిస్తున్నాయి. కాని ఎక్కడో దూరంగా, నల్లని చారలా, ఓ అనుమానం ఆమె ఆలోచనల్లో దూరంగా వుంది. తన రాజు ఆ నల్లని, చీకటిలాటి ఆలోచనలు దరికి రానీయకుండా ఎత్తున వుండడూ? చదువుకొని ఉద్యోగం చేస్తూన్న అమ్మాయిల చుట్టూ తమాషాగా అల్లబడే సాలెగూడు లాటి కథలు చుట్టూ వున్నవాళ్ళకి సరదా అయినా, అనుభవించే వ్యక్తులబాధ అర్థంచేసుకోగలదెంతమంది? తన 'భర్త'గా రాజు, ఇప్పటిలాగా తిన్నగా, సూటిగా చూడగలడా?

తనకు చిన్నప్పటినుండి అలవాటైన చలాకీతనం, తను గ్రహించేలోపున తనకెంత వ్యథకలుగ జేసింది! అప్పటికీ సుమిత్ర తనని మందలిస్తూనే వుండేది. తను ఆనర్స్ చదువుతూండగా, మిత్రులనుకునే వ్యక్తులు రాసిన ప్రేమలేఖల వెనకాల వున్న 'బోలుతనం' తననెంత గాయపరచింది!

చదువు అయిపోయి, ఉద్యోగంలో చేరిన తర్వాత మెల్లిగా అన్నీ తెలిశాయి. తనతో కాలేజిలో పని చేస్తూన్న శర్మ ఎంతో మర్యాదగా మొదటి నుండి ప్రవర్తిస్తూ, ఇంటికి భోజనానికి పిలిచి, ఉన్నట్టుండి ఆ రాత్రి చేయిపట్టుకున్నప్పుడు - తను మగవాళ్ళతో స్నేహంగా వుండడమే 'తప్పా' అని వితర్కించుకొంది. ఆనాడు తన అసమ్మతిని తెలుసుకొని అతనీనాటికీ కక్షగా వున్నాడు. ఆ తర్వాత ముఖతా మర్యాద కనబరుస్తూ, తన వెనుక తన మీద ఎన్నో కట్టుకథలు ప్రచారంలోకి తీసుకొచ్చాడు. మళ్ళీ అతని భార్య ఎంతో సంస్కారం వున్నవ్యక్తి. తనతో ఎంతో ఆహ్లాదంగా మాట్లాడేది. శర్మ లాటి

● అటూ ఇటూ పరుగులు పెడుతున్న ఏడాది పిల్లవాణ్ణి చూపించి ఒక తల్లి పొరుగింటావిడతో "మా వాడు చూశారా? ఎనిమిదో నెలనుంచే నడవడం మొదలెట్టాడు" అంది.

"అబ్బా. నాలుగు నెలలుగా నడుస్తున్నా మీవాడు అలిసి పోలేదటండీ," అంది పొరుగింటావిడ.

వ్యక్తుల్ని తలుచుకున్నప్పుడు, తనకేమో ధైర్యం చాలడంలేదు.

ఇవన్నీ రాజుతో చెప్పాలనీ, తన ఉద్యోగ విషయం, ఇతర త్రా తన స్నేహితుల విషయం - అన్నీ చెప్పాలనీ ఆమె యెంతగా అనుకున్నా అతడు అమెను ఏనాడూ చెప్పనీయలేదు.

"నాకవన్నీ అనవసరం. చెప్పాలని వుంటే పెళ్ళయిన తర్వాత వంటరిగా చెబుదూ గానిలే. ప్రస్తుతం కాస్త నిన్ను తీరిగ్గా చూడనిద్దూ" అనేవాడు.

పెళ్ళికి వచ్చిన సుమిత్రతో "కాస్త అధికారకీత్యా చేస్తేమంచిదని మానాన్న గారిచేత అడిగించాను. ఆ విషయంగా మావ గారికి చాలా ఉపశమనగా వుంది" అంది సుధ.

సుమిత్ర చేసే వేళాకోళానికి చిన్న పిల్లలా సిగ్గుపడింది సుధ..

అడక్కపోయినా ఆడపడుచుకు, తనకూ లాంఛనాలు యిచ్చిన అడపెళ్ళివారిమీద గౌరవం కుదిరింది రాజు తల్లికి.

పెళ్ళి అయ్యాక "మా బొంబాయిరండి హనీమూన్‌కి" అని ఆహ్వానించింది సుమిత్ర.

"వస్తాంలే. ఇప్పుడు కాదు - కాలేజీకి సెలవిచ్చాక" అంది సుధ.

"అవునులే, బొంబాయి ఎందుకు వస్తావులే! నీ కసలు ఆయనగారితో జనంలేని ఏ నందనోద్యానవనంలోనో దూరి, మమ్మల్నందర్నీ మరచిపోవాలనివుంది. మమ్మల్ని ఆయనగారి ధ్యాసలో ఓరెండు నెలలుమర్చిపోయినా, ఆతర్వాతైనా ఓ ఉత్తరంరాయి."

సుమిత్ర చెప్పినట్టుగానే ఆమె 'రాజు' సాహచర్యంలో సాన్నిహిత్యంలో మధురమైన, సుందరమైన కలలాటి మత్తులో ఉండిపోయింది. ఐదారునెలలు ఆ మత్తులో గడిచిపోయాయి. అయినా కొత్త సంసారంలో, అందులో ఇద్దరూ ఉద్యోగాలు చేసుకునేసంసారంలో వచ్చే యిబ్బందుల్ని సుధ ఒడుపుగా పరిష్కరించి వేసింది. పొద్దుట హోటలునుండి కారియర్ వస్తుంది. రాత్రిమాత్రం, రాజువద్దని చెప్పినా వినకుండా, సుధ వండుతోంది. సాయంత్రం వీళ్ళు వచ్చేటప్పటికి పనిమనిషి కాఫీ కాచి ఫ్లాస్కులో పోస్తుంది.

ఆరునెలలు గడిచాయి.

....ఆరోజు సాయంత్రం సుధ ఎంత తొందరగా వచ్చేద్దామనుకున్నా వీలులేక పోయింది. తోటిఉద్యోగులు, శిష్యుల బృందం ఆ'ఫంక్షన్'కి ఆపేశారు. అసలు ఆరోజు రాజుపిక్చరుకు వెళ్దామన్నాడు. 'పాపం, రాజు వచ్చేసి ఎంతసేపయిందో!' అనుకుంటూ, సుధ ఇంట్లో అడుగుపెట్టింది ఆరున్నరకు.

రాజు బట్టలైనా మార్చుకోకుండా పక్కకి వేళ్ళాడుతూన్న 'టై'తో చెదిరిన జుట్టుతో, సోఫాలో కళ్ళు మూసుకు నున్నాడు.

అతని నుదురు మృదువుగా స్పృశిస్తూ "తల నొప్పిగావుందా?" అంది.

కళ్ళు తెరచి రాజు 'ఊ' అన్నాడు.

ఆకళ్ళు తెరచి మూయడంలో, ఆ చూపులో కనబడిన విసుగుదలకు సుధ ఆశ్చర్యపోయింది.

"కాఫీ తాగారా?"

"లేదు" ఈసారి ఆ కంఠధ్వనిలోని చిరాకు ఆమెకు నచ్చలేదు.

ఫ్లాస్కులోంచి కాఫీపోసి ఇస్తూ "అనుకోకుండా 'ఫంక్షన్'కి ఉండి పోవాల్సి వచ్చింది" అంది సుధ.

అతను మాట్లాడలేదు. అతనిముఖభావం ఆమెకు బాధ అనిపించింది.

తన సంగతి తెలిసుండీ, తన నర్ధం చేసుకున్నా డనుకున్న రాజు ఈ నాటి ప్రవర్తన ఆమెకు కొత్తగా, ఎంతో కొత్తగా వుంది.

పెరట్లోకి వెళ్ళి "నే నాలస్యంగా వచ్చేమటా - అయ్యగారికి కాఫీ ఇవ్వలేదేం?" అంది పని మనిషితో.

"ఇవ్వబోతే వద్దన్నారమ్మా"

లోపలికి వచ్చేసరికి రాజు కాఫీ తాగి, మళ్ళా కళ్ళు మూసుకు కూచున్నాడు.

అతని ప్రవర్తన ఆమెకు చిరాకనిపించింది. అనుకున్న సమయానికి రాలేకపోయింది. నిజమే. కాని అనుకోని పరిస్థితులు వచ్చినపుడు తనుమాత్రం ఏం చేయగలదు? మొన్న సాయంత్రం పిక్చరుకు వెళదామంటే, తను సాయంత్రానికంతా 'లేట్' అయితే, ఆయన రాత్రి తొమ్మిదింటికి రాలేదా? ఆరోజు తానిలాగే ప్రశ్నించిందా? ఇంతలో తేలిపోతారేమిటో ఈ మగవాళ్ళు?

"అనుకోకుండా ఆలస్యమయింది. లేచి స్నానంచేసి బట్టలు మార్చుకోండి"

అతను స్నానం చేసి వచ్చిన తర్వాత అమృతాంజనం రాస్తూ "ఈ రోజు నేనిస్తే కాని కాఫీ తాగ కూడదని వ్రతం పట్టారేమిటి?" అంది అతని మౌనాన్ని భరించలేక.

"అబ్బే, లేదే" అన్నాడు రాజు.

ఉన్నట్టుండి "పోనీ నేను ఉద్యోగం మానెయ్యనా? నేను చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నాను" అంది.

"అదేమిటి?" అన్నాడు రాజు మొదటిసారిగా గొంతులో చలనం చూపిస్తూ.

"అబ్బే! ఎంతచెప్పినా ఆడదిఉద్యోగం చేస్తూంటే మగవాళ్ళకి అస్టేసయించదుటలెండి. మీసంగతి కాదు నే చెప్పేది. మానేద్దామా అని ఆలోచిస్తున్నాను"

సుధని తీరిగ్గా చూడగానే ఆమెవదనంలో గూడు కట్టుకున్న విషాదం అతనికి అర్థమైంది.

"ఇలా దగ్గరగా రా - ఓమాటచెప్పాలి" అన్నాడు.

దగ్గరగా వచ్చి ఎదురుగా నిలుచుంది సుధ.

....పెదవులు విడిపించుకుని "ఇలాటి పోకిరీ పనులు చేస్తే గడుసుతనమనిపించుకుంటుంది కాని — "అని వూరుకోంది, అతని చిలిపి చేష్టకు నవ్వుకుంటూ.

● ఆపరేషను పూర్తి అయింది. రోగికి నెమ్మదిగా తెలివివచ్చింది. మెల్లిగా కళ్ళుతెరిచాడు. తనముఖంమీద ముఖంపెట్టి తనకేసేచూస్తున్న వ్యక్తిని "డాక్టర్! ఆపరేషన్ బాగా జరిగినట్టేనా?" అని ఆదుర్దాగా అడిగాడు.

"భయపడకండి. ఇది దేవలోకం" అని అవ్యక్తి సమాధానమిచ్చాడు.

"ఉద్యోగం మానేస్తాననడంలాంటి మాటలన్నావంటే ఇలాటి పోకిరీ పనులే చేయాలి మరి."

ఆమె గుండెలో ఓ మధుర తరగం పొంగింది. 'అయితే తప్పకుండా అలాటి మాటలంటాను' అనాలనిపించి, మధురమైన లజ్జతో తనలోనే నవ్వుకుంది.

"తలనొప్పిగా వుండి అలా వున్నాను సుధీ! ఇంకేమీకాదు" అని అతడన్నా ఆమె విశ్వసించలేకపోయింది. వంట్లో బావుండకపోతే అతని తరహా వేరుగా వుంటుంది. తనకి తెలుసు....అతడు తన అలస్యానికి మథనపడి, చిరాకుపడ్డాడు.

ఇలాటి విషయాలే కొన్ని తర్వాత రెండు, మూడు నెలల్లో ఆమెకు అమితమైన విషాదాన్ని ప్రసాదించాయి.

...ఆ రోజు సినిమాహాల్లో వెంకటేశం కనిపించాడు. ఎంతకాలానికి? చదువుకునే రోజుల్లో తన శ్రేయస్సును కోరిన నిజమైన స్నేహితుడు. ఆమెను తలవని తలంపుగా, కలుసుకున్న ఆనందం అతని వదనంలో ద్యోతక మవుతోంది. రాజును పరిచయం చేసింది. కాని వెంకటేశం ముక్తసరిగా రాజును పలకరించి, తనతోనే పాత విషయాలు మాట్లాడుతూంటే ఆమెకు అదోలా అనిపించింది. రెండునిముషాలు చూసి రాజు 'నే టిక్కెట్లు తీసుకొస్తా' అని వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళిన వేపే చూస్తూ, పరధ్యాన్నంగా వెంకటేశం కబుర్లువింటోంది, రాజు టిక్కెట్లు తీసుకొని, దూరంగా సిగరెట్టు కాల్చుకుంటూ, 'షాంపెన్' మీద దృష్టిపెట్టి నుంచున్నాడు. సుధ మనసులోనే వెంకటేశంమీద విసుక్కొంది. కాని చాలా కాలానికి కనబడిన తనతో, పాత విషయాలే చెపుతూ, అమాయకంగా తన బాగోగులు ప్రశ్నిస్తున్న వెంకటేశాన్ని చూసి, మరుక్షణంలోనే ఆమె మనసు ఆర్ద్రమైంది.

సినిమాహాల్లో కూచుని కూడా రాజు మీదుగావంగి తనతో కబుర్లు సాగిస్తున్న వెంకటేశాన్ని కోపగించుకోవాలో, లేక అతని అమాయకతను భరించాలో ఆమె తేల్చుకోలేకపోయింది. కొంతమందికి అంత తెలీదేమిటో? ఇక రాజును చూస్తే తనకేం సంబంధంలేనట్టు, నిశ్శబ్దంగా సినిమాలో మునిగిపోయినట్టుకూచున్నాడు. కాని అతని తీరు ఆమెకు అర్థమైంది. గంభీరమైన ఆ మనసు బాధపడుతూంది. సరదాగా గడపాలనుకున్న ఆ సాయంత్రం మూగబాధతో నిండింది.

ఆరాత్రి రాజు మౌనం ఆమెను చిత్రహింసకు గురిచేసింది.

....మరొకసారి శర్మవచ్చాడు ఓ సాయం కాలం. అతనికి ఎంత ధైర్యం వుండాలి మళ్ళా రావడానికి! అభిమానం ఉన్నట్టు లేదు. ఇంటికి వచ్చినవాణ్ణి వెళ్ళమని ఎలా చెప్పగలదు తను! అతని రాక ఆమెలో సెగలు రేపుతోంది. అంతే. సహించి కూర్చుంది. ఇంతలో రాజు వచ్చాడు. అతన్ని చూడనట్టుగానే తనతోనే సంభాషణ సాగిస్తూన్న శర్మకుత్సితాన్ని ఆమె ఇక సహించలేక పోయింది.

అతని మాట మధ్యలోనే లేచి, రాజు గదిలోకి వెళ్ళి, కాఫీ ఇచ్చి అక్కడే కూచుంది. పదినిమిషాలు దాటాయి.

ఆయన నీ కోసం చూస్తున్నట్టున్నారు. వెళ్ళిరా. బాగుండదు. నేను స్నానం చేస్తాను" అన్న అతని మాటల్లో వ్యంగ్యం ఎంతవరకూవుందో అని ఆమె తెల్లబోయింది. రాజు లేచి టవల్ తీసుకుని వెళ్ళిపోయాడు.

"సుధగారూ! మీకో తమాషా చెప్తాను రావాలి మీరు" అని శర్మ అరుస్తున్నాడు అక్కడనుండి.

తనతో చాలా పరిచయమున్నట్టు రాజుకు కనబడాలని అరిచే శర్మ కుత్సితం కంటే రాజు తీరే ఆమెను ఎక్కువగా గాయ పరచింది. ఆ సాయంత్రమంతా 'బోర్' చేసి మధ్యలో వచ్చిన రాజును లెక్క చేయనట్టు- సంభాషణ అంతా తనతోనే నడపిన శర్మ వక్రబుద్ధిని ఆమె ఓర్చుకోలేక, అతను వెళ్ళాక దిగాలు పడి కూర్చుంది. దానికి తోడు ఆ రాత్రి అంటీ ముట్టనట్టు వ్యవహరించిన రాజు ధోరణి నామె భరించలేకపోయింది.

మర్రోజు "వచ్చే ఆదివారం 'భీమ్లీ' వెళ్దామా? నీకు తీరుబడేనా?" అన్నాడు రాజు.

"అలాగే" అంది, అతను ప్రశ్నించిన తీరు ఆలోచిస్తూ.

అంతా సిద్ధం చేసుకున్నాక ఆ ఆదివారం పరీక్షలు వెళుతూన్న విద్యార్థులకు ప్రయివేటు క్లాసు పెట్టవలసి వచ్చింది. సులభంగా విదిలించుకోలేని తన ఉద్యోగ ధర్మాలు, తమ 'పిక్నిక్'ని పాడుచేయటమే కాకుండా రాజు ప్రవర్తనా క్రమాన్నికూడా మార్చాయి. ఏమీ పైకి అనకుండా, అతని నిశ్శబ్దమైన ప్రవర్తన ఆమెకు ముల్లు గుచ్చుకున్నట్టుగా వుంది.

"ఎన్నో చెప్తారు. ఏవో ఊహలతో సంస్కార వంతులమని అనుకుంటారు. అలాటి చిన్న విషయాల్లో రాజు లాటివ్యక్తి ఇలా అయిపోతూంటే, ఆ జాతికసలు మా పురోభివృద్ధి నిజంగా ఇష్టం లేదేమో? లేక నాలోనో, నా ఆలోచనా క్రమంలోనో తప్పు ఏమైనా వుందా" అని వ్రాసుకుంది డైరీలో ఆ రాత్రి సుధ.

.... ఆ శలవల్లో బొంబాయి వెళ్లారు. రాజు కూడా ఆ ప్రయాణానికి చాల ఉత్సుకత చూపించాడు. ప్రయాణమంతా అతడు అతి ఉత్సాహంగా వున్నాడు. అతని మృదువైన ప్రకృతి! వెన్నెల లాటి మక్కువ చూసి సుధ మనసంతా ఆహ్లాదంతో నిండింది.

స్టేషన్‌కు సుమిత్ర, మూర్తీ వచ్చారు. రాత్రి భోజనాలయాక మగవాళ్ళ నిద్దర్కి డ్రాయింగు రూములో విడిచి, స్నేహితురాం డ్రిద్దరూ వరండాలో చేరారు. వెన్నెల నిండిన ఆ రేయి సుధని వేళాకోళం చేయడమే తన పని అన్నట్టు మాట్లాడుతోంది సుమిత్ర.

రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పిపంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనలతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలనికూడా మా విజ్ఞప్తి.

—మేనేజింగ్ ఎడిటర్.

"అతనికి చంటి పాపలంటే ఇష్టమన్నావ్. మరి అతని కోరిక కూడా తీర్చేట్టున్నావా?" అంది సుమిత్ర సుధని చూసి నవ్వుతూ.

"ఏవిటి మరీను! మరీ చిన్నపిల్లవయి పోతున్నావు సుమీ"

"బాగుంది. పైగా నేను చిన్నపిల్లనయి పోతున్నానా? అయినా అంత పిల్లాడిలా నీకొంగు పట్టుకు తిరుగుతాడేవిటి? నీవు మరీ అలా వెంట తిప్పించుకోడం బాగుండదు సుమీ"

"ఈ మగవాళ్ళు ఎంతకొంగుపట్టుకున్నట్టు వున్నా, వాళ్ళ మనసుల్లో ఏముందో ఎవరికి తెలుస్తుందిలే"

"అందరిమాటా ఎందుకు? అతనిచూపులు చూస్తేనే తెలుస్తుంది నీమీది యిష్టం. పువ్వులతో పూజిస్తున్నట్టుండే ఆచూపు నీకు తెలియదూ?"

"ఊ" అంది సుధ చిరునవ్వుతో.

"రాజులాంటివాడు దొరికాడు కాబట్టి, ఎన్ని చిరునవ్వులయినా కురిపిస్తావ్! నిజంగా మీ అన్యోన్యం చూసి నా మనసెంత ఆనందమయమయిందో నీకెలా చెప్పను సుధీ" అంది సుమిత్ర కంఠంలో నిజాయితీ ఉట్టిపడుతూండగా.

"ఈ మా చిరునవ్వులు చూసి సహించడం చుట్టూ వాళ్ళకెంత కంటకమో నీకేం తెలుసు?" అంది సుధ పక్కకుతిరిగి.

"ఏం? ఏం జరిగిందేవిటే?"

శర్మ రావడం — అన్నీ చెప్పింది.

"సుఖంగా వుంటే వాళ్ళ కసలు అంత అసహనమెందుకో తెలిస్తే నాకు కొంచెం చెప్పవూ?" ఆమె గొంతులో ధ్వనించిన దీనమైన అర్థింపుకు సుమిత్రఉలిక్కిపడింది.

"అదేవిటే పిచ్చిపిల్లా! నీలాటిదే దిగజారి పోతే ఎలా? మనం పైచదువుచదువుకుంటామన్నప్పుడు ఇంట్లో ఎన్ని కన్నీళ్ళు, చుట్టూ అమ్మలక్కల ఎన్ని గుసగుసలు మనం నెట్టుకొచ్చి ముందుకు పోవాలిసి వచ్చిందో నీకు జ్ఞాపకం లేదా? అన్నీ అధిగమించి యిప్పుడే దిగులెందుకు?"

"సంస్కారం, చదువూ లేని ఆడవాళ్ళ అజ్ఞానానికి నే నంతగా పట్టించుకోను. సంస్కారవంతులమని విర్రవీగి తిరిగే ఈ మగవాళ్ళ సంగతే నాకు అంతుబట్టకుండా వుంది."

"శర్మలాటి వాళ్ళను పట్టించుకోకుండా వుండాలి సుధీ! అది తలుచుకొని ఈనాడు బాధపడితే ఎలా? అయినా రాజులాంటి సజ్జనుడే నీ వాడయ్యాక నీవింకా ఆపిచ్చికూతలు పట్టించుకోవడమేవిటీ?" అంది. సుధ నడుంచుట్టూ ఆదరంగా చెయ్యివేస్తూ.

స్నేహితురాలి సాదరమైన అనునయం సుథను కదలించి వేసింది. పక్కకి తిరిగి దూరంగా చూస్తూ కూచుంది.

"ఎన్నిచెప్పినా ఈమగవాళ్ళకు వాళ్ళతో సమానంగా మనం ఉద్యోగం చేయడం యిష్టముండదనుకుంటాను."

"ఎవరో అనుకుంటే నీకెందుకు?" అంటూ సుమిత్ర, ఆమెవదనాన్ని చేతుల్లోకి తీసుకొంది.

తెల్లబోయింది. సుధ చెంపలమీది కన్నీళ్ళు ఆమె చేతినంటాయి.

"ఛీ! అదేవిటి సుధీ! ఎన్నో అనుకుంటారు. వాళ్ళ నందర్నీ లెక్కచేయొద్దని ఎన్నిమాట్లు చెప్పాలి? పోనీ రాజుచేత చెప్పించనేవిటి?" అంది నవ్వుతూ. ఆమె దిగులుపోగొట్టాలని.

సుధ ఏం మాట్లాడలేదు.

"చెప్పవేం? రాజుకు 'రికమెండ్' చేయనా?"

"ఇంకొకళ్ళయితే నేనెందుకంత పట్టించుకుంటాను? పైవాళ్ళయితే బాధపడదానే మోగాని. కావలసినవాళ్ళ సంగతి తలుచుకుంటేనే కన్నీళ్లు తిరిగాయి" అంది కన్నీళ్లు తుడుచుకుంటూ.

సుమిత్ర ఆశ్చర్యంగా చూసింది.

"అన్నీ తెలిసినవాడు. అంతకన్న ఉన్నత నాకుతెలిసిన వాళ్ళల్లో లేడు. మనసు నవనీతం. అటువంటి వ్యక్తే- నా ఉద్యోగ ధర్మాలు, నాకు ఇష్టమైనవి, అక్కర్లేనివి స్నేహాలు నన్ను చుట్టు ముట్టితే - మనసులో ఏ మూలో బాధపడుతున్నాడని తెలిస్తే నాకెంత అయోమయంగా వుంటుంది? అందుకే నాకు అనిపిస్తోంది - మనం పెంచుకున్న ఉద్దేశాలు, వాళ్ళు చెప్తూన్న సంస్కార వాదాలు - వీటన్నిటికి సరి అయిన పునాదులు లేవేమోనని! అతని సంతాపం చూశాక నాకేమనిపించిదంటే, వాళ్ళు పెంచుకున్న అభిప్రాయాలు ఈ నాగరికతా ప్రలోభంలో పడి చెప్పినవే కాని వాళ్ళ ఆలోచనాక్రమంలోని అసలు నిజాలు గావేమోనని" అని పూరుకుంది సుధ.

అంతావిని, కాసేపటికి తేరుకొని "రాజు అలా అయేడంటే నాకు నమ్మకం కుదరడం లేదు సుధా" అంది మెల్లగా సుమిత్ర.

"అనే నేననేదీను! అంత ఉన్నతుడే ఇలా ఉన్నాడే. అని తలుచుకున్నప్పుడే నాకు ఆపుకోలేనంత వ్యధ కలుగుతుంది. అప్పుడే నిజమైనదేదో లోపించిందనిపిస్తుంది. నా చదువు ఉద్యోగం అన్నీ తెలిసి నాకు ప్రోత్సాహమిచ్చి, నువ్వే కావాలని హృదయ మంతటితోనూ కోరి తన దానిని చేసుకున్నప్పుడు కూడా- అతనన్నీ ఆలోచించుకోలేదా? ఆరోజున అతనికి తెలీదా అని?"

సుమిత్రకు ఏమనాలో చప్పున తట్టలేదు. "నీ దంతా ఉట్టి అనుమానమేమో?" అంది చివరకు.

"అన్ని సందర్భాలలోనూ అలా వున్నాడని కాదు. అతనితో అతని స్నేహితులెందరో ఇంటి కొచ్చేవారు. కాని ఒక్కో సందర్భంలో అతను మథన పడేవాడు. అయినా రాజు సంగతి నాకు తెలీదా? అతను ఎప్పుడు బాధపడుతున్నాడో తెలుసుకోలేనా?"

"ఏమయినా అన్నాడా?" అంది సన్నగా సుమిత్ర, ఆప్రశ్న అడగొచ్చా అని సంశయిస్తూ.

"అదే గదా నన్నింత బాధించేది. అతడు మనసులో దాచుకుని బాధపడుతున్నాడని తెలిసే నాకింత విషాదం పైకి చెప్పడానికి వాళ్ళు పెంచుకుంటూన్న సంస్కారం ఒప్పదుగదా?"

"పోనీ నువ్వే అంతా చెప్పకూడదా!" అంది సుమిత్ర.

ఓ నిముషం ఊరుకుని "నాకిష్టంలేదు. నేనేం చేశానని చెప్పడం? 'నాకేం తెలియదు. నేను చాలామంచిదా'న్నని చెప్పనా?' నాకు అలా చాతకాదు. 'నేనే పాపమెరుగను. నన్ను క్షమించా ననండి'

అని నాయకుని వెడద ఉరముపై తలవాల్చ డానికి ఇదేమైనా కథా? నేను కథానాయకినా? అసలు అది పద్ధతి కాదనిపిస్తుంది నాకు" నిశ్చయంగా అంది, సన్నగా నవ్వుతూ.

"అదీ! అలా నవ్వితే చూడాలి మాసుధ అందాలు. ఎంత చిన్న విషయానికెంత బాధ పడ్డావే? నాకింకా అనుమానమే - అత నేమనుకోకపోయినా నువ్వే అనవసరంగా బాధడ్డావని"

"అదే నిజమయితే నాకింక వేరే ఏం కావాలి!"

"ఏం కావాలా? చెప్పనా?" అని, నెమ్మదిగా "రాజు" అని సుధ చెవిలో ఊది. "సరేలే. మా 'నాని' లేచినట్టున్నాడు. పాలు పట్టాలి" అంటూ సుమిత్ర లోపలికి దారి తీసింది సుధతో.

ఆతరువాత ఇరవైరోజులు సంతోషంగా, హాయిగా గడిచిపోయాయి.

ట్రెయిన్ ఎక్కించి "ఉత్తరం రాయి వెళ్ళగానే. అతని ధ్యాసలో మర్చిపోకేం? అనవసరమైనవన్నీ ఊహించుకొని బాధ పడకు" అంది సుమిత్ర.

ఆ వెళ్ళడం అత్తవారింటికి వెళ్ళి తిరిగి వచ్చారు.

రెండు నెలలు గడిచాయి.

ఆ సాయంత్రం రాజు చెప్పాడు .... మూర్తి ఉత్తరం రాశాడని.

"ఏమిటీ విశేషాలు?" అంది సుధ.

"ఇన్నాళ్ళనుండి నువ్వు ఆవిడకు ఉత్తరం రాయలేదటగా! అంతలా ఎవరిని చూసుకుని మరిచిపోయిందో ఈసారి ఆవిడకు రాయమన్నారుట"

"రాయాలనుకుంటూనే మర్చిపోయాను. ఏదో కాలేజీ వర్కులో వీలులేకపోయిందని రాయండి ఆయనకు"

"అంతేనా! శ్రీవారి సాహచర్యంలో మిగతావి జ్ఞాపకం లేవని అంటావేమోనని ఆశించానే" అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"అది ఇంకోళ్ళకు వ్రాసుకోవడ మెందుకు? నే నెప్పుడో అది లోపల వ్రాసుకుని పదిలంగా దాచుకున్నాను" అంది సుధ, తన హృదయాన్ని స్పృశించి అతన్ని లాలనగా చూస్తూ.

"ఏదీ! ఎక్కడో నే చూడవచ్చా" అంటూ ముందుకు వచ్చిన రాజు కొంటె తనానికి ఆమె సిగ్గుపడి "అది మీరుచూసినా అర్థంకాదులెండీ. నా హృదయానికితెలుసు" అంటూ నవ్వి, అతని చేతిలోని చీరచెంగు మృదువుగా విడిపించుకొంది.

ఇంటికొచ్చాక ఆమె మనసు తేలికగా, అతి మనోహరంగా వుంది. ఆరోజు కాలేజీలో శర్మ, వెంకటరెడ్డి తనని గురించి అల్లుతాన్న కథలు విని ఆమె మనసంతా కలతబారింది. బొంబాయినుండి వచ్చిన కొత్తలో. రాజు ఊళ్ళోలేడని తెలిసి, ఆ రోజురాత్రి కబుర్లు చెప్పడానికని వచ్చిన శర్మతో, ఓ పావుగంట పోయాక, "ఏదైనా మాట్లాడవలసివస్తే, అవసరమైతే నేనే కబురుచేస్తాను. అనవసరంగా మీరురావద్దు" అని నిష్కర్షగా చెప్పినప్పటినుంచీ, అతడు పగపట్టినట్టుగా వ్యవహరిస్తున్నాడు.

....రోజులు గడచి పోతున్నాయి!

ఆ రోజు రాజు ముభావం ఆమె కర్థమవ లేదు. అతని ప్రతి కదలికా తెలిసినసుధ ఈ

రోజు అతడెందుకో బాధపడు తున్నాడని గ్రహించింది. మర్రోజు ఆదివారం పొద్దుటే కాఫీ తాగి, 'పనుం'దంటూ వెళ్ళిన మనిషి ఒంటిగంటకు తిరిగివచ్చాడు. మొహం, చెవులు ఎండలో తిరిగినట్టుగా చెప్తూ, ఎర్రగా వున్నాయి. మళ్ళా సాయంత్రం 'రామం దగ్గరకు వెళ్ళాలి' అంటూ వెళ్ళిపోయాడు.

పొద్దుట నిజమయిన పనిలేదనీ, ఇప్పుడు రామం దగ్గరకు వెళ్ళలేదనీ తెలుస్తూనే వుంది. ఉన్నట్టుండి ఆమెకు తట్టింది - నిన్న సాయంత్రం ఆ ఉత్తరం చూసినప్పటినుండీ అతనలా వున్నాడని.

అతడు రాత్రి వచ్చేసరికి పదకొండు దాటింది. వస్తూనే "ఇంకా మేలుకునే వున్నావా సుధీ! అనుకోకుండా రామంతో పిక్చరుకు వెళ్లాను" అన్నాడు.

అతడు చెప్పిన పిక్చరు మొన్ననే వెళ్ళి పోయిందని ఆమె 'స్టాఫ్ రూం'లో వింది.

ఆమె ఆదరంగా అతన్ని చూస్తూ "భోజనం చేద్దాం" అంది.

భోజనం చేసి పక్కనమల్తూ "నిన్నటి నుండీ నాకేమిటోలా వుంది సుధీ. బాగుండ లేదు" అన్నాడు.

అమాయకంగా వాడిపోయి వున్న అతని వదనం చూసి ఆమె మనసంతా ఆర్ద్రతతో నిండింది. అలసి నిద్రతోతూలుతూన్నట్టున్న అతని కళ్ళల్లోకిచూస్తూ "నిద్రపొండి-విశ్రాంతి మంచిది. నే జోకొడతాను. ఏం?" అంది లాలనగా చూస్తూ, అతనినుదురు తాకుతూ.

అయిదు నిముషాల్లో, ఆమె చేతుల్ని తన చేతిలో వుంచుకొని, చంటిపాపలాగ అతను నిద్రపోతున్నాడు.

ఆరాత్రి ఒంటిగంటకు సుమిత్రకు ఉత్తరం వ్రాస్తూ వుంది సుధ.

"....నువ్వారోజున నేనూరికే అనుమాన పడి బాధపడుతున్నానన్నావ్ కదూ? నిజంగా నాది అనుమానమే అయి, అది నిజంకాక పోతే, నాకింకేంకావాలి అన్నానా నాడు.

కాని అలా నమ్మల్సి మాజోలికి వద లరుగదా. నిన్నసాయంత్రంనుండీ రాజు అదోలా వున్నాడు. ఈ ఆదివారమంతా



చిత్రగుప్తుడు చిట్టాలన్నీ తిరగేసి "ఎక్కడాకనబడదే. ఏమిటయ్యా నీపేరు మళ్ళీ చెప్పు!" అన్నాడు. నరకంలో అప్పుడే అడుగు పెట్టిన ఆసామీ చెప్పాడు. చిత్రగుప్తుడు పర్సనల్ఫైలు తీసి చూసి "నువ్వు 1973 దాకా రానక్కర్లేదు. ఎవరయ్యా మీడాక్టరు!" అని ప్రశ్నించాడు.

ఇంట్లోలేడు. ఈ సాయంత్రం అతను బయటకు వెళ్ళిపోయాక, నిన్న వచ్చిన ఉత్తరంచూసినప్పటినుండీ అతనలావున్నాడని తట్టింది. 'నిన్నఎక్కడనుండి ఉత్తరం' అంటే 'ఇంటిదగ్గరనుండి. విశేషాలేంలేవు' అన్నాడు. కాని ఈ సాయంత్రం ఆలోచిస్తే నాకు నమ్మకం కలగలేదు. ఆ వచ్చిన ఉత్తరం చూడాలనిపించింది. నిన్న విప్పిన అతడి 'పేంటు' జేబులోనేవుంది 'ఉత్తరం. ఉండలా చుట్టిపేశాడు దాన్ని. చూడాలని వున్నా 'అతని ఉత్తరంగదా' తప్పనిపించింది. కాని శర్మ రాత తెలుస్తూనే వుంది. రాజు సంస్కారం చుట్టుపక్కలవాళ్ళ స్థాయిమించకుండా యెన్నిచేయాలో అన్నీ చేశాడు శర్మ. రాజు బాధకు కారణంతెలుసుకోవాలన్న ఆత్రుత హెచ్చయి ఆ ఉత్తరం చదవవలసి వచ్చింది. నామీద ఎన్ని అభియోగాలయితే చేయొచ్చునో అన్నీవున్నాయి. ఉత్తరం చివరన 'మీ శ్రేయోభిలాషి' అని వదిలేశాడు శర్మ. అంత 'హితైషి' నామీద రాసిన అభియోగాలు చూస్తే నాకే ఆశ్చర్యమైంది....అన్ని కల్పనలు మనిషన్నవాడు ఎలా చేయగలడా అని?

ఈ రోజంతా గమ్యం లేకుండా తిరిగి ఇప్పుడే వచ్చాడు రాజు. నా చేతులు పట్టుకుని ప్రశాంతంగా నిదుర పోయాడు. అంత మమతతో- విశ్వాసంతో నిదురలో కూడా నా చేయి వదలని అతనినుండి తప్పించుకోడానికి కారణం - నీకీ ఉత్తరం వ్రాద్దామనే;

కొద్ది కాలంనుండి నాకనుమానంగా వుండి పోయిన ఓ విషయం నాకు ఈ రోజు నమ్మకంగా తెలిసింది. నా మనసెంతో తేలికయింది.

ఏవిటో చెప్పనా?

మా పెళ్ళికి ముందు, అతని తల్లిదండ్రులు పెళ్ళయిన తర్వాత ఈ కొత్తకు ఇమడగలరా అని మధన పడ్డాను. నవీన జీవితావసర పరిస్థితులలో వాళ్ళు ఎక్కడో వుండి, మేమిక్కడ స్థిరపడి పోయాము. నేను అనుమానించిన ఆ 'అడ్డు' నేనేనాడూ అనుభవించలేదు. ఆ పరిస్థితులూ రాలేదు. కుటుంబ వ్యవస్థ ఇలా మారిపోడంలో నేను ఊహించిన దానికి ఆ సాక్రమే లేక పోయింది.

కాని కొత్తపద్ధతుల్ని అవలంబిద్దామని, ముందుకు అడుగు వేయాలనీ, క్రొత్త సమాజానికి బాటలు వేద్దామనుకునే ఈ నవీన యువ సంస్కారుల మనసుల్లోనే, వాళ్ళు చెప్పేటంత, నమ్మేటంత సంస్కారానికి నిజమైన పునాది లేదని నాకీనాడు నమ్మకంగా తెలిసి వచ్చింది. రాజు లాటి ఉన్నతుడే అలాఅయేడంటేవేరేఇంకేం చెప్పాలి? నాస్నేహాన్ని, సాహచర్యాన్ని, ప్రేమనీమనసారా కాంక్షించాడు. నా ఉద్యోగాన్ని మనస్ఫూర్తిగా కొనసాగనీయాలన్నాడు. అతనుగా తన స్నేహితులను ఎందరినో పరిచయం జేశాడు. పార్టీలకు, పిక్నిక్‌లకూ వెళ్ళాం. కాని....కాని.... వీటి వెనుక ఎక్కడో బలంగా నిలిచి పాతుకు పోయిన ఆ అభిప్రాయాల్లో అట్టే. మార్పురాక, మనసులు నిజమయిన మార్పుకు తట్టుకుని, హర్షించి, వ్యవహరించలేక పోతున్నాయి.

అది రాజుకే పరిమితం కాదనీ వాళ్ళందరూ కూడా ఆస్థాయిని అందుకోలేదనీ తెలిశాక, నా మనసెంతో జాలితో నిండింది.

పాలరాయిలా స్నిగ్ధంగా మెరిసే ఈనిజం వ్యక్తిపరంగాదనీ, సమాజమంతటా అల్లుకుందనీ తెలిసింది.

అందుకే నా కీనాడు ఈ మగవాళ్ళని చూస్తే అమితమైన జాలిపుట్టుకొస్తోంది. 'ఏమి మగవాళ్ళు!' అన బుద్ధివేస్తోంది.

రాజులాటి నిజమైన సంస్కారి ఆ ఉత్తరం చదివి అరాయించుకోడానికి ఒక టిన్నర రోజులు ఊరంతా తిరిగి, నన్ను వెతుక్కుంటూ వచ్చి, పైన దొరకని శాంతి నాస్పర్శలో పొంది, నా వడిలో సుఖంగా నిదురించాడు.

నేనే 'ఆర్టిస్టునైతే కొత్త పద్ధతిలో పరిశ్రమించి సృష్టించిన ఓకొత్తరకం గులాబీని, వదనంలో ఎన్నో ఆశయాలు ప్రతిఫలించగా ఆ పుష్పాన్ని అందుకోబోతున్న యువకుడు ఆ అందుకోడంలో, క్రొత్త సృష్టిలో అనంతంగా వచ్చిన ముళ్ళుగుచ్చుకుంటూంటే, చూసి బాధపడుతూ ఆ గులాబీ నవీనతను, సౌమ్యతనూ, మృదుత్వాన్ని, మాధుర్యాన్ని గుర్తించి వదలకుండా, ఎటూ తేలని మనసుతో మధనపడుతూ ఉన్నట్టు-' జాలిగొలిపేసంస్కారి' అన్న మకుటంతో చిత్రించి వుండేదాన్ని.

కాని నాకు 'ఆర్టు' ఏం వచ్చును?

కనుక నిజజీవితంలో ఇది అర్ధంచేసుచేసుకొని, ఆ కళని జీవితంలో పొదిగి నిండుగా, హాయిగా జీవించాలని ఆశిస్తున్నాను, కళ ప్రయోజనం విశిష్టమైన, సుస్పష్టమైన, కాంతిపథంలో నడిపించే జీవితమేగదా.

అందుకే నేను 'ఆర్టిస్టును' కాదని నా కీనాడు, విచారంలేదు."

ఉత్తరం పూర్తిచేసి రాజుదగ్గరకొచ్చింది నా 'పిచ్చిరాజు' అనుకుంటూ, నిదురలో నుదుటిమీదకు జారిన అతని జుట్టు మృదువుగా దిద్ది, అతడు ఎంతో మమకారంతో ఫొటోకట్టించిన 'మర్ఫీపాపాయిని' చూస్తూ, 'ఎలా చెప్పాలి? నాకింత సిగ్గుగా వుందేవిటి అతన్తో చెప్దామనుకుంటే' అనుకొని, మనసెందుకో ఆనంద ప్రపూర్ణమయి, అతని పెదాలు యెంతో కాంక్షతో ముద్దిడుకొంది.

పెదవులపైన ఆస్పర్శే అతనిలోఅమృతవాహినులు నింపినట్టు అతడు పులకరించి, ఆ నిద్దుర మైకంలోనే ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

అతని కౌగిలిలో సుధ వొదిగింది. అతని శరీరమంతా అమృతమే నిండింది.

□□□

● నాటువైద్యుడొకడు రోడ్డుపక్కన దుకాణం పరిచి తన మందుల ప్రభావాన్ని గురించి అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు. "అయ్యా! ఈచిట్కానలభై రోజులు వాడితే దీనిమహత్యం మీకే తెలుస్తుంది. నన్ను చూడండి. నాకిప్పుడు మూడువందల ఏళ్ళు. ఈ మందువల్లనే ఇప్పటికీ ఇంత దృఢంగా వున్నాను."

గుంపులో ఒకాయన ఆశ్చర్యపోయి వైద్యుడి శిష్యుడిని పిలిచి అడిగాడు: "మీ గురువుకు నిజంగా మూడువందల ఏళ్ళు వుంటాయా?"

"ఏమోనండి నాకు తెలియదు. నే నాయనదగ్గిర వందేళ్ళనుంచే పని చేస్తున్నాను" అని శిష్యుడు సమాధానమిచ్చాడు.

ఇంపైన కథలు కావాలా

సొంపైన కార్టూన్లు కావాలా

సరికొత్త శీర్షికలు కావాలా

సరిగంచు వినోదం కావాలా

?

ఉగాది ఉదయాన వధూహృదయాన మధురోహలా

వెలువడుతుంది మిలమిలా

జ్యోతి ఉగాది సంచికలా

పసవాల

(గత సంచిక తరువాయి)

ఆలయము చేరువౌతూన్నది!

గోపురమునకు వెన్నెల కాపున్నది. గోపురాగ్ర హేమకలశములు ధగద్ధగల - కనుకళుకుల, చేరరమ్మని అనతులీయంగా.. సాగివచ్చే ఆలమంద ఒక్క అడుగు పాటు నిలచి, మోరఎత్తి-అంభా అనంగా,- దు త్తలు నెత్తినుంచుకున్న కోతులు.. ఆ దు త్తలు ఆ ఖామలందు కొనఁగా,. సాగిల పడంగా.. తనకు వల్లమాలిన పరవశమై,. సాగిలిపడి.. పొర్లుదండములు పెట్టి,. ఒక్కడే పరుగుగా పోయి, వాని సన్నిధి జేరి.. తనివార,. పనవి పనవి మరి మరి తమకానబోయి,. వానిరూపు, కుదురుగా కనుల నిలుపుకొని,. వాని ప్రాపునకు హత్తు కొని..

అయ్యలా కోనేటిరాయ !. నీకు తోడు ఒరో పన్నాని గిరిపట్టినాడురా,. అని ఎరుక పరచి,. తనకన్నవారిపేరు జెప్పి, గురు రాయని పేరు జెప్పి,. మ న సే పూ జ గ సేయంగా,-

అన్నమయ్యను,. కనుల ఎదుటివాడు ఆడించ మొదలిడంగా,.వీనికాతీరున మరులు కమ్ముకొనంగా,—

లోకానికి దేవుడై వెలసినవాడు,. ఒంటి పాటున లోకమేల దలచినవాడు,. ఏవే శనో, ఏ మమతనో, మనువు మనసై అప్పు జేసి,. ముప్పునబడి, తనకు తా తెలియక ఆలికి దూరమైనవాడు - ఆరగింపులమీదనే ఆధారపడినవాడు - తనవంటి బికారులే పరివేష్టించినవాడు - కోతిమూకల నడుమ కొలువు దీరినవాడు ! అయ్యో వ్రాత,. తనకో కప్పుర దీపంలేక.. అగరు ధూపం లేక చందన చర్చలేక, జవాదినామం లేక, పరిమళింపులేక, పవళింపులేక ఏవేళ కావేళ తులసితీర్థంతోతృప్తిపడుతూండటంతగునా. -

మల్లాది రామకృష్ణశాస్త్రి

తగవా. అనుకొని.. బిచ్చమడిగి మలయజం దెచ్చి.యాచించివచ్చికప్పురంతెచ్చి.కలవారి వేడుకొని కస్తూరిదెచ్చి.. కాశ్మీరందెచ్చిసమర్పించి మెప్పులుపలికి.అయ్యా కోనేటిరాయ- అవధరించరా! ఇవినీసేవలకైనవిరా! కైకొనరాకై నేయరా.. ఘుమఘుమలాడరా..అలినివల్లనివాడవైనా. అంతర్యములో గృహస్థువురా.. దేవరకీ దిని తనమేల- యిది మనకు మేలుకాదు! అని.. పరిపరి విధముల విన్నపాలు పలికి.. పలుకుల కొలిచి.. చందన చర్చలసేవించి.—— తనచేతల తామురిసి. ఏనాటికైన తన దైవానికి.. యీ విరాగి తనమువదలి.. రవంత వేడుకతనం అలవడే నేమోనని. గట్టు దిగేనేమోననీ ఆసపడి.

ఆ ప్రభువింకా చలించకుండా.. పరిమళింపు మెండైనా.. పాషాణ పాకానే ఉంటున్నట్టు మనసున రూఢికాగా. యిహ.. యిది పనిగాదని.. కలలో తానోయింటి వాడై.. అనువుకాని యిష్టకామ్యాలనుభవిస్తూ.

రాయడా.. దేవదేవుడవే. నీకు తోచక పోతే మానె.. నన్నుచూసి నేర్చుకోరా.. మా తీరుకు ముచ్చటపడరా! నరులలో ఉన్నందుకు. నాగరీకం ఉండాలిరా. నాచేత.. మరిమరి చెప్పించుకోకురా. అది! నీ గిరికీ, నినునమ్మిన వారికీ పరువుకాదురా. అనీ అన్నంతలో పుట్టెడుదుఃఖము వచ్చి.- నేనలా కలలుకంటున్నా. నీవు కరుగవైతివే! నాసేవలో లోపమా.. వీడు మనకు బుద్ధులు చెప్పవచ్చినాడుగా.. అని కోపమా? అప్పరూ !.

నీకెందుకీ కక్ష - నాకెందుకీ శిక్ష !- నిలువనీయకుండచేసి — నీ సన్నిధికి రప్పించుకున్నావు - ఈ నయవంచనకా?- యిక ఏ మొగముపెట్టుకొని నీ సేవలకు వచ్చేనురా? - నీ సేవలకు మాలితే. - మరి నాకు బ్రతుకేదిలా? — యిలా మొరలు బెట్టుతున్నా. - చలించకపోయిరే! —

చలించక పోతిరనడం పొరబాటు:

అయ్యది. తనకు అంత వాతప్పుగా వినికిడి కావాలా? — అలమందల నదరించక బెదరించక. కనుసైగలతో కాచే గొల్ల కన్నెలు. జుంటి తేనెలూ. పచ్చి కస్తురీ అప్పనగా తెచ్చే కొండ సానులూ ఆకాశమంత జారు కొప్పేసుకుని. అదరు నడకను వెదురు బియ్యం. వెన్నె దెచ్చే చెంచితలు.మూకమల్లెగా. వచ్చిపడి అన్నా.- యిదేమి చోద్దెమన్నా అని. కేరడములు కులికి. అయ్య చెలరేగి పోయినాడు. కనుమూయ నివ్వడు. - కనుచాటు కానియ్యడు: మంచికిరాడు. . మనవులిచ్చుకున్నా వినడు: పట్టిన చెంగు పట్టకుండా. — నొక్కిన చెక్కిలి నొక్కకుండా. - అందీ అందని తేరగాడై తెగబడినాడు: నీవు వచ్చి. ఆసామి కీ బుద్ధులూ విద్దెలూ నేర్పినావా? - నీకున్న భ్రమతలు అయ్యమీదికి తోసి ఆడించు తున్నావా! - పల్లకున్నట్టే ఉండి పలుగాకి తనానికి బోతవా? - ఓరబ్బ. నీవీసాటి మనిషివా. - ఆయనీసాటి దేవుడా?-, అని నవ్వులలో బెట్టి. - స్వామి వారిని సంతను బెట్టంగా. —

ఆపొట్టివాడు.—మరింత కుదించుకుపోయి.

మందార వనంలో. - నిత్యవైభవాన. నిబిడ మందహాసాన. - నిరంతర



ప్రసన్నమూర్తిగా. - కొలువు తీరిన అమ్మవారి సన్నిధికి. పడుతూ లేస్తూ పోయినాడు:

పలుకు తేనెల తల్లీ .... యిలాజరిగినదమ్మాఅని. - చెప్పలేక చెప్పలేక ఏకరువు బెట్టినాడు:

చందనచర్చ చేయించింది - స్వామి వారికు దయచేసేరని కాని. - యిలా చెలరేగు తారని కాదమ్మా !-

కస్తురినామం దీర్చింది - కాముకుడి చేసేందుకు కాదమ్మా! మీ దాంపత్యలీలా లోక కళ్యాణమున కయ్యేనని. - మీ మక్కువల గొని యాదే ఫలం నాకు దక్కేనని ఆసపడినానమ్మా !—

స్వామివారు గట్టుమీద గడిదేరినారు! నా చేతకు మీరిపోయినారు: యిక నీవు కలుగజేసి కొనవలె తల్లి—

ఏ నాడలిగినారో.. ఎందుల కలిగినారో.. యీ అలుక లెంతకాలము సాగేనో. - వీనికి తెలియదు: మీరుచెప్పరు!- పోనీ తల్లి,

మీరీ తరుణాన కదలిరావాలి
వారిని కన్నారా, మందలించాలి:
కాని నాడు,

ఆ తండ్రికి ఆ పదవీ ప్రాభవ మూ ఉండదు ;

యీ బిడ్డకు, - వానివాడన్న పరువూ ఉండదు ;—'

—ఆ తల్లి కదలలేదు; వినిపించు కొని నట్లే లేదు:

అక్కడ కూలబడినాడు :

అమ్మా, - కలవారి బిడ్డవు, కలుములతల్లివి-
అఖిల భువనాలు నీ మందహాసాలు :
మాతల్లీ నీ చిరునవ్వులే.. స్వామిసన్నిధికి, సోపానపాళి: నీ మమతలే, - స్వామికి నిత్య ధూపదీపములు: నీ అనురాగమే, వారికి అలంకరణము; నీ వాలుజూపులే, — వారికి అనుదిన మంగళ స్నానములు: నీ మక్కువే వారికి పరిధానము :- నీకైన శృంగారులమ్మా వారు !- యీ తీరైనారు; - మారు పలుకవేమమ్మా ! -

అమ్మా ! - నీ ఒంటరి తనం జూస్తూ,- నీ సన్నిధిలో నిలువలేను: అయ్యచేసిన సేతకు, - చిత్తమొగ్గి ఉండలేను: నా మొగ మక్కడ చూపలేను:
అయ్య ఆతీరు! - అమ్మ యీ తీరు!-

యీ బిడ్డనేమి చేసేరమ్మా !- నే నేమై పోవలెనమ్మా ! - '
ఆ తల్లి, - తనగోడు ఆలించదాయె-బదులు
పలుకదాయె ! -
'కొండనున్న గోగుపూవు, కొండదిగిరాదు;
కొలనులో కెందమ్మి - కాచేరబోదు :

ఒక్కరికి విన నేర్పులేదు: కానీ తల్లీ: మీకు మీరెంత దూరమో ఎల్లకాలమూ, - పీనికీ, మీరంత దూరమే ! -

అన్నమయ్య దుసరుపలాడినాడు: వెను దిరగబోయి, - ఆగి, - ఆ తల్లివంక జూచి-
తలవంచుకుని. - అడుగులు వెనుకకువైచి, -
ఒక్కక్షణం మొకరిలి, - ఒక పరి చేతులు జోడించి, - ఆ చేతులు కనుల కద్దుకొని, -
ఆ తావు గడచి నడచిపోగా, -
తనవెంట చీకటులు తరుముకురాగా, -
అరబయలున - అరబోసిన మసక -
మసక - సుంకేసుల మ్రానై-
మ్రానునీడ - వెలుగంత చిన్నది -
నిలుచుండగా,

ఎదో కరమునోకి ఆ జవ్వని కెవ్వు మనంగా, - ఎదో మోము, ఆ మోమునలమి కొనగా, - తన మనసు కెవ్వుమని,-అలేమ నాదుకొన, - ముందురుకబోయి, - కాళ్లే తులు కదలక, - ఆ గండుతనమును తానరి కట్టలేక, కనులుమూయ తరము గాక, - తనజన్మ కెవ్వుమనంగా,
తాను కెవ్వుమనెనో, - తనివార నవ్వు
కొనెనో, ,
తెలియని ఆనందమై, — ఆనీడ చూపిచ్చి-
ఆ వెలుగు తెలివి నీయంగా, —
తాను తేరిపార జూడంగా, - కెవ్వుమన్న జవ్వని ఎవ్వరు;కొలనులో తామర; కేరడము లాడినదెవ్వరు -. కొండ కొమ్మన గోగు పూవు ! -

అయ్య కొంగొడిసి పట్టిన గొల్ల చేడియ,
చెక్కిలి నొక్కిన చెంచిత, -
చిలిపి సేతల కరగిన కొండసాని, -
ఎవ్వరువారు - ఆ తామర రేకలే -
ఆ కెందమ్మి తళుకులే ! —

అహో(- అన్నది రోదసి; ఆ లీల; తన మనసును లాలించగా, - అన్నమయ్య, - ఆ తావుకు మ్రొక్కి తనవారికి మ్రొక్కి,-
ఆ లీల లాలపించంగా, శ్రీ; అన్నవాడాయె!-



—అన్నవాడాయె: అమ్మనూ అయ్యనూ - పదాల మాలలల్లి కొలిచేనని, అనుకొన్న వాడాయె ;

కాని, - పీని నిలయమూ, వైభవమూ శాశ్వతముకానూ ! కనుల గట్టకముందు గాన మిచ్చిన వాడు; కరుణించి అనాడు: కనుల వెలిగినవాడు, - తన సన్నిధినె నిలుపుకొన్న మన్ననవాడు: దైవరాయా అన్న తానహో అనువాడు - తనవాడు.

తనచే పలికించడేమొ, -

గానమాగిపోయె. మాట నోటనే నిలిచి పోయె ! - 'పలికించరా - అప్పా !- పలుకు లీయరా -' అని, నయాన, నీపై పాటలు పాడేనుర ! - నిన్ను కొనియాడేనుర! - అని నయాన, - నీ మేన నలమిన పచ్చకప్పురపు తావి ? . నా పలుకుల శాశ్వతముగ నిల చేనురా, - నీవు తిలకమిడిన కస్తూరి, - నా పాటలు, కలకాలము పరిమళించేనురా ! - నా సంకీర్తనలే, - నీ ఘుమఘుమలు,- నా సేవా క్రమమె నీ అనంతకీర్తి, - కోనేటిరాయ, - నేను కోరిన దీవరమే - కాదనరాదురా, - '
అని నవకాన, 'అనుదినము నిను కనుగొన వలెనని, - గిరికి సిరులొసగు వరదుడవని,- కరుణయె తన బిరుదని, - దరిసిన నరులకు తన చిరునగవులె వరమని - తలచి కొలి చిన ఫలమిదియ -' అని, అతి లఘువు గానూ - మనవులిచ్చుకున్నా, - అప్పుడు కిమ్మనపోగా, - అన్నమయ్య, వేరు దిక్కు తోచక, - గురువులను తలచుకుని, -

స్వామీ - అన్నలమ చేసిన సుకృతము నేను సేయలేదా ? - కృష్ణమాచార్యుని పుణ్యము నాకు లభించదా ? - ఆచార్యుని తంబుర చిరతలు నాకు కటాక్షించలేరా. - కొండలరాయడు నాకు వాక్కి-య్యక పోయిన మానె..నా మౌనమే వాడాలించేను : తంబుర నాదమే. - గానమై ముఖరించేను : చిరుతలే పలుకులై మ్రోగేను : అందులకూ వీడు నోచకపోయెనా. - పోనిండు - నా తనువే తంబుర. - నా మనసే చిరుతల జోడు - యీ జన్మ. సంకీర్తన :!' - అని పలికి. - కోనేటి రాయని కనుల ముందుంచుకుని. - సొక్కి-పోంగా. -

—సరసను. కిలకిలలు దోచె :

అదేమా. - అనుకొనంగా. - ఎవ్వతో.. ఒక చేడియ,-తన చిందులకు వింతబోయి. - నవ్వుల పలుకరించినదని తెలుసుకుని. తానా మెకు మ్రొక్కి-ంగా. - ఆదాల యినుమిక్కి-లిగా నవ్వులబోయి -

'అన్నమయ్యా ! - ఒంటరిగా చిందేస్తే అప్పుడు ఒల్లడు; మొక్కే-ందుకు రెండు చేతులుండద్దా : ముచ్చట పడేందుకు జంట మనసులుండద్దా ? -

నీకైన కన్నె ఏ సీడనున్నదో - వెదకి తెచ్చుకో - అయ్యకు వేడుక లిచ్చుకో !-'

అన్నమయ్య. - వినయంగా. -

'వెదుకబోలేను: వెనుకకూ పోలేను:

కొండకు రప్పించాడు: కొలువిచ్చాడు; చనువిచ్చాడు: కనులనీడనుండ నిచ్చాడు: కాని, - ముత్యమిచ్చి. - రత్నము పుచ్చకున్నాడు: నా పలుకు నా కీయడో, - యీ నా పాట విన వేడుక పడడో.- ఒంటరి చిందులే నా చేతనైనవి; యీ చిందులకు సాయం చెలియ ఎందుకు ?''

'నీవుపలికేందుకు! - నిన్ను పలికేందుకు!-

చెంత చెలియలేదో, - జిహ్వాను సరస్వతి లేదు.

అన్నమయ్య అయినా అంతే. - ఆదివిష్ణువైనా అంతే!- బుద్ధులు తెలిసిన చిన్నవాడా. - నీ పుణ్యం, ఊ ర కె పో దు. నీ పలుకులు నిన్ను చేరక మానవు : నీ కైనీ వారు నిన్ను చెందక మానరు: నీ చిందులు ఎల్లకాలమూ సాగవులే - అప్పుడుసాగనీయడులే!-కొమ్మకొమ్మకో గోవిందగాచెంగిలించే తిమ్మడికి. కుటుంబముంది; కొండలరాయడికి కోలో.. కోలో అని.- నిండుతనాన దద్దరిలే బసవడికి కదుపుంది - కామాటముంది !

చిలకకు చిలకుంది ; గువ్వకు గువ్వుంది;

మానికి తీవె ఉంది; మనసుకు మనసుంది.

ఉండితీరాలి ! అది-, నిదర్శనం !-

మన. శ్రీవారు.- సింగారి !- కనుచూపు మేరలో ఒంటరితనం ససేమిరా.- వారు సహించరు !- అది వారిసత్యం . యికనన్న తెలుసుకో !

కొండదిగి. కొమ్మను తెచ్చుకో!-'

'దిగను !'

'వగలబోకు !- వారేదించుతారు ! వలసినట్లు వంచుతారు !-

కొంగుముళ్ళతో,- సరిమ్రొక్కు-లందుకుని,- మరల రప్పించుకుంటారు !-

ఆ చిలుకరేకను,- నీవు కోరిన తీరున పలుకబ్బనే మో !-

ఔను చిన్నవాడా !- మగవానిజాతకం - మగనాలి సుకృతం -

ఓయి నీవే గురుతుకు తెచ్చుకో :-

కొంగింతదేవుడు.- ఒంటరిగ ఉండనేల అని ఆరాటపడినా వారట్ని చేసినావు !- మందికి మధనపడి.- క్రిందికి దించినావు!-

సుంకేశుల మానిక్రింది చోద్దెం చూసినావు !-

అంతలు జేసినావే-ఆ అయ్యమరచేనా ?

నిన్ను ఒంటిపాటుకు వదిలేనా ?-

చిత్తము అర్పించినప్పుడే. సిగ. వారికి అందించినావు : వారి చిత్తమురా.- చిందు వేయించక మానేరా ?-'

అన్నమయ్య.- ఆతల్లివంక జూసి. పకపకనవ్వి.

'అమ్మా !- నీమాటకు అడ్డం వస్తున్నాను ! వట్టినకు నీధోరణిలో - నీవన్నది నిజమే అయినా.-

నాధోరణే నాది; చిత్తగించావా అమ్మా !- పిని సిగ.వారికి చిక్కి-ందనుకోకు!- వారే.. మనచేతుల్లో చెప్పుచేతల్లో ఉన్నారు !-

ఉంటారు ; వారికి మరోదారిలేదు !

మనసు చిగిరించేవేళ.-మరులెత్తించారు: ...నసుఖానికి రప్పించుకుంటున్నామురా. అ: మెరమెత్పులు పోయినారు ! అంత కన్నెరా.. అనుకున్నాను ; వచ్చాను ; అమ్మడో.. రావలసివచ్చాననుకునేవు. కావలసే యీగట్టు ఎక్కా-ను ! చిక్కా-డుగదరా. వీడు :- అనుకున్నాడు.- ఆ నిలువుజీతం వాడు ; అదే సంబరాన ఉన్నాడు !

అమ్మా !- ఆ, మేని నిగనిగవాడు మెండు ..రాయం వాడు - ఎంతటి అమాయకుడూ కాకపోతే. - నాకోసం ఎందుకింత తాపత్రయం ! - లోకంలో. - అందరూ పెళ్ళిళ్ల చేసుకుంటున్నారా? తాను చేయిస్తున్నాడా-

తనవాడను కొన్నవాడు. - ఒంటిపాటున ఉండిపోవడం తన ఘ న త కు తగదనుకొన్నాడు కాబోలు: యీ ఎత్తుకు దిగినాడు: అంతవరకూ మాటాగాయె !'

కాని. - అమ్మా. - నీ వేమనుకున్నా సరేగాని,-

అవ్వారిది - పరమ పాషాణసరసం! -

చెప్పేతీరు వారికి తెలియదు :

తెలియకనే - గొంతు పట్టుకున్నారు ! తమ చిత్తము వచ్చినట్లు. - వీడిని మలచవచ్చునని : -

నన్ను పలుకాడ నీయడో - ఎ వ రి కి లోపం ?-

అమ్మా ! - చతుర్దశ భువనములూ. - తనకు క్రీడారంగమై యుండగా. - కావలెనని. - తెలుగులకు దైవమై. - వలసి. - తెలుగు సీమనే. తాను నెలకొన్న దెందులకు ? - అన్నమయ్య సంకీర్తన మాలించేందుకు ? -

ఔనా. కాదా ?-

తనకు లొంగనని. - యిప్పటికి తెలిసివచ్చింది

కాబోలు. - అమ్మను పురికొల్పినాడు. వట్టిపుణ్యానికే ;

మా అమ్మా నన్ను కాదనదు: నన్ను వెనుక వేసుకుని వస్తుంది.

అని. ఆ వేదవంద్యునికి తెలియదు !-

నిజమిది కాదా. అమ్మా.......'

ఆ తల్లి నవ్వినది: ....

ఆ నవ్వు - నవ్వులై, - ఆ నవ్వులు లేలేత గొజ్జంగిరేకలై. - ఆరేకలు,-కెంపులై వాని అరుణిమ, తళుకు - మంచుగా. - చినికి - చినికి, - జడిగట్టి. - వర్షానిజంఝూ విజృంభించి, పలురంగులమబ్బులు గీపెట్టి.- సుడిదితిగి,- ముద్దకట్టి. - ఆ ముద్ద ముత్తె దువై. - కనుల ఆనంద నీలాలు చిలుకంగా ఆ జిలుగులు, - చివురించంగా - గుములు గుములుగా, మెరుపుతీవెలుసాగి. - సాగిన తీవె ఒక మేనక, మెరసిన మెరుపు ఒక ఊర్వశి. — కాగా, - రోదసి, ఎల్లలు మీరిన నందనమై. - రవళించంగా ?-

తనకన్నులు వేయికన్నులై, - వేయి కన్నుల వేవేల చూపులై, - ఆ చిత్తరితనాల కోరాడంగా, - అచ్చరముగుదల కులుకుల రూపొందినచిలుక హుమాయిదొరకుచక్కలి గింతలుకాంగా,- పచ్చని, నులివెచ్చని ఐద మ్ములు.మరిమరి దోదమ్ములు చెలరేగి గరిషా డవగా.,ఆసమ్మదాన,- అమ్మదవతులు,-రమ కన్నవాని తత్తడులవలె.రివ్వునకమ్మకొని,- చిడిముడి సేతల, కంటి - మెప్పుల కల్లో లము సేయంగా,- తనకు మాలిన ధర్మమిది తగవుమీరిన సరసమిది,- అనిమననముగా,- ఎయ్యది విధివదాచరణీయమో, ఏది నిషిద్ధమో,- తెలియని తనాన,- తెలిసీ తెలియని తమకాన,- తెలుసుకునే కుతుకాన,- నివ్వెరి మొనవాని,- జిజ్ఞాసలో అటు మొగ్గిన పుణ్యాన,——

ఒక కౌగిట కరగి,- వేరొక మక్కువ మరగి,

ఒక కెమ్మోవిని సొక్కి, మరియొక కన్గవకుదక్కి,- అలవిమాలిన తీయందనాలు వాగురులై అలముకొనంగా,- నిబ్బరము సామరి,- ఒక్కక్షణ మేమరి,- మినుకు - మినుకుమనే యింగితము, కెరలి అమ్మా !- అమ్మా ! అని,- తన మూగతనమే వాపో వంగా,-

ఆ హావభావములెన్నొ గన్దోయిగా,- ఆ సేతలె నిటలముగా,- ఆ ఆనందమె ఆనన ముగా-, ఆ అరుణిమయే,- రూపముగా,- రోదసి చిన్ముద్రగా,, తాను,- ఆపాదసన్ని ధిని కరవీర కోరకముగా, తోచంగా,-

తానో చిరునగవై,-

ఆ చిరునగవే,- కనులనిండిన అంబకు ఉపాయనమై,- ఆతల్లి ప్రసన్నురాలుకాగా,-

ఆ కనుల వెలుగులో,- ఆతల్లి నీడలో,- ఆదరహాససుషమలో,-

అయిదుపాయల జడలతో, వయ్యారి నడకలతో, కాళ్ళపారాణితో, కనుల కాటుకతో, మోముల కళ్యాణ రేఖలతో,- కదలి వచ్చె,- తనకెదురువచ్చె,- తనవారిని, గురుతించి,-అమ్మా:యిదే నీ అభిమతమా,- కానీ తల్లీ,- వారిమాట కాదన్నందు కొకటీ,- నీతో రెట్టించినందుకొకటీ,- వెరసి రెండు వరాలు నాకు ప్రసాదించావా !- ఏవమ్మా మీ చిలిపితనం !- యిరువురితో వీ దెలా సతమతమయేనో చూడమని,- మీ ఉబలాటమా !-

అమ్మా !- బొమ్మల పెళ్ళిచేయడం- ఆ ఆటలేగి - తనానికి ముచ్చట పడటం, పసితనపు ఖులబాటము కాదూ ;

తీరా, ఆరా చూచావా ?- నన్నో యింటి వాడిని చేయబోయి - మీరు పసివాళ్ళైనారు ; ఎల్లకాలం-, యిక, మాకళ్ళకు మీరంతే ;-

రోజానికిద్దైవాలు - మాకు; మాపిల్లలు !,

అప్పుడు - మావంశోద్ధారకుడు - యీవాల-తాళ్ళపాకవారి పెద్దకోడలు!-

ది త్తగించావుగద !- కల్పనలో,- నేనూ మీకు తగిన ఘనుడ్డే ! కాబోయే కళ్యాణం కళ్ళలో మెరిపిస్తే - మూడుముళ్ళూ పడక ముందే, కొడుకునూ కోడల్నీ యింటికి తెచ్చుకున్నాను !

అమ్మాయ్-గురుతుంచుకో,- మనయింట సందెదీపం పెట్టడం - నీవంతు !-'

అన్నమయ్య కనులకు తెలివివచ్చినది- చూపు తెరిపిచ్చినది !

తానన్నది గురుతుకు వచ్చినది -

ఉలికిపడినాడు - అమ్మా : అన్నాడు !

ఆతల్లి కనిపించలేదు !

అవ్వా ! - నన్నాదించినది నీవా !- అన్నాడు !

అవ్వ, ఔనన్నట్లనిపించినది :

బిడియపడి, తలవంచుకున్నాడు........

—— మాడుపూరిలో ఆడపడుచు, వంచిన తల ఎత్తినది -

అన్నా ! మువ్వగోపాలా ! అని తనలో తానుగా పలుకరించినది. ఏదో చెప్పబోయినది ! అంతలో బిడియపడి, పలుకబోయిన- పలుకు మనసున దాచుకుని,- కదలే పెదవిని మునివంట నదిమి,


కనుల కలకలలు ముత్యాల తళుకులు జిమ్మ

గొజ్జంగిచాయ చెక్కిలిగ్రమ్ముకొనగ,—
అలనాడు, కొలనుదరి తనవాని దరిజేర
అరమోడ్పు గనుల నేరనితనముజూచి,
చనవుగ పల్కరించగ మేలమాడ,
కొనియాడ-మేనత్తకొమరుని మొరసి,
మొలకనవ్వులు ఉపాయనమీయబోయి
తోరంపు నునుసిగ్గు దొంతరలో తామై
కైదండలీయంగ, కలికితనమ్ము

"డాక్టరు గారూ, నేను మా అల్లుడి కాలు విరగ్గొట్టేనుగాని, కొంచెం [illegible]" అని ఒక [illegible] ఇంకో గోసామిని [illegible]చ్చాడు.

"అదేమిటయ్యా ఎవరైనా అల్లుడికాలు విరక్కొడతారా" అని డాక్టరు గారి [illegible]

"విరకొట్టి నప్పుడు మా అల్లుడుకాడు" అని సంజాయిషీ.



యేల్ర్ప్రాయమునకు చక్కిలిగింతలీయ బావా :-అని దూరాన ఉన్నవానిని, అను దినమూ, పలుకరించినట్లే పలుకరించింది !

కాని,- యీనాడెందుకో,- అలవాటు కొలదీ :పలుకరించబోగా,- బిడియము వేసింది !

బిడియమంటే తనకు యింతకుముందు తెలియదు :

ఆ వింత-దనం,- ఆ తిన్నని-తీయని విన్నదనం బిడియమని-- అది,- కన్నె తనానికి చేర్పుచుక్క అనీ,- ఎవ్వరూ తెలియ జెప్పలేదు :

ఈనాడు వైశాఖపూర్ణిమ :

ఔను,- పూర్ణిమ :-

తిమ్మక్క,- మువ్వగోపాలుని వంక, మరోమారు చూసినది- పలుకబోయి మరింత సిగ్గుపడినది -

ఇటు తిరిగినది -

తల్లి !-

తల్లి కనులవంకజూసి,- అమ్మా! అని, పలుకబోయి,- అంతలో సిగ్గుపడినది: తల్లి,- చిన్నదాన్ని దగ్గరసా తీసుకుని, చెక్కిలి నిమిరి,- ఆ మోమువంకచూసి,- మురిపెంగా ఉహూఁ - అన్నది-

సరిగ్గా ఆ తరుణంలో మాధవయ్య ఆ చాయలకు రావడం,- కనులతో భార్యను ప్రశ్నించడం,- వైనంతెలుసుకున్నవాడై - ఉహూఁ - అనడం జరిగింది :

అమ్మా అన్నాడు - తండ్రి

పిల్లది - తలయెత్తి చూసింది -

అలాగేనమ్మా !- అన్నాడు -

తిమ్మక్క - బిడియం పోయింది - మరింత కలకలలాడింది !-

పిల్లదాని సంబరంచూసి, - మాధవయ్య ధోరణి చూచి, యింటికైన యిల్లాలు కొంచెం బెరుకుగానే, - గొంతుసవరించు కుని, - అయన్ను యివతలికి పిలిచి, - తానేమాటలు పిల్లలు వినకూడదనుకున్నదో ఏమో, - తులసి కోట దగ్గరకు తీసుకు వెళ్ళి, అటూ యిటూ కలయజూసి, - నా మాట, - రవంత వింటారా ? అన్నది-

మాధవయ్య, - యిల్లాలివంక ప్రసన్నంగా చూసి, - మౌనహాసం చేసి, - 'వింటే మాబాగే, - నేనూ అందరు గృహస్థులతో పాటే - కాని, - అలావింటానా?-'

ఆవిడా, - నవ్వుతూనే - 'యీ పెడసరి తనమే యింటికి అదృష్టం - అందుకు సంబరపడుతూనే ఉన్నాను .... మీ ఎదుట పడి ఎవ్వరూ, - తగుదుమని పలుకలేరు : తగవిది కాదనలేరు : అది, - మా అత్తగారి కడుపుచలువ.-మా మామగారిపూజాఫలము. వటవృక్షం నీడనిచ్చి నేదదీర్చేను: ఆ అలనా పాలనా, ఆ ఆదరణా అంతవరకే; తన ఏ విచ్చేనా, తనఘనత యిచ్చేనా? - మీయింట సంజె దీపంపెట్టి, - మీ పిల్లలకూ మీకూ ఊడిగం చేస్తే - నాయీ సుకృతానికి తాము తరించేమని, నను కన్న వారు, - నన్ను మీ చేతికి అప్పగించినా - మీరెంత మన్నన చేసినా - మీ అంతదానిని నేను కాగలనా? - మీరింట లేని వేళజూసి, - ఆశెమ్మా ఓసెమ్మా, - కమ్ముకుని, - యిదేమి విడ్డూరమే మాతల్లీ, - అతగాడికి తోచక పోయినా, - నీకైనా రవంత యింగితం ఉండవద్దటే ! అభం శుభం ఎరుగని

పిల్ల, - దాని ఉబలాటం కొద్దీ, - ఏదో సంబరపడిందే అనుకుందాం - పెద వాళ్ళంటూ ఉన్నది, కాదూ - కూడదూ అనేందుకేగా, - ఆదిమూసి, - ఛళాభళీ అంటారా? - శాస్త్రం ఒప్పుకుంటుందా? - శాస్త్రం, సంప్రదాయంమాట ఏలా ఉన్నా - యింటికి పెద్దాదపడుచు, - ఓ అచ్చటా ముచ్చటా లేకుండా, - ఏమిటిది? ఆఖరికి కురకల కులాన అయినా, - ఆవో అనక ముందే జాహో అనరే - యింత దేశ ముండగా, - యీ వింత మన గ్రామంతోనే పుట్టాలా? - అని నన్నాయి నొక్కులు నొక్కితే—?'

'—నవ్వి ఊరుకో!- ఓసి పిచ్చిదానా-! వింతపుట్టినా విడ్డూర్యం పుట్టినా - మన యింటనే పుట్టాలి కాని, ఊరివారందరికీ అసుకృతమేదీ? - అనాడు, - మాలక్కమ పెళ్ళినాడు, - పెద్దరికమెవరిది? - మా నాన్నది కాదు, మాధవస్వామిది! అమ్మాయి పెళ్ళికి పెద్దలెవ్వరు? మనమా, - అక్కడ వెలసినవారా ?-

ఆసెమ్మనూ, ఓసెమ్మనూ, - తీరుబడిగా తల తడిమి చూసుకోమను .... యీ ధర్మ సూక్ష్మం చిటికెలో అవగత మౌతుంది,

నీకు తెలియక పోలేదుగాని, - జ్ఞాపకం చేయడం మంచిది: మన పెద్దల పున్నెమా అని, - ధర్మం మనయింట పుట్టింది, శాస్త్రం మనయిల్లు పట్టింది:

మనం వంకలు దిద్దేవారం!- ప్రేలు వంపించుకునేవారం కాము; యిది, దైవ నిర్ణయం ;

మరోవిషయం—



ఒక పెద్దమనిషి కాఫీ హోటలుకు వెళ్ళి ఒక కప్పు కాఫీ తాగాడు. బిల్లు చెల్లిస్తూ ప్రొప్రయిటర్ని చూసి "రోజుకు మీరెన్ని కప్పుల కాఫీ అమ్ముతారు?" అని ప్రశ్నించాడు.

"వెయ్యి కప్పులు"

"రోజుకి రెండువేలు అమ్మే ఉపాయం చెప్పనా?" అని కష్టమరు అడిగాడు.

"చెప్పండి - చెప్పండి - చెప్పండి" అని ప్రొ. ఉత్సాహపడ్డాడు.

"ఏంలేదు - కప్పులనిండా కాఫీ నింపితే సరి" అని సలహాలరావు నిష్క్రమించును.

తనవారు జాప్యం చేసినట్లు తోచిన పక్షంలో కన్య స్వవిషయంలో ప్రమేయం కల్పించుకోవడం - శాస్త్ర సమ్మతం:-

అది, అలాఉంచు !

అసలు యింతకూ మనలోమాట—

అక్కడ, అల్లుడు, దైవాన్ని కళ్ళకు గట్టుకుని కాలక్షేపం జేస్తున్నాడు ; దీనికి వాడిసరసను ఉండాలని ముచ్చటగా ఉండదా !-

పూజకు పూసిన పుష్పం - ఎంతకాలం కొమ్మనంటి పెట్టుకుని ఉంటుంది ?-

నిన్నా నేడూ, - అమ్మాయి మొగం వేసీవేయకుండా కలకల్లాడుతూంది. దానికి అర్థమేమిటే వెఱ్ఱిదానా ?-

కాగా, - ఎవ్వరూ అనుకో పనిలేదు-

పోగా, - ఊరూ నాడూ సంబర పడు తుంది.

పట్టెడు పసుపు చిట్టెడు కుంకం పెట్టి లక్షణంగా, - పోయిరమ్మను....'

'తోడు ?-'

'వాడే! - ఆ రప్పించేవాడే !'

'అవుననుకోండి! మనం పెళ్ళి కన్యా దానం చేయాలి గదండీ !'

'అక్కరలేదండీ ! - జ్ఞాపకంలేదూ ?- అల్లుడు యింటికి వచ్చాడనే సంబరాన, - అమ్మాయిని పెళ్ళికూతురికిమల్లే సింగా రించావు !- పన్నీటి కలశం పరిమళదామం పుచ్చుకుని అమ్మాయి ఆలయానికి వచ్చింది మాధవస్వామి.- చిన్నవాళ్ళను కంట జూశాడు: అదే కళ్యాణ వైభవం,

నీవు గమనించావో లేదో,- అనాటి నుంచీ, అమ్మాయి వాలకం ఏతీరున వుంది ? అత్తింటి కోడలు పుట్టింటికి చుట్టపుచూపుగా వచ్చినట్లు మెలగుతూంది కాని,- మునిపటి ఆ చిలిపితనం ఏది ?- కనుక'

'కనుక, కల్యాణ ప్రసక్తి లేదనుకోండి! వెళ్ళి అన్నమయ్యను చూసిరావటానికేం-?'

'ఏంలేదనుకో గాని,- కొండరాయడికి నిత్య సన్నిహితుడే వాడు! పరమ భాగ వతుడే !- ఎదుటపడితే,- సాగిలపడక మానడు! వానిచే మ్రొక్కించుకునే అర్హత నాకు లేదు: అదీగాక,- కనబడ గానే ఒళ్ళు మరచి నేనే వానికి మ్రొక్కే నేమో ! -

మ్రొక్కవలసినదే - కాని,- వాడు,- సాక్షాత్ నా మేనల్లుడు - నాకళ్ళ యెదుట పెరిగిన పిల్లవాడు,- నావాడు - అనే మమ కారం,- అల్పజ్ఞత,- ప్రతిబంధకంగావుంది! అది తొలగిననాడు,- పోయి మ్రొక్కక మానేనా ? -'

యిలా పలుకుతూండగా, మాధవయ్య కనుల ఆనందం వెల్లువకట్టింది....

__ఊరికైన పెద్ద ముత్తైదువు, మాధ వయ్యకు ఓ ప్రేలువిడిచిన మేనత్త, శాంతి సోమిదేవమ్మ,- చెంగుమలుపుకొని,- గుమ్మానికి పసుపుబూసి,- పిల్లలిద్దరికీ పారాణిపెట్టింది - అన్నప్ప సోమయాజులు గారు,- నేటికి మూడోనాడు,- పంచమీ సోమవారం ప్రయాణానికి సుముహూర్తమని నిర్ణయం చేశారు:

గ్రామంలో యింటింటికీ వెళ్ళి,- తిమ్మక్క,- దీవెనలందుకుని వచ్చింది! ఆలయంలో నిత్యోత్సవం జరిగింది!

సోమవారం! తెల తెలవారుతూంది - మాధవయ్య అనుష్ఠానం ముగించుకుని,- ఆలయంలోకి వెళ్లాడు! సోమిదేవమ్మ అప్పటికప్పుడే స్వామిదర్శనం చేసుకుని ఎదురైంది-

'ఒరే, మాధవా!- ఇవేళేగా ప్రయాణం?'

'ఆహా ! -'

'మరి,- పిల్లదాన్ని మేనాలోనే పంపు దామా ?.... ఏం ఏర్పాటు జేసినట్టు ?....'

'మేనా లేదు, మేజువాణీలేదు !- వాడేం ఏనుగెక్కి వెళ్ళాడా,- నడచిపోలా ?- యిదీ అంతే - !'

'అంతే నంటావా ? -'

'__అనక ? - ఆ తాళ్ళపాక వారింట ఏమ్మంత్రం ఉందో గాని,- వెళ్ళినకోడలు మళ్ళీ పుట్టింటికేసి చూడదు - నా కూతురేం తక్కువ తిన్నదా ?-ఆ లక్కమ్మ కోడలుకాదా ?....'

'అరిభడవా ! - అదిట్రా నీరంధి -' ఒరేయ్ ! యిహ ఉగ్గబట్టలేక అంటున్నాను- యీతరుణానన్నా లక్కమ్మవచ్చి పిల్ల దాన్ని వెంటబెట్టుకుని వెళితే....యెంత శోభాయమానంగా ఉంటుందిరా ?- ఊరిలో ఎవరిని చూసినా యిదేమాట :- యింటింటా యిదే ఆలాపన -....'

'ఏమో - వస్తుందేమో - ' యిలా అంటుండగానే మాధవయ్యకు వళ్ళు ఝల్లు మన్నది.... 'వాడి దైవం వాడికి కనిపిం చాడు,- కటాక్షించాడు ! యీసంగతి లోకం అంతటా తెలిసిందే - కన్నవారికి ఎందుకు తెలియకుండా ఉంటుంది - అంతటితో యీ అంకిలి తీరలేదా ?- మరి,- యింతకాలం ఎందుకు రాలేదు ? - తానన్నమాట మర చిందా ? - అలా మరువదే,- తోడబుట్టిన వాణ్ణి,- నామీద అపేక్ష తరుగదే !- పోనీ,- యిప్పుడన్నా రారాదా ?- కోడలు తరలి పోతుందని ఆ మనసుకు తోచి ఉండదా ?- వాళ్ళు సర్వమూ తెలిసినవాళ్ళే నే :- ఏమో- వస్తుందేమో !-' యిలా మనసు రాపాడింది! ఆలయంలో గంటలు మ్రోగినట్లు,- 'వస్తుం దేమో - వస్తుందేమో - !' అని మౌనం మార్మోగింది, మాధవయ్య, చూపు మసువు కట్టినది ! మనసు - స్వామి పుష్కరిణి, వేయి దివ్వటీల వెలుగులో,- నలుదిక్కులా క్రిక్కిరిసిన కోలాహలంలో,- మొయిలు కట్టిన కప్పురధూమం, ఆ జవనిక వెనుక, తెప్పోత్సవాన తేలుతూ తీవులు పోతూన్న మాధవస్వామి !

అలా తేజరిలుతూన్న మాధవస్వామి వారు, - శిరసు వంచిన వారందరినీ కరడు కట్టిన - చిరునవ్వుతో కటాక్షించి, బృందా వన వీధులలో, రాధాదేవి మనసు కైవసము చేసికొనే కనుకలి - కలిమిని, మురళి సారించిన మోహనుడై, యమునా తీరసైక తమ్ముల అడుగు దమ్ముల చిన్నెలునిచి, -

---

● లావుపాటి లక్ష్మీపతి సన్నపాటి సత్యనారాయణతో తన గోడు చెప్పుకుని సన్నపడేందుకు ఏదైనా సలహా చెప్పమన్నాడు. సత్యనారాయణ కాసేపు ఆలోచించి బాగా కడుపునిండా తినమన్నాడు. లక్ష్మీపతి తెల్లబోయి ఎందుకన్నాడు.

"ఏంలేదు, బాగా తింటే లావెక్కుతారు. లావెక్కినకొద్దీ బద్ధకం బలు స్తుంది. బద్ధకంవల్ల పని ఆట్టే చెయ్యలేరు, దాంతో ఉద్యోగం కాస్తా వూడుతుంది. ఉద్యోగం పోతే తింటానికి తిండి వుండదు. తిండి తినకపోతే మీరు తప్పకుండా సన్నబడి పోతారు." అన్నాడు సత్యనారాయణ.

చిన్నెలువోయి, - కొన గోట గోవర్ధనమ్ము నిలిపిన కిశోరుడై, - గొల్లల - రేపల్లెవాడ నవనీతచోరుడై,- పొరాడు పావడై,- పక పకలాడి,- న వ్వు లు పువ్వులై రాసులు దేరంగా,- మోటంత పత్రిలో కొండంత దేవుడై,- అంతలో, కను-మిక్కిలివెలుగై,- వెలిగే,- నివ్వెరిమొనవాని బిందువై,- బిందు సందోహమై,- సందోహమే నాదకోహళమై నాదబిందుకల్లోలమే కలకల లాడి,- ఆ కళ కద్దరిగా,- మసకతోచి, మబ్బుదోచి,- మబ్బంత గిరిదోచి,- గి రి క ం ద రా న, మంద్రమై,- శిఖరి కెగసి తారమై - తార కమై,- సడియై- సవ్వడియై-నినదమై- నినా దమై,- సంబరమై - సంరంభమై,- భరమై- వరమై, దహరమై లావలమై,- కేవలము తానై ....

మాధవయ్య,- అరమోడ్పు కనులతో,- స్వామివారివంక జూసి,- స్వస్థచిత్తమున-, 'అవునమ్మా ! తరుణము వచ్చింది. తానే వస్తుంది:' అనినాడు : ఆమె, మొగమంత చేసుకుని తల ఊపినది !

వచ్చింది ! ఒక కోతి !....పండుకోతి :

మాధవయ్యను చూసి, పలుకరింపుగా కిచకిచలాడి,- స్వామి సన్నిధికి పోయి,- చెవులు పట్టుకుని కుప్పిగంతులు వేసి,- సాగిలపడిలేచి,- మరల మాధవయ్యను సమీపించి,- చేతులు కట్టుకుని సరసన నిలుచున్నది - సోదెమ్మ వానివంక చోద్య ముగా చూస్తున్నది !

ఆయన వానిని చేరదీసుకొని,,

ఏమయ్యా - స్వామివారు పంపినారా,- మా లక్కమ్మ వెంట సాయముగా వచ్చి నావా,- మేలు !- తనవారిపై వారికి యెంత దయ ! కోహో !- మగపెళ్ళివారుకదూ,, వారు మెట్టుదిగరు !- బాలను తోడితెమ్మని బంటునంపినారు !- ఔ ను లే :- మేమే పాటివారమని !- మా కీ మ రి యా ద చాలుననుకున్నారా ?- వారు పెద్దలు,- అ ం ద రి నీ తల దన్నిన పెద్దలు ; వారికి వంకబెట్టే వారెవరు ! - పిల్లనిచ్చి, - కాళ్ళముందు కట్టి పడేసుకున్నారు: కన్న వారినీ ఉన్నవారినీ, - మరచేట్టు చేశారు , - ఊడిగం చేయించుకుంటున్నారు: ఓ చదువు లేదు. - ఓ సంధ్యలేదు - అహర్నిశలూ, - వారిసేవే: - మెట్టుకు ప్రయోజకుణ్ణి చేశారు: సంతోషము: భుక్తికి లేకుండా జేసి,- ముక్తి కట్టబెట్టే, - దాతలు: - ఊడిగాలవారి ఊడి గాని కొక్కపడతీ - నేటికి - కావలసి వచ్చినదన్నమాట! - బాగాయె! - వారి దాసాను దాసులకే,- సుకృతము యిబ్బడిగ దక్కేనట!- అదీ - వారి కరుణేనట!- దాని కేమిగాని,- ఏమయ్యో హనుమా!- అయ్య పోయిరమ్మనంగనే చేతులూపు కొంటూ వచ్చినావు సరే!- వారు గట్టుమీది వారైతే మేము బెట్టుమీది వారము: మాకూ ఓ అచ్చటా ముచ్చటా అంటూ ఉన్నది: వారి పెట్టుపోతలకు మేమాశించక పోయినా, - వారి పెద్దరికమన్నా వారు నిలుపుకోవాలి!- మాకు మేళ తాళాలక్కరలేదు- మేజువాణీ లక్కరలేదు - అడుగులకు మడుగులొత్తే అవసరములేదు: కాని, - అయినింటిపిల్ల,- అబ్బురాన పెరిగినదాల,- ఊహలు నేర్చిన ఉత్తమురాలు: అదృష్టముకొద్దీ,- దొరికిన యిల్లాలు: యీ మాధవయ్య కూతురు! యీ విషయము రవంత అశ్రీవారిని , గురు తుంచు కోమను: వారివి,- కళా కళలు !-

ఆఁ- మనపిల్లదేకదా అనుకుని,- ఎదురొచ్చి మాటా మన్ననా లేకుండా,- వారి మానాన వారుండేరేమో,- అహఁ- ఆగీర్వాణం మన దగ్గిర సోసాయించదు: పనివేళా. గట్టుదిగి రావలసినదే!- ఎదురు కావలసినదే!- 'నా తల్లీ వచ్చినావటే' అని చేరదీసి దీవించ వలసినదే - మన ప్రబుద్ధుడికి చాల నవ్వ గించి - 'ఒరేవ్ నాయనా!- చూసే వారికి ముచ్చటగా,- ఏలుకోరా!' అంటేచాలు!- మనం మరేం కోరం: ఆ పైన, వారివారి యిష్టం: వీడితోబాటు యిదీ,- చెట్లూచేమలూ పట్టి, పొదులూ బోదెలూ కడుతూ,- సత మతమౌతూ - సంబరపడుతూ - ఒకరి నొకరు కొంగున కట్టుకుంటారో,- ఎవరికి వారై,-ఎవరంతవారు వారై,-శీవులు పోతారో ఎలా చెప్పగలం? చూస్తూనే ఉన్నాంగదా? - అది స్థలమహాత్యం!- ఆఁ- అసలు విషయం చెప్పనేలేదు: తగుదునమ్మా అని తానొక్కడూ బుడుగూ - బుడుగూ ఎదురొస్తే చాలదా అనుకునేనేమో,- చాలదు: యథా విధిగా, దంపతులిద్దరూ రావలసిందే!- ఎన్ని యుగాలుగానో,- ఏ అరమరికా లేకుండా ఎంతో అన్యోన్యంగా కాపురం చేస్తున్న కలుపుగోలు తనం.. అ మ మే క ం తో మా అమ్మాయికి ఎదురు రావలసిందే- అదీ అడపెళ్ళివారికి వారిచ్చే గౌరవం. 'సరే ననుకో- కాని అన్నీ తెలిసి,- నీవిలా అంటే ఎలాగయ్య- అది అయ్యేపనా?-' అంటావేమో ఆ భాగవతం మనకూ తెలుసు లేవయ్యా - ఏమిటలా తల ఊగిస్తావ్ ? తగు సమాధానం చెప్పవేం. ఆహో!-కొండెక్కిన వాడొకడూ!-కొమ్మెక్కిన వాడొకడూ దొరికారు మాకుబంధువులు!-'



"ఈ ప్రపంచంలో కల్లా నా భార్యారత్నమే అందాల భరిణి! ఇది నా ఒక్కడి ఉద్దేశమే కాదు, - ఆవిడకు కూడా అదే అభిప్రాయం !"

మా ధ వ య్య మా ట లో నే పకపక నవ్వుతూ - హనుమా - ఆదికాలంవాడవు - అవతారమూర్తుల సేవించేవాడవు - యీ పామరధోరణి నీకు అర్థం కాలేదేమో - యివి,- వియ్యాలవారిదెప్పుళ్ళయ్యా !- యీ లాంఛనం మాకు ముచ్చటయ్యా!-' అంటూ హనుమ భుజంతట్టి,- 'అత్తయ్యా,- కదల వమ్మా !' అన్నాడు ! సో మి దే వ మ్మ అప్పటికి తెప్పరిల్లి,- హనుమవంక,- కను- మొక్కగా చూసి,- నవ్వు మొగమైంది!....

మాధవయ్య లోగిలిలో,-

యింటికైన ఆడపడుచు,- అన్నేళ్ళకు, మరల,- తనకు తానుగా పుట్టింటికిరావడం,- ఊరికి ఉత్సవమైనది :

ఆమె, యింకా పొలిమేరల్లో ఉండగానే,- గ్రామంలో వార్తతెలిసింది ! లోగిలి దరి దాపులకు వచ్చేలోగా,- యింటిముందరా, యిల్లు నిండుగా, ఊరూ నాడూ పోగయింది! అన్నేళ్ళకుచూసినా, అందరికీ నిన్న మొన్న చూసుకున్నట్టుగానే ఉంది. ఎప్పటికళే! -

ఎప్పటి కవళికే.కోవిలకు వెళ్ళిన.ఐదువరాలు, యింటికి తిరిగివచ్చినట్టనిపించింది: ఎటో పేరంటానికి వెళ్ళి. వేళకు యిల్లు జేరుకున్న ట్టనిపించిది!

లక్కమకు యింటిమీదనే చూపు: తల వంచలేదు - తల ఎత్తలేదు! నడకలో,- తొందరలేదు - తొట్రుపాటు లేదు-గుమ్మం లోకి, ఎదురువచ్చిన ఏ ఒక్కరినీ.. పలు కరించకనూ పోలేదు - పుట్టిబుద్ధెరిగినవేళ,- ఎలా మసులుకున్నదో,- నేడూ అంతే - ఊరికి తాను కొత్తకాదు. తనకా ఊరు క్రొత్తకాదు - అందరికీ,....అలా అనిపించింది!

గుమ్మంలో వదినెగారు నిలుచున్నది.

చేతనున్న పండూఫలం ఆమె చేతిలో పెట్టింది -

నూద్దగిరికిపోయి, కాళ్ళు కడుక్కుని,- కుచ్చెళ్ళొత్తిపట్టి,- పడమటింట్లోకివచ్చింది. పెద్ద పీట వాల్చుకుని కూర్చుంది —

తి మ్మ క్క.. అ క్క మ్మా.. ఎదుట పడ్డారు!

తోడ పెళ్ళికూతుళ్ళ—

అప్పుడే తరిమెనబట్టిన తులసిపూసల వలె! పులికాపుచేసిన ఉత్సవ విగ్రహముల వలె,- నీరెండలో వన్నెలుదేరే పూర్ణకుంభముల వలె,- పూజకైన పూమాలలవలె - తోచినారు! లక్కమ వారివంకచూసింది! తల ఊపింది!

చిరుసిగ్గు, చిడిముడిపాటు, - భయం, సంభ్రమం, ఆపేక్ష, ఆప్యాయత: బాలల కన్నుల తొణికిసలాడినవి:

లక్కమ్మ నవ్వుతూనే చేతులుజాపింది- చేరదీసింది:

'తిమ్మక్కా: మొన్న పాడ్యమినాడు,- గంగవ్వకు.. నెల పొడుపు పూజకని పోతిని గదా:

దారిలోనే హనుమ ఎదురైనాడు:

కిచకిచ లాడినాడు:

వారు పంపినారట:

అన్నమయ్య యిక ఒంటరిగా ఉండ రాదని,- వారి ఆదేశమట: అయ్య సేవ కొకరూ అమ్మ సేవల కొకరూ అవసరమట: నేను కదలిపోయి,- కోడళ్ళను తోడుకొని రావలెనట: గంగవ్వ-, తానై కదలి సాయం వచ్చేనట: దారికాపు గంగవ్వేనట: మహా ప్రసాద మనుకున్నాను:

గంగవ్వను పలుకరించినాను:

హనుమ,- అవ్వకు ప్రదక్షిణముచేసి,- కొమ్మ కెగసినాడు: కొమ్మ ఫెళ్ళుమన్నది: మబ్బులేక ఉరుమురిమినది: చెట్టూ గలగలలాడినది: అవ్వ కదలినట్లనిపించింది: మూడడుగులు వెనుకకువేసి,- 'అవ్వా సకినె మిదా!' అన్నాను:తూర్పున మబ్బు పట్టింది: దక్షిణాన మెరుపు మెరిసింది: గాలి కదలింది: గగనం విచ్చుకుంది: కానరాని పిడుగువట్టి, కనుమేర వెలుగేసి, అమ్మవారి మాను - నెరియయిచ్చి,- ఆ చెంపకీ చెంపకూ వాలిపోయింది: అ పాటులోనే,- గంగవ్వ మట్టసం కలుక్కున విచ్చుకుంది తల్లీ: ఆయన పలుకే అవ్వపలికింది తల్లీ:

తాళ్ళ పాకలో, అవ్వకు, సాగనంపు సంబరాలు జరుగుతున్నాయి: ఐదువరాళ్లూ,- కన్నెపడుచులూ.. చెంతనోచుక్కా,- నొష్టనోచుక్కా పెట్టుకుని, పాపిట కుంకం అద్దుకొని,- అరచేతుల గోరింట వన్నెతో,- కాళ్ళ పారాణితో,- కుసుందావన్నె కోకలు

గట్టి,- కీలుగంటు వేసుకుని, సిగలో మందారాలూ తలకో మ్రొక్కుగా మొక్కితే తర తరాలకు తరగని దీవెనలిస్తూ,- అష్టదళ పద్మ వాహనాన అవ్వ, కొలువుదీరి,- మన కోసం వేచియున్నదమ్మా!- ...'

వదినెగారు,- యీ పలుకులు అల్లంత దూరమున నిలుచుని ఆలకించింది;లక్కమ్మ అప్పుడామెవంక జూసి అన్నది గదా,—

'విన్నావు కదా వదినా; యిందులో మన ప్రమేయంలేదు: .... యిక నీదే ఆలస్యం- పిల్లలకు బొట్టుపెట్టి·వడిబియ్యంకట్టు-'

ఆవిడకు,- ఆనందమంత దుః ఖం వచ్చింది:

అంతలో,.. ఎవరో కళ్లు తుడిచి వెన్ను తట్టి నట్టనిపించింది: ఆవిడ గే ద్గు కు ని, యింతకాలం,. మీ యింటి కోడలినైనా,- యింకా అజ్ఞానురాలినే వదినా..' అని కలత లేని నవ్వు నవ్వింది:....

మాధవయ్య,- తిరిగి వచ్చాడు:

హనుమ గుమ్మంలోనే ఆగిపోయినాడు:

పిల్లలిద్దరూ ఎదుటికి వచ్చినారు:

వారివంకచూసి,- ఆ చూపులోనే చెల్లెలి వంక చూసినాడు: యిద్దరికీ నవ్వుమొగాలు:

పిల్లలిద్దరూ,- ఒకరు పన్నీరు కలశం ఒకరు పరిమళ దామం అందుకున్నారు: తండ్రి 'మాధవా! నీ కృప!' అని స్మరించినాడు:

పిల్లలు కదలినారు

వెంట పెద్దలందరూ:

హనుమ ముందు నడిచినాడు:

ఊరుదాటి పోయే ముందు-

పొలిమేరలో,-

లక్కమ్మ - అగకుండానే - 'అన్నా' అన్నది - 'అమ్మా' అన్నాడు:

అందరూ ఆగిపోయినారు:

వారు, ముందుకు సాగినారు:

—తాళ్ళపాక పొలిమేరల్లోకి-

గంగవ్వ ఊరేగుతూ వచ్చింది:

ఐదువరాళ్లూ, కన్నెపడుచులూ అందరూ వెంట వచ్చారు: ల క్క మ్మ గంగవ్వకు హారతిపట్టి,- పిల్లల కన్నుల క ద్దిం ది: పేరంటాండ్రందరూ- అవ్వమీద కుంకుమా పసుపూచల్లి,- చేత నుంచుకున్న చెంగల్వలు,- ముందుంచినారు: హనుమ,- ఆ కుంకుమలో తానూ వాలాడి,- ముద్దమందార మల్లెముందు నడచాడు:

సాళువ నరసింహరాయలు: దారి పొడుగునా చలువ పందిళ్ల వేయించినాడు: దాటల పరిమళోదకం చల్లించి పూలుపరిపించినాడు: ఊరూరా,- అవ్వ ఒక్కక్షణం, నిలిచింది: నిలిచిన పట్టున: ఊరివాళ్లు,- ఎన్నడూ కొలుచుకునేందుకు దేవర శిలలు నిలుపుకున్నారు: అలాసాగి పోయినారు....

● భర్త: "పోనీ హిస్టరీ పేపరన్నా బాగా రాశాడా నీ సుపుత్రుడు?"
భార్య: "అదిమాత్రం ఎట్లారాస్తాడండీ, వాడు పుట్టకముందు ఎప్పుడో జరిగిన వాటిని గురించి అడిగితే?"

అక్కడ అన్నమయ్య....

కప్పురపుటనటి తోటలో మోకాలిబంటి పరిమళోదకంలో.. ఒడ్డున నడిచేవాడు.. తన నీడచూసి.. తానే ఎందుకో బెదరినాడు. 'ఏమో'అనిపించింది. చెక్కులద్దుకున్నాడు! నులివెచ్చదనం తోచింది! కనుల నీరు క్రమ్మింది! తమకం హెచ్చింది. 'ఇదేమో' అనుకున్నాడు! తులసివనం చేరుకున్నాడు! అక్కడనూ కాలు నిలువలేదు! సంపంగి వనం చేరుకున్నాడు! అక్కడ మనసే నిలువలేదు - యిది కాదనుకుని.. ఎటో నడచిపోతున్నాడు! కోతిమూక. ఎదురైంది! అన్నమయ్య ఆగలేదు! వేయి గొంతుల ఒక్కటే కిచ కిచ. చుట్టుకుని కదలనీయలేదు-కోతులు చేతులు పట్టుకున్నవి.. ముందుకు లాగినవి; కదలడే!-

ఎవరో అవ్వ.. అవ్వవెంట ఎవరో ఆయన: యీచోద్యం చూడటానికి ఆగినట్లు ఆగినారు

అవ్వ. చూసి - చూసి నవ్వింది.

'పుణ్యానికి లాగుతూంటే.పుణ్యాత్ముడు కదలడేం-' అంది.

'ప్రాప్తం:' అన్నాడాయన!

'పాపం! చెప్పు చేతలక్కరలేకుండనే.. యింతకాలం తన వెంటనే.. పువ్వు లూ పత్రి కాయించి సేవల కందించెనే! తీర్థాని కన్నా ఆసపడలేదే! ఏమో.. వాటి ముచ్చటేమో! రమ్మంటే - ఎందుకలా పెనుగులాడతాడు?-

'యింగితం లేక!'

'కాదు! చెప్పేవారు చెప్పక!-'

'చెప్పినా వినక-'

'వినే తీరున వినిపించక!'

'అనగా-'

'చెవులు పట్టి.. చిన్నవాడా లొంగిరారా అనక'

— ఒకకోతి అన్నమయ్య భుజానికి ఎగిరి.. చెవిపట్టుకుని కిచకిచ లాడింది!

అవ్వ.. ఆయన కలిసి నవ్వారు:

'యిక దారికివచ్చినట్టే' అనుకుంటూ ముందుకు సాగిపోయినారు: అన్నమయ్యకు తెలియనిది తెలిసినట్లనిపించింది! నవ్వుకుంటూ ముందు అడుగువేశాడు:

అవ్వా ఆయనా.. నడుస్తూన్నారు!

దారివెంట - కోతిమూక.. పూలరాశి పోసింది; నేలపాదము లాననంత సుతారంగా.. వడివడిగా.. అడుగులు గోచరిస్తున్నాయి!....

— దారి మలగింది! ఊరు విచ్చుకుంది!

హనుమ వైదొలగినాడు:

అవ్వా.. ఆయనా.. ముందుకు వచ్చినారు:

'రావే మాతల్లీ' అని.. పిల్లలను చేరదీసుకున్నారు!

అన్నమయ్య అక్కడకు చేరుకున్నాడు:

అన్నమయ్యను చూసి, ఆయననుజూసి. అవ్వ అన్నది కదా..

'వగడమంత సత్యంలో.. ముత్తెమంత తేజం పుట్టంగా.. నీలమంత గగవంలో నివ్వరిమొన తళుకులో.. మెలకువ తెలిసిన వారికి, రోదసి యిల్లాలైతే.. తనదెక్కడో.. తానక్కడే.'

ఆయన నవ్వినాడు!

అనవ్వ అన్నమయ్యకు ఆనందమిచ్చినది.

తిమ్మక్క.. పన్నీటికలశం అన్నమయ్యకు అందించినది!

అన్నమయ్య.. అక్కమచేతి పరిమళ దామం చూసి. శిరసు వంచాడు; అక్కమ ఆ దామం. గంగివ్వ సన్నిధిని ఉంచింది:

అవ్వా.. ఆయనా.. వారికి కనిపించలేదు!

అక్కమ శిరస్సువంచి.. నాకు 'సెలవా' అన్నది! అన్నమయ్యకు.. అర్థంకాలేదు!

'మందారవనంలో వెలసిన అవ్వ.. కొలువుకు రప్పించుకున్నది: ఆ సేవకు నేను బోయేను! తిమ్మక్క మీసేవ కమరేను!'

అక్కమ్మ వెనుదిరిగింది!

హనుమ, ఎటునుండో వచ్చి.. తంబుర దండే చిరతలూ.. అన్నమయ్యకు అందించినాడు! చిరుతలు చేతనందుకొనగానే.. ఆ గల గలలో.. కృష్ణమాచార్యుని.. గానం వినిపించినట్లయింది - తంబుర మీటంగనే పలుకొచ్చింది! పలుకులో పలుకుగా, తిమ్మక్క.. ఏమని విన్నవించుకున్నదంటేను—

నాతనువే నీతలవాకిటిమంగళతోరణము!
నాహృదయమే పూర్ణకుంభము!
నిను జూచిన చూపే నిత్యనివాళి.
పలికిన పలుకే - పాదపూజ:
తలచిన తలపే నివేదన -
నిలచిన నిలచే..కదలిన కదలే నీడనయ్య
నీ సన్నిధిలో వెలుగు రేకనయ్య..
నీ కెత్తిన కప్పుర ఆరతినయ్య.
నిను కమ్మిన పరిమళ ధూపమునయ్య.
నీపాదతీర్థమునయ్య - నీ ప్రసాదమునయ్య -
శివము నీవయ్య - కైవల్యమేనీవయ్య -

విన్ను గొల్చినవారి పుణ్యఫల రూపాన.. నీసేవకైపుట్టి నీ సేవకై పెరిగి, నిన్నెరిగి బుద్ధెరిగి.. నీకు చేరువై. సేవకినైన.. నన్ను నీవు చిత్తమున చేర్చుకోవయ్య.. చెంగల్వరాయ!—

సంజెవేళ.. అన్నమయ్యా తిమ్మక్కా కొండకు జేరుకున్నారు! స్వామి ప్రాంగణములో.. వేయి దీపములు వెలిగినవి! వేనకు వేలు గొంతులు గోవింద కోలాహలములో నున్నవి:

వెన్నెలలో.. తులసీవనములో.. వారున్నారు!

'మేనమామ కూతురా.. మేనరికపు వావిదాన, నిలువనీడలేనివాని.. యిల్లాలా యిటురావే-!' అన్నాడు అన్నమయ్య! తిమ్మక్క నవ్వుకున్నది: తాను వెంట తెచ్చిన గ్రంథము అందించినది! పరిశీలించినాడు! కన్నుల కొత్తుకున్నాడు!

హనుమ.. పాలదుత్త తెచ్చినది!

మరో హనుమ పండ్లు తెచ్చినది!

మరో కిచ కిచ పూలు తెచ్చినది!

ఆ పూవులందుకుని.. సిగలో తురుముకుని—

'మాడుపూరిలో ఆడపడుచు. మాధవుని సేవించగా.. పుణ్యాన పుట్టిన మణిపూస.. మేనమామ యింటికొచ్చి మేనరికం.. కుదుర్చుకుని.. తన వారికి దూరమైన, తామర కమలమ్మా -దూరాభారం వచ్చి.. తోచినసేవలుజేసి.. కొండల కోనేటివాని గుత్తగొన్న. బ్రహ్మచారీ: ఆరగించేమా!- అవ్వాని సేవలో అదమరచేమా-' అన్నది!

గగనాన వెలుగు శిఖరానికొచ్చింది:

శిఖరాన వెలుగులో, గంగవ్వ, కన్ను మెరసింది!

అన్నమయ్య - సంకీర్తము కోనేటి రాయని కమ్ముకున్నది. □□□

[సమాప్తం]



ఏకోన్ముఖులు

కె. రామలక్ష్మి

కృష్ణమూర్తి ఆనందంతోనూ, బాధతోనూ పార్వతికేసి చూశాడు. ఆనందానికి కారణం అతడామెను ప్రేమిస్తున్నాడు. దుఃఖానికి కారణం ఆమె స్నేహితురాలుగాని ప్రేయసికాదు! జనవరిలో కలుసుకున్నారు. అప్పుడే ఆగస్టు సెప్టెంబరులు దాటేశాయి. అక్టోబరుకూడా గడిచిపోతూంది. ఈనెలాఖరుకి పార్వతి వూరికి వెళ్ళిపోతుంది! ఇక పార్వతి కనబడదు!

"పార్వతీ నామాట విను" అన్నాడు.

"వింటూనే వున్నాను" అంది పార్వతి.

ఇద్దరూ పార్వతి యింట్లో ముందు గదిలో కూర్చుని ఏకాంతం అనుభవిస్తున్నారు. చదువుతూన్న నవల క్రిందపెట్టలేదు. సరికదా పేజీ తిరగేసింది పార్వతి.

"పార్వతీ! యీ ఆదివారం మహాబలిపురం వెడదామా?"

"ఏమీ చెప్పలేను. అయినా యెంతౌతుందో?"

"ఓ పదిహేను రూపాయలుంటే చాలు. ఇంకో యిద్దర్ని పోగుచేస్తాను - కారున్న వాళ్ళని...."

"అంతఖర్చు భరించలేననుకో! అయినా ఫరవాలేదులే - నాకూ మార్పు కావాలనే వుంది. ఇంట్లో కూర్చుని ఎన్ని చొప్పదంటు నవలలు చదివినా విశ్రాంతిలేదు!" అంది పార్వతి.

"అద్భుతంగావుంది!" అన్నాడు కృష్ణమూర్తి. ఒప్పుకోవడమే తనకి గెలుపని భావించాడు కృష్ణమూర్తి! మళ్ళీ మనస్సు మార్చుకుంటుందేమో అనితక్షణంచెప్పాడు. "ఆ యిద్దరూ బొత్తిగా పైవాళ్ళ కాదులే. సరళ నాకు వరసకి చెల్లెలు అవుతుంది. సరళ మొగుడు పెద్ద ఉద్యోగి. మర్యాదస్థుడు. మనంనలుగురం సరదాగావెడదాం" అన్నాడు.

లేచి నిలబడి పుస్తకం మూసి పక్కన పెట్టింది పార్వతి. సన్నగా నాజూకుగా వుంది. బలమైన చిన్నగెడ్డం, విశాలమైన పెద్దకళ్ళ. నల్లనిజుట్టు నడుందాకా సాపుగా వేళ్ళాడుతోంది. పాతికేళ్ళ పడుచుదనం వెల్లివిరిసిన యువతి పార్వతి.

"నీ ముక్కుమీద మసి అంటుకుంది" అంటూ దగ్గరకు జరిగాడు కృష్ణమూర్తి. పార్వతి కదల్లేదు. జేబులోంచి మడత నలగని జేబురుమాలుతీసి అతిశ్రద్ధగా తుడిచాడు పార్వతి ముక్కున అంటిన మసి. పార్వతి చూస్తూ నిలబడింది. అక్కర్లేనంత ఎక్కువ సైము పట్టింది కృష్ణమూర్తికి. సూటైన ఆముక్కు దానిచివర ఓచిన్న పుట్టుమచ్చ! మనెలా వచ్చింది? ఎప్పుడూ ఇంతదగ్గిరగా యిద్దరూ నిలబడలేదు. ఈ సాన్నిహిత్యం కృష్ణమూర్తి హృదయాన్ని కోస్తూంది. ఆ చెంపవాటు నిమిరాలనిపించింది. అలాగే దగ్గిరకి తీసుకుని ముద్దుపెట్టుకోవాలనిపించింది.

కాని పార్వతి రెండడుగులు వెనక్కివేసింది. వంగి పక్కన పెట్టేసిన పుస్తకం తీసింది. ప్రాణం వుసూరుమంది కృష్ణమూర్తికి. "నువ్వు చేసేపనేమిటో నా కర్థం కావడంలేదు" అన్నాడు. "తెలియకేం? తెలిసే అంటున్నావు" అంది. చిలిపిగా చూస్తూ పార్వతి. "పుస్తకాలంటే అలా

భయపడిపోవడం బాగులేదు. ఎంత ఇంజినీరువైతేమటుకు లోకం ఏమంటోందో తెలుసుకోకపోతే ఎలా?" అంది. కృష్ణమూర్తికి అర్థం అయేపుస్తకాలు తక్కువ. తల్లిచేతిలో తెగనలిగిన అధ్యాత్మరామాయణం, చలం మైదానం, విశ్వనాథ వేయిపడగలో చదివితే చాలు సాహిత్యపు రుచి తెలిసి పోతుందని నమ్మినవాడు కృష్ణమూర్తి. ఇంజనీరుగా తర్ఫీదు ప్రారంభించాక యిలాంటి వాటి జోలికిపోవడం మానేశాడు.

"సరళా, సరళభర్త చాలా సరదాగా వుంటారు. రెండురోజులు వాళ్ళతో కలిసి వున్నావంటే నువ్వూ యిక వెళ్ళిపోవాలని అనుకోవు. అయినా యిప్పుడు ఆ పల్లెటూరు వెళ్ళకపోతేనేం?" అడిగాడు కృష్ణమూర్తి. తనని ఒదుల్చుకుందుకు వెళ్ళిపోతానంటోందేమో అని భయం కృష్ణమూర్తికి. పార్వతి ముఖం అసలుసంగతి వివరించడమేలేదు!

కబుర్లు చెప్పుకొంటూ వీధిలోకి వచ్చేశారు యిద్దరూ. ఈ గబ్బువరండా దాటితే వీధిగేటు. వరండా పొడుగునా యిళ్ళ గుమ్మాలే! అద్దెలకోసం అన్నిసదుపాయాలతోనూ కట్టిన ఇళ్ళవి. ఓ వాటాలో కృష్ణమూర్తివుంటున్నాడు. హఠాత్తుగా ఓవాటాలో ఓరోజు ప్రత్యక్షం అయింది పార్వతి.

ఆరోజు ఇద్దరికీ బాగా జ్ఞాపకమే! నిజానికి ఆరోజు ఎవరూ మరువలేదు—

ఏడెనిమిది మాసాలు ఆయివుంటుంది. ఎర్రని వానకోటు తొడుక్కుని వుంది. తల మీద ఏమీ కప్పుకోకపోవడంతో జుట్టు తడిసి బుజాలక్రిందుగా గమ్మత్తుగా వేలాడుతోంది. ఈ దృశ్యం చూడగానే ఒక్క అడుగు ముందుకు వేయకుండా నిలబడిపోయాడు కృష్ణమూర్తి. ఆమెలోని ఏదో శక్తి అతన్ని కదలనియ్యలేదు. ఈవిపరీతం ఏకోన్ముఖంగా జరగలేదని తెలుసుకుని సంతోషించాడు. పార్వతికూడా అలాగే నిలబడి పోయింది. రెప్పవాల్చకుండా అతణ్ణే చూస్తోంది. ఏదో ఒకటి అనాలని అనుకున్నాడు. కాని ఏమాటా దొరకటంలేదు. పార్వతీ రెండడుగులు వేసి ముందుకు వచ్చింది. చూపుమటుకు తిప్పుకోలేదు— "ఇంతటి విపరీతం నే నెక్కడా చూళ్ళేదు: నమ్మండి" అంది ఏమాత్రం ఉపోద్ఘాతం లేకుండా. నున్నగా గీసివున్న తనగెడ్డం తడుముకున్నాడు కృష్ణమూర్తి.

"గెడ్డం పెంచితే నయమేమో!" అనుకున్నాడు సగం స్వగతంగా.

"అబ్బెబ్బె! అదేంకాదండీ. నాకళ్ళని నేనే నమ్మలేకుండా వున్నాను. ఆ కనుబొమ్మలమధ్య;చిన్నగుంటలదగ్గరనుంచి.... ఏం తేడాలేదు. మీ రాగిజుట్టు! మీముక్కుతీరు! నాతోరండి చూపిస్తాను." అంటూ అడుగులు త్వరగా వేసింది పార్వతి. ఆమె అన్నమాటలో ఒక్కటికూడా బోధపడలేదు. కాని రమ్మందని మటుకు వినిపించింది. అంతే నిద్రలో నడిచే వ్యక్తిలా ఆమెవెంట నడిచాడా రోజు.

"ఈవేళేవచ్చాను. ఇంకాసామానుకూడా పూర్తిగా సర్దుకోలేదు. ప్లీజ్ కూర్చోండి!" అంటూ ఓపెట్టెముందు మోకాళ్ళ మీద కూర్చుని వెతకడం ప్రారంభించింది.... దాట్లో ముందో అని ఆత్రంగా,కూర్చున్న పార్వతి తలమీంచి తొంగి చూశాడు కృష్ణమూర్తి. అన్నీ పుస్తకాలే!! ఈవిడో పుస్తకాల పురుగుకాబోలు అనుకుని గప్

చిప్‌గా కూర్చున్నాడు. ఆ పుస్తకాలలో వెతికి తనకి కావలసినది పట్టింది. దాంట్లో వెతికి తనకి కావలసిన పేజీ తీసి 'ఇదిగో!' అంటూ పట్టుకొచ్చింది. అదొకబొమ్మ. సరిగ్గా తనలాగే వున్న బొమ్మని చూస్తున్నాడు! అది అద్దంకాదు కదా అనిపించింది కృష్ణమూర్తికి. పార్వతి సన్నగా నవ్వింది.

"చూశారా? అదో ప్రముఖ చిత్రకారుడు పదహారో శతాబ్దంలో చిత్రించాడు. దాన్ని చూస్తుంటే పునర్జన్మలో నమ్మకం కల్గడంలేదూ! మళ్ళీ యీ అవతారంలో పుట్టారు మీరు?" అంది. "నాకిదో పిచ్చి అనుకోకండి. నాపేరు పార్వతి. ఇల్లు దొరక్క అవస్థపడుతున్నాను. మాఅత్తయ్య ఖాళీ చేస్తూ యీయిల్లు యిప్పించింది....నేను వృత్తిద్వారా గుమాస్తాని. కాని సాహిత్యం నా వూపిరి. కళచూపు." అనిపరిచయంచేసుకుంది....ఎందుకో అర్థం లేకుండానే యిద్దరూ నవ్వుకున్నారు....కాఫీతాగుతూ ఆరోజువర్షం తగ్గకూడదని కోరుకున్నాడు కృష్ణమూర్తి!

ఓ గంట రెండుగంటలు - ఎంతసేపు కూర్చుంటాడు! వెళ్ళక తప్పదని వెళ్ళిపోయాడు. ఆరాత్రి సగం గడిచేవరకూ పార్వతిని తలుచుకుంటూనూ, మిగిలినది ఆమెనుగురించి కలలు కంటూనూగడిపాడు.

పార్వతి చాలా నిర్మొగమాటి అని గ్రహించాడు కృష్ణమూర్తి. దారిలో కలిసి వెడుతూ కాఫీ తాగుదాం వస్తారా అండీ. నాడబ్బు నన్ను పెట్టుకోనిస్తారా? అని అడిగేది! అయినా కృష్ణమూర్తి లెక్క చెయ్యలేదు. అంతులేని ఆకర్షణలోపడిపోయాడా ఘోటక బ్రహ్మచారి. ఏడు మాసాలూ ఎలాగో గడిచిపోయాయి. అడపా తడపా మాట్లాడుకోవడం మానేసినా, యిద్దరూ కలిసి పుస్తకాల షాపులో, పేవ్‌మెంట్లూ కలిసి తిరిగారు. పార్వతి కోసం అని మంచిబొమ్మలు చూడ్డం, మంచి పుస్తకాలు చదవాలనుకోవడం మొదలుపెట్టాడు కృష్ణమూర్తి. ధైర్యం కూడకట్టుకుంటున్నాడు – ఓరోజు అడగాలని, ఆమె తల్లితండ్రులను గురించి, ఇతర వివరాలను గురించి తెలుసుకోవాలని, ఇంతసున్నితంగా వుండే ఆడపిల్ల హారర్ సినిమాలు తప్పించి చూడదేం అని. ఎంతకోపంగావున్నా 'హిచ్ కాక్ వచ్చాడంటే' సుముఖురాలవుతుందేమని.

ఉన్నట్టుండి ఉరమని పిడుగులా ఆ రోజుసాయంత్రం చెప్పింది వూరికి వెడుతున్నానని. వెళ్ళి తీరాలా! అని ఎన్నో రకాలుగా ప్రశ్నించాడు. ముక్కుమీద లేని మసిని ఎంతో నేర్పుతో తుడిచాడు. అయినా పార్వతి మారదు. అందుకే సరళతో కలిసి శనివారాదివారాలుగడుపుతే....దారిలోకివస్తుందేమో అని వేశాడు ప్లాను. ఏ కళనుందో ఒప్పుకుంది పార్వతి.

ఇలాగే రెండునెల్లక్రితం ఓ శుక్రవారం రాత్రి వానవచ్చేలా వుంటే గుప్‌చిప్‌గా యింట్లో కూర్చున్నాడు కృష్ణమూర్తి. పార్వతి తొలిరోజున యిచ్చిన ఓపుస్తకం చదవాలని ప్రయత్నిస్తున్నాడు. గడియారంలో తొమ్మిది అవుతూంది. వస్తూన్న నిద్రని ఆపుకొంటూ, ఆలోచనల మిణుగురు పురుగులని చెదరకొడుతూ పుస్తకం చదవాలని చూశాడు. ఇంతట్లోనే యెవరో తలుపుతట్టినట్టయింది. పార్వతి. ఇంతరాత్రి

వేళ యెందుకొచ్చిందా అనిపించి, వచ్చిందంతేచాలు అనిపించింది కృష్ణమూర్తికి. లైటువెలుగులో - ఆ విశాలమైన కళ్ళక్రింద నీడలు పరచుకున్నాయి. ముఖంమీది చిరునవ్వు కూడా అమర్చుకున్నట్టేవుంది. 'రా పార్వతీ వచ్చి కూర్చో' అంటూ దారికడ్డులేచాడు. వచ్చి కూర్చునీ కూర్చోనట్టు కుర్చీ చేతి మీద కూర్చుంది....ఏ క్షణాన్నైనా ఎగిరిపోయే పిట్టలాగా. "కూర్చోను చాలాసేపు. ఇక్కడే దగ్గర హాల్లో-'మాన్‌స్టర్సు ఫ్రెమ్ అవుటర్ స్పేస్' ఆడుతూంది. నాకు సాయం వస్తావా ?" ఎంత బుద్ధిగా అడిగింది ! అంతరిక్షపు భయంకర రాక్షసులు అమాంతం మానవ మాత్రులని నమిలి మింగేస్తూంటే ఆనందిస్తూ సంతోషంతో మెరుస్తాయా ఆ మాయకం అయిన కళ్ళు ! అనుకున్నాడు. "అంతకంటేనా !" అంటూ యిట్టే తెమిలి, తలుపుతాళంపెట్టి బయలుదేరాడు కృష్ణమూర్తి. పార్వతిఅలావచ్చి అడగడం ఆశ్చర్యంగానే వుంది కృష్ణమూర్తికి. కాని ఆ అడగడంలో ఏదో అసహజమైనది. బాధతో సహాయం అర్థించడం లాంటిది కన్పించింది కృష్ణమూర్తికి.


ఇద్దరి టిక్కెట్లకీ డబ్బు తనేయిచ్చింది. సినిమా చూస్తున్నంతసేపూ తల యిటూ అటూ కదపనైనా లేదు పార్వతి. కాని ఆ చీకట్లో కళ్ళల్లో వెలుగునింపుకొని ఆమెనే చూస్తున్నాడు కృష్ణమూర్తి. ఏమిటీ పార్వతి అని వెయ్యిసార్లయినా తలబద్దలు కొట్టుకున్నాడు.

సినిమాహాల్లోంచి బయటికి వచ్చేసరికి అర్ధరాత్రి దాటింది. పార్వతి మూడ్ కొంచెం మారినట్టేవుంది. సన్నగా తనలోతానే నవ్వుకుంటూ అంది "నా కిలాంటి సినిమాలంటే సరదా. మనస్సు బాగోలేనప్పుడు, అనుకున్నవి అనుకున్నట్టు జరక్కుండా దారి తప్పినప్పు డిలాంటి సినిమాచూస్తే నాకెంతో తెరిపిన పడ్డట్టు వుంటుంది ! నిజ జీవితంలో వాటిని గురించి కంటె యీ భూతాలనీ పిశాచాలనీ క్రూరమృగాలని గురించి హైరానపడ్డం రిలీఫ్ కదూ ?" అంది.

"మనం స్నేహితులమేనా పార్వతీ ?" నిలదీసి అడిగాడు కృష్ణమూర్తి. నవ్వుతూ "ఏం అంత సందేహం వచ్చింది ?" అంది.

"అయితే దీనికి సమాధానం చెప్పు. నువ్వెందుకు యెప్పుడూ సరదాగా వుండవు? పెళ్ళంటే దడుసుకున్నట్టలా తప్పించుకు తిరుగుతావేం ? చెప్పు పార్వతీ" ఆప్యాయంగా ఆమె చెయి అందిపుచ్చుకున్నాడు.

అతని చేతిలోవున్న తన చేతినే చూసుకుంటోంది పార్వతి. "ఒకసారి పెళ్ళి చేసుకున్నంతదాకా వచ్చాను. నాన్నగారు రెండు సంవత్సరాలాగి పెళ్ళి చేస్తామన్నారు. కాని ఏడాదిలోగానే అంతా అయిపోయింది. అతనంటే భరించలేని స్థితికి వచ్చేశాను. ఈరోజేమైందో తెలుసా ? అతను పెళ్ళి చేసుకున్నాడని వార్త వచ్చింది. అదెందుకు నన్నింత బాధ పెట్టాలి అని నాకు పౌరుషం వచ్చింది ...." వినీవినబడకుండా చెప్తూంది పార్వతి. "క్షమించు యింత గొడవ వుందనుకోలేదు." అంటూ ఆప్యాయంగా తన చేతిలోవున్న ఆమెచేయి నొక్కాడు. ఓ సారతని ముఖంలోకిచూసి తలదించేసుకుంది పార్వతి.



ఆరోజే ప్రారంభం అయింది .... కృష్ణమూర్తిపీడకల. రోజుకిరోజు పార్వతికి సన్నిహితం అయిపోతున్నాడు. పుస్తకాలకొట్టు, సినిమాలు, బీచ్. పార్వతిలేని తన జీవితం మరిచిపోయాడు కృష్ణమూర్తి. ఆ రోజున అంది వూరికి వెళ్ళిపోతున్నానని, ఆరోజే - సరళని కలుసుకుంటే బాగుంటుందని ప్లాను వేశాడు కృష్ణమూర్తి. అందుకే అందరూ కలిసి మహాబలిపురం ప్రయాణం కట్టారు. సరళ ఏలాగైనా పార్వతిని కదిల్చి తనని పెళ్ళి చేసుకునేందుకు ఒప్పిస్తుందని కృష్ణమూర్తి ధైర్యం....

వీధిలో ఇద్దరూ ఎవరిదారినవారు నడుస్తూ 'మరిచిపోను' అంటే 'మరిచిపోను' అనుకున్నారు.

సూర్యోదయం మహాబలిపురంలో చూడాలని నిశ్చయించుకుని దాగా చీకటిగా వుండగానే బయలుదేరారు. తొలి పరిచయాలు కాదు కదలగానే చేశాడు కృష్ణమూర్తి. మొదట్లో కొంచెం ముభావంగావున్నా చాలా కలుపుగోలుగా మాట్లాడ్డం ప్రారంభించింది పార్వతి.

'రాతిరథాలూ రాతిఏనుగూ ఎంతసేపని చూస్తాం ? అలా బీచిలో కూర్చుందాం' అంది సరళ. కాని పార్వతి తీవ్రంగా చూస్తూంది. సరళభర్తకూడ చాలా కుతూహలంగా చూస్తున్నాడు. ఒకళ్ళకొకళ్ళు చెప్పుకుంటూ వాళ్ళిద్దరూ అలా అలా అన్ని శిధిలాలనా చూస్తూ మిగిలినవాళ్ళ వునికి మరిచిపోయారు, మధ్యాహ్నం భోజనం సమయానికంతా వాతావరణంలో స్తబ్ధత ఆవరించింది. సరళ ఒక్కమాట మాట్లాడ్డంలేదు. కృష్ణమూర్తికేం మాట్లాడాలో తెలియటం లేదు. పార్వతీ సరళ భర్తా మటుకు ప్రపంచరాజకీయాలనుంచి. పర్లాకిమిడి పారిశుద్యందాకా చర్చిస్తున్నారు. జోక్సు వేస్తున్నారు. నవ్వుతున్నారు. కృష్ణమూర్తి మధ్యలో పార్వతిని పిలిచినా వినిపించుకోనట్టు వూరుకుంటూంది...."మీయిద్దరే అంతఆనందంగా వుండగల్గితే నేనెందుకు మధ్య ?" అంటూ పెళ్ళి కార్లో కూర్చుని నెత్తిమీద కుండవంపింది సరళ. ఎదురుచూడని యీ పరిణామానికి అదిరిపడి కారుదగ్గిరకి పరుగెత్తాడు సరళభర్త. "ఛీ ఈమాత్రం అర్థం చేసుకోలేదా ? నలుగురం వచ్చినప్పుడు – అతని భార్యకూడ వున్నప్పుడు, కొంచెం యింగితం వుండొద్దు ?" విసుగుగా సిగరెట్టు వెల్గించి నడిచాడు కృష్ణమూర్తి....

కార్లో కూర్చుని భార్యను బ్రతిమాలుతూనే వున్నాడు. కృష్ణమూర్తి వాళ్ళని చూసీ చూడనట్టు నడిచి వెళ్ళిపోయాడు. ఇలాంటి వింత వాతావరణంలో సాయంత్రం వచ్చింది. సాయంత్రపు బంగారు నీరెండ సముద్రంమీద అక్కడ ప్రకృతిమీద కదలని రాతిరథాలమీదపడి గమ్మత్తుగావుంది.... చూస్తుండగానే చీకట్లు ఆవరించుకున్నాయి. జనసంచారం సమసిపోయింది. సముద్రపు హోరు హెచ్చిపోయింది. ఆ కాశంలో నక్షత్రాలు గుంపులు గుంపులుగా వచ్చాయి. దారీ తెన్నూ లేకుండా నడిచాడు కృష్ణ

మూర్తీ. అలా ఎంతసేపు తిరిగాడో! తనేమను కున్నాడు? ఏమైంది? ఇంత సంకుచితమా ఆడదాని మనస్సు! సమాధానం దొరకని ప్రశ్నలుతలెత్తి సముద్ర తరంగాలలాగే విరుచుకు పడిపోతున్నాయి....పార్వతేమైంది? అన్న ఆలోచనరాగానే తాము కూర్చున్న స్థలానికి మరలాడు కృష్ణమూర్తి. అక్కడెవరూ లేరు. గెస్టుహౌస్ వాచ్‌మన్‌ని అడిగాడు - కారు వెళ్ళిపోయిందన్నాడు: మరి పార్వతి?

ఆందోళననిండిపోయింది హృదయంలో. తిరిగి అలాగే....ఫీటీవారగా నడవడం ప్రారంభించాడు....షోర్ టెంపుల్ దగ్గర ఆగి పైకి వచ్చాడు. షోర్‌టెంపుల్ వెనక వైపు సముద్రం. అక్కడవున్న రాళ్ళ మీద విరుచుకుపడుతున్నాయి కెరటాలు. అక్కడే ద్వారబంధంలా నిలబడ్డానికి వుంటుంది....అక్కడ నిలబడితే తుంపరలుమీద పడుతూవుంటాయి. ప్రశాంతంగా అక్కడ నిలబడదామని అటు నడిచాడు కృష్ణమూర్తి. కొంచెందూరం వెళ్ళి చూసే సరికి అక్కడ ఎవరో కూర్చుని వుండడం గుర్తించాడు. పార్వతి! తడిసిన పిల్లి కూనలా దగ్గిరసా ముడుచుకుని కూర్చుంది. అక్కడ అలా పార్వతిని చూస్తూంటే జాలితో నిండిపోయింది కృష్ణమూర్తి హృదయం. పార్వతిమీద వచ్చినకోపం కాస్తా జారిపోయింది. "పార్వతీ! ఇక్కడ కూర్చున్నావు? నీకోసం నేనెంత ఆరాట పడుతున్నానో?" అంటూ పక్కనే వెళ్ళి కూర్చున్నాడు.


పార్వతి ఉన్నట్టుండి ఏడవడం మొదలు పెట్టింది. బుజంమీద చేయివేసి దగ్గిరగా తీసుకున్నాడు. "ఏడవకు పార్వతీ. ఫరవా లేదులే - సరళ. మూర్తి దెబ్బలాట మరిచి హాయిగా వెళ్ళిపోయారు. నువ్వు నేను వుండిపోయాం."

ఏడుపు నెలాగో అరికట్టుకొని, "అది కాదు కృష్ణమూర్తీ. మీ సరళని చూసేదాకా నా తప్పేమిటో నాకుతెలియలేదు. మొదట్లో నేను అంతే చేశాను. ఒక్క ఎదురుమాట లేదు. అంతా ఏకీభవిస్తూ ఎస్ అంటూ గడిపేశాను. ఫలితంగానే అతనికి దూరంగా పోయాను. మాట్లాడుకోడానికేం మిగులుతుంది అలా అయితే! ఇప్పుడు మీసరళ అంతే చేస్తుంది. కొంచెం అసూయకల్గితే యిద్దరూ మళ్ళీ సవ్యంగా వుంటారేమో అని తోచింది. తుమ్మితే వూడిపోయే ముక్కులాగా అంతసాఫీగా వుంటే ఎలా వివాహ జీవితం. విసుగెత్తదూ?....నిన్ను చూస్తే నాకందుకే భయం. మళ్ళీ నిన్నూ విసిగించి దూరం చేసుకుంటా నేమో అని భయం. ఆ భయంతోటే నీతో మాట్లాడలేకపోయే దాన్ని...." గట్టు తెగిన ప్రవాహంలా మాట్లాడేస్తూంది పార్వతి. నవ్వుతూ ఆమెని మరింత దగ్గిరగా తీసుకుంటూ.... 'ఇప్పుడు మాట్లాడుతున్నావు పార్వతీ.' అన్నాడు.

"అవునా?" ఆశ్చర్యంగా అంది పార్వతి.

"అవును. మాట్లాడుతున్నావు" తన గుండెల కదుముకున్నాడామెని. గట్టిగా పెదవులు ముద్దెట్టుకున్నాడు. కెరటాలు విరిగి తుంపరలు మీదపడి గిలిగింతలు పెడుతున్నాయి. పార్వతికూడా ముడుచుకున్న చేతులు జాపి అతణ్ణి చుట్టవేసింది. కొద్ది క్షణాల నిశ్శబ్దంలో సముద్రపు హోరుగాలి జోరు ప్రతిమించాయి. "పార్వతీ నాతో మాట్లాడు, అంటున్నాడుకృష్ణమూర్తి" "నిన్ను ప్రేమించాను కృష్ణమూర్తి." అంది పార్వతి అతని బుజంలో తల దాచుకుంటూ. ఆ చీకట్లోకి చూస్తూ నవ్వుకున్నాడు కృష్ణమూర్తి. మెత్తని ఆమె జుట్టు నిమురుతున్నాడు. "నువ్వు మాట్లాడుతూంటే నాకు ఎంతో బాగుంది!" చేతులు కలిపి చీకట్లో సముద్రం చూస్తూ నిలబడ్డారు. చీకట్లో సముద్రం ఎంతబాగుంది! "ఇంటికి వెళ్ళిపోదాం. ఆఖరు బస్సుకూడా యిక వెళ్ళిపోతుంది" అంటూ బీచ్‌వెంట నడిపించాడు.

"రేపు మొదటిసారిగా నా ప్రేయసిగా నిన్ను సినిమాకి తీసుకు వెడతాను. ఇళ్ళావాకిళ్ళని టిఫిన్ పుచ్చుకొనే మొసలిని గురించి కొత్త సినిమా వచ్చింది! నీకు నచ్చుతుందికదూ?" అన్నాడు కృష్ణమూర్తి



ఆమెనడుంమీద చెయ్యి బిగిస్తూ- "ఓ! చాలా బావుండేలా వుంది కృష్ణమూర్తీ. తప్పకుండా వెడదాము." అంది మునివేళ్ల మీద లేచి అతని చెంపమీద చిన్న ముద్దు పెడుతూ. గాలికి రేగి అడ్డుపడుతున్న ఆమె జుట్టు చేత్తో పట్టుకొని గట్టిగా కౌగలించి ముద్దు పెట్టుకున్నాడు కృష్ణమూర్తి.

మర్నాడు సినిమాలో వెనకసీట్లో కూర్చుని చేతులు పట్టుకొని ఒకళ్ళ కళ్ళలోకి ఒకళ్ళు చూస్తున్నారే తప్పించి - న్యూయార్క్‌ని సునాయాసంగా భోజనం చేస్తున్న మొసలిని వారు పట్టించుకోలేదు. అందుకే ప్రేమ గుడ్డిదన్నారు కాబోలు!!

□□□

● తండ్రి కొడుక్కి తన ఫొటో ఆల్బమ్ చూపిస్తూ ఒకచోట "ఇది మీ అమ్మా, నేనూ పెళ్ళిరోజున తీయించుకున్న ఫొటో" అని చెప్పాడు.

"అంటే, అమ్మ మనింటో నౌకరీకి కుదిరిన రోజన్నమాట అంతేనా?" అని అడిగాడు కొడుకు,

---

● కాఫీ ఒక గుక్క మింగి ఒక ఆసామీ సర్వర్‌ని పిలిచి కోపంగా అడిగాడు.

"ఈ ఆవదపు కాఫీ ఎలా తాగమంటావోయ్? పిలు, మీ మేనేజర్ని"

"లాభంలేదండి. ఆయనసలు తాగలేరు" అన్నాడు సర్వర్.

సులభ గణితం




ఈ క్రిందనున్న అక్షరాలు ఒక కూడిక లెక్కలోని అంకెలకు సంకేతాలు. మొత్తాన్ని అడుగున కలిపివేశాం. ఒక్కొక్క అక్షరపు విలువ ఎంతో, ఎంతతొందరలో మీరు పోల్చుకోగలరు ?

	అ	ఆ	ఇ	ఈ	ఉ
	అ	ఆ	ఇ	ఈ	ఉ
	అ	ఆ	ఇ	ఈ	ఉ
2	2	2	4	7	7

పై లెక్కకు జవాబు :

మూడు వరుసలలో ఉన్న అక్షరాలు ఒకే క్రమంలో ఉన్నాయి కనుక మొత్తాన్ని మూడుచే భాగిస్తే అ 7 ఆ 4 ఇ 1 ఈ 5 ఉ 9 అని తెలిసిపోతుంది.

అ	ఆ	ఇ	ఈ	ఉ
7	4	1	5	9



నా నాటకానుభవాలు

తురగా కృష్ణమోహన్ రావు

నేను మొదటిసారి నాటకంలో వేషం వేసినప్పుడు. నాకు ప్రథమ పౌరుడి పోర్షన్ ఇచ్చాడు దర్శకమహాశయుడు. హేమ్లెట్ నాటకంలో హేమ్లెట్ వేషమే ఇస్తే ఎంత సంతోషించాలో, అమెరికాను గురించిన నాటకంలో కెనెడీపాత్ర. 1857 కి సంబంధించిన దానిలో ఝాన్సీ లక్ష్మీబాయి పాత్ర దొరికితే ఎంతసంతోషించాలో-అంత సంతోషించాను నేను. ప్రథమ పౌరుడంటే అంతేగామరి ? కాని - తీరా స్క్రిప్టు చేతికి వచ్చేసరికి, అసలువిషయం బయటపడింది. ఒక ప్రజలగుంపులో నాయకుడి పోర్షన్ నాది. ఏడిసినట్టేఉంది అనుకున్నాను నాలో నేను. కించిత్తు కోపంకూడా వచ్చింది. కాని ఈలోగా మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల ప్రకరణలు గుర్తుకొచ్చాయి. పౌరులందరికీ ప్రాథమిక హక్కులంటే, ప్రథమ పౌరుడికి 'ప్ర-ప్రాథమిక' హక్కులుంటాయ్. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఛాతీవిరిచి. నాకు రచయితగారు కేటాయించిన 3. 5 వాక్యాలు కంఠతా పట్టడం ప్రారంభించాను. '3. 5 వాక్యాలు' అని ఎందుకన్నానంటే - అందులో మూడు వాక్యాలు సంస్కృత సమాసాలతో నిండిన పెద్ద పెద్ద వాక్యాలు. ఒకటి - అరవాక్యంలో జమ కట్టతగిన తెలుగు వాక్యం. అలతి యలతి పదాలతోకూడి. ఏ తిక్కన మహాశయుడో రాసినట్టుగా ఉంది. మనది నన్నయగారిపార్టీ.

సంస్కృత వాక్యాలను కంఠత పట్టడానికి యత్నిస్తూ సతమతమౌతున్న నాకు తెలుగువాక్యం అసలు రానేలేదు. ఇంకా రాజుగారి పోర్షన్ తీసుకున్నాను కాదు. రాజువేషం తీసుకుంటే మరీ కష్టమైపోయేది. అసలే రాజు మంచిరాజుకాదు. సిసలైన, ఇరవైనాలుగు కేరట్ల బంగారురాజూకాదు : ఉత్తి నకిలీరాజు. ఆరోజు ఆరాజుకి 'మంచి రోజుకాదు : మేం అంతా విప్లవం చేస్తున్నాం. అసలే నోటమాటరాని రాజేమో-ఈ గంద్రగోళంలో పోర్షన్ మరిచిపోయి, మరీ నోరు లేని రాజయ్యాడు.

నేను విప్లవ వీరుల్లో ప్రథముణ్ణి. ప్రథముడే కురూపియైతే, ద్వితీయుడిదీ. తృతీయుడిదీ మొహాలు ఎవరు చూస్తారు? వాళ్ళగతేంకాను? కనుక, నా మొహం అందంగా తయారు కావాలని మేకప్ వాడితో ముందే చెప్పాను. తెలుపుపాలు కొంచెం ఎక్కువ పడాలన్నాను. బొద్దు మీసాలే పెట్టమన్నాను కాని, ఫేషన్



కోసం ఫ్రెంచికట్ కూడా అక్కడక్కడ తగిలించమన్నాను. 'అక్కడక్కడఅంటే?' అన్నాడు మేకప్‌మనిషి. 'నీ మొహం: ఆమాత్రం తెలియలే?' అని దబాయించాను ఏమనాలో తెలియక! 'స్టేజి మీదకువెళ్ళేది నీ మొహం, నాదికాదు' అని వాడు సమాధానం చెప్పాడు. ఆ పక్కన గోడకి అన్చి ఉన్న అట్టకత్తితో చంపేసేవాణ్ణేకాని, ఒకటి, కత్తి విరిగి పోతుందనీ: రెండు, ఒక పక్కన బొద్దుమీసం, రెండోపక్క ఫ్రెంచి కట్‌తో రంగస్థలం మీదకు పంపుతాడేమో అన్నభయంకొద్దీ! మూడు- పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం వేయనేలఅని ప్రశ్నించుకొని, మానేశాను. ఈ గంద్రగోళంలో నా పోర్షన్ మరచిపోయాను. మరచిపోవటమేకాక - మరచిపోయానన్న సంగతి గమనించడం కూడా మరచిపోయాను. నేను సేజిమీదికి వెళ్ళవలసిన ఆఖరి సీనువరకూ, అద్దంలో నా మొహం చూసుకొంటూ, లవ్ చేసుకొంటూ, కూచున్నాను.

మాకు ఒక ఫిజిక్సు లెక్చరరుగారు సాంకేతిక సలహాదారుగా ఉండేవాడు. తర్వాత తర్వాత ఆయనకి పిచ్చెక్కింది. పిచ్చి మా నాటకానికిముందే ఎక్కిందంటాడు మా దర్శకుడు. ఈ మాటంటే మా ప్రాంప్టర్‌కి కుదరదు. 'ఆయనకి పిచ్చేమిటండీ? నిజంగా నాటకం పాడు చేయాలనే చేశాడు. తర్వాత, నల్గురి నోళ్లకి భయపడి, ఇంజక్షన్లూ గట్రా తీసుకొని, నిజంగా పిచ్చెక్కించుకున్నాడు.' అంటాడు ప్రాంప్టరు.

అసలు జరిగింది ఇదీ: నాటకం బాగుండాలీ అనుకుంటే, నేపథ్యసంగీతం ఉండి తీరాల్సిందే అన్నాడు మా సంగీత శాసన కర్త మ్యూజిక్ డైరెక్టర్. కనీసం రెండో మూడో నేపథ్యగేయాలుండి తీరాలన్నాడు. ఫలానా [నొక్కు నొక్కు అజుట్టు] అమ్మాయ్ పాడాలి అన్నాడు. 'అది మగ వేషం. మగవాడికి, ప్లేబాక్‌గా ఆడమ్మాయి పాడ్డమేమిటి?' అని మా రచయిత నిరసన తెలిపాడు. మ్యూజిక్ డైరెక్టర్ ససేమిరా ఒప్పుకోనన్నాడు.

చివరకి, రాజుగారి పాటనే కొద్దిమార్పుల్తో, రాణీగారిచేత పాడించాలని నిశ్చయించుకున్నాం: 'నాటకంలో రాణీపాత్ర లేదుగా?' అన్నాడు రచయిత మళ్ళీ. 'ప్రతీదానికీ ఇలా కాళ్ళకడ్డంవస్తే నేను ఈ నాటకాన్ని డైరక్టు చెయ్యను. రాణీపాత్ర లేకపోతే, సృష్టించిఏడు!' అన్నాడు డైరక్టర్. రచయిత ఏం చేయలేక, ఏడు



స్తూనే సృష్టించాడు ఒక రాణీపాత్రని. ఆ పాత్రకి మొదట్నించీ ఏడుపే. రకరకాల ఏడుపు. రాజుగారు దర్బారుకి వెడుతూంటే పిల్లిఎదురైందని - బారుమని ఏడ్చేస్తూ ఒక పాట పాడేస్తుంది. ముఖ్యంగా ఆపాటవిని, 'భేష్' అన్నాడు మ్యూజిక్ డైరక్టర్— అంటూనే, తను పుట్టగానే ఏడ్చినప్పుడు ఉపయోగించిన రాగంనుంచి, అన్ని రాగాలు పెట్టేసి, మ్యూజిక్ కూర్చాడు. రాణీ పాత్ర ధారిణికి ప్లేబాక్ వేసిన అమ్మాయి, చిలవలుగా పలవలుగా బారుబారుమని పాడుతూంటే - అందరిమొహాలు చేంటంత అయ్యాయి.

'అంతా బాగానే ఉందికాని, ఇప్పుడు రాణీ పాత్రధారిణిని ఎక్కణ్నించి తెమ్మంటారు?' అని విసుక్కున్నాడు డైరక్టరు. 'పోనీ-రాజే రాణీవేషం వేస్తేనో?' అన్నాను నేను-సహాయపడాలనే ఉద్దేశ్యంతో. 'మరి-రాజువేషం ఎవరు వేస్తారు?' అన్నాడతను. 'నేను వెయ్యనా?' అన్నాను. నాలో రాజలక్షణాలున్నాయని అప్పుడప్పుడు మా ఆవిడ, మా ఇంట్లో పనిచేసే నర్సయ్య, పక్కింటి పెదవావిడ, యాయవార బ్రాహ్మడూ, అంటూంటే విన్నాను. అందుకే ఈ చిన్నసూచన చేశాను. 'నువ్వా? రాజువేషమా? ఇంకానయం' అని నవ్వాడు డైరక్టర్. డైరక్టర్ ఒద్దన్నాడని నాకు కోపం రాలేదుకాని, నవ్వినందుకు వచ్చింది. మొహం సాధ్యమైనంత బాగా ముడుచుకు కూచున్నాను. 'రాజో? రాణో? రెండిట్లో ఏదో చెప్పండి. రెండూవెయ్యను' అన్నాడు రాజు. చివరకి, రాజువేషం అసలు తీసేసి, రాణీవేషమే అతనిచేత వేయించాలని నిశ్చయించారు. భీముణ్ణి హిడింబాసురుణ్ణీ కలిపి, రెండెట్టి భాగించి, సగటుకడితే ఎంతుండాలో అంతే ఉంటాడని కాని, సుకుమారతలో మా వాణ్ణి చెప్పి మరొకర్ని చెప్పాలి. శరీర వర్ణం యమధర్మరాజుదీ, అతని వాహనానిదీ రెండిటికీ సగటుకడితే సరితూగేటటువంటిది.

'అదిసరే! అసలుపాయింటే మీరు మరచిపోతున్నారు. మరి పిల్లి మాటేమిటి?' అన్నాను నేను. 'ఏ పిల్లి? చిక్కడపిల్లా, కోటిపిల్లా, కొంకాపిల్లా' అన్నాడు డైరక్టర్. 'ఎదురొచ్చేపిల్లి' అన్నాను నేను. 'ఎక్కడో అక్కడ్నించీ తెద్దాంలే ఆ రాత్రికి' అన్నాడు డైరక్టర్. 'బరుకుతుంది, రెండుచేతులూ బరుకుతుంది.' అన్నాను నేను. 'సరే పిల్లి వేషం నువ్వే వేద్దుగాని, స్టేజి మీదకు రానక్కర్లేదు' అన్నాడు డైరక్టర్.

నేను తర్వాతిపదిహేనురోజులూ 'మ్యావ్, మ్యావ్' అంటూ రిహార్స్ చేస్తూ గడిపాను.

ఇంతకీ చెప్పేదేమిటంటే - నాటకం రోజున, తెరవెనుక రాణీగారి పాటకి. ఒక మైక్ ప్రత్యేకంగా కావాలని పేచీపెట్టాడు మ్యూజిక్ డైరక్టరు. 'లేకపోతే- నాటకం

నాశనమై పోతుంది' అన్నాడు. 'స్టేజిమీద కావాలో, తెరవెనుక కావాలో తేల్చుకోండి. రెండిటికీ పవర్ చాలదు' అన్నాడు సాంకేతిక సలహాదారు. 'స్టేజి మీద మైకు లేక పోతే - నేను వేషం కట్టను అన్నాడు రాణీ. 'నువ్వు పెదవులు కదపవలసినదే కదా? నీకు మైకు లేకపోతే ఏం?, అన్నాడు మ్యూజిక్ డైరక్టర్. అసలు నాటకమే పడదేమో అని భయం వేసింది. కాని, చివరకి ఇద్దరూ రాజీకి వచ్చారు. రెండు మైకులు ఏర్పాటు చేశాం. ఒకటి స్టేజిమీద ఉంటుంది. మరొకటి పద్మినీ జాతి స్త్రీలా తెరవెనకుంటుంది. పాటల సమయంలో లోపలిదీ, మాటలసమయంలో బయటదీ.పనిచేయాలని నిశ్చయించుకున్నాం. 'పాటలూ, మాటలూ రెండూ ఒకేసారి వస్తే?' అన్నాను నేను - అమాయకంగా 'ఫిఫ్టీ - ఫిఫ్టీ' అన్నాడు డైరక్టరు - నా వైపు కన్నెఱ్ఱ చేసి చూస్తూ. 'ఒక రూపాయ్ ఎగరేద్దాం! బొమ్మ వస్తే స్టేజీ మీద ! బొరుసైతే తెర' అన్నాడు రాణీ. 'మారని రూపాయి ఎగరెయ్యండి మళ్ళీ దొరక్కపోతే కష్టం' అన్నాను నేను. 'మారని రూపాయి' అని రాసుకున్నాడు స్టేజ్ మేనేజర్ తనలిస్టులో.

చివరిసీను అద్భుతంగా పడచింది. రాజు పాత్రరాణీపాత్రగా మారిపోవడంలో పోర్షన్ మరచిపోయి, కంగారుపడి, ఏడవలేక నవ్వుతూన్న రాణిని చూసి నవ్వేరు జనం. నవ్వాల్సినచోట నవ్వురాక ఏడుపు మొహం పెట్టిన రాణీనిచూసి ఏడ్చారుజనం. కడుపు తరుక్కుపోయినట్టు! ముఖ్యంగా రచయిత కడుపు తరుక్కుపోయినట్టు రాణీ పాడినప్పుడు, రాణీతో జనం అంతా పాడేరు. ఈ గొడవలో నా మ్యావ్ మ్యావ్ సంగతే మరచిపోయాను గాని - ఎదురు రావడానికి రాజుగారు లేరు కాబట్టి, రాజుగారికి ఎదురు రావడానికి పిల్లి అవసరం లేక పోయింది. కాని, మ్యావ్, మ్యావ్ అనడంతోబాటు మిగిలిన పోర్షన్ కూడా మరచి పోయాను.

చివరి సీనులోనే! రాజుగారిమీద-కాదు, రాణీగారిమీద విప్లవం చేస్తున్నాం. నేను విప్లవనాయకుణ్ణి. నాదే పోర్షన్. 'తినడానికి తిండీ, కట్టడానికి బట్టాలేవు, మహారాణీ !' అనాలి. ఈ మాటల్ని ఒక విషయాన్ని ఎదుటివాడికి చెప్పినట్టుగా చెప్పవచ్చు. 'ఈ సాయంత్రానికి ఇంట్లో కాఫీపొడిలేదు. మీరొచ్చి తెస్తేనే ఎవరికైనా ఇంట్లోకాఫీ. ఇరుగూ పొరుగూనుంచి అరువుతేడం ఇక నాతరంకాదు బాబూ' అని భర్తతో భార్య చెప్పినట్టు! లేదాకరుణకలిగేటట్టు చెప్పవచ్చు 'కండ్లు కాళ్ళూలేని కబోదినమ్మా : ఇంత వణ్ణం పడేయించుతల్లీ! నాలుగురోజుల్నించి తిండిలేదు.' అని అడిగే బిచ్చగాడిలా! 'చాకలీ, నువ్వు శుక్రవారంనాడు బట్టల్ తేపోతే, ఆఫీసుకి వెళ్లడం మానేసి, ఇంట్లో ముసుగేసుకు పడుకోవాలి' అన్నట్టుగా చెప్పావచ్చు.'ఆజ్ మాఫ్ కరో భాయ్, షెన్వార్ కో ఆజావ్' అని దుకాణదారు, పోగేసే ఫకీరుతో చెప్పినట్టు చెప్పవచ్చు. అనేక ధోరణులలో చెప్పవచ్చు అదేవాక్యాన్ని.

ఇన్నివిధాలుగా చెప్పచ్చు అని చెప్పాను దర్శకుడుగారికి, 'ఏవిధంగా చెప్పినా ఫరవా లేదు. అవి విప్లవనాయకుడి వాక్యాలు. పలికే టప్పుడు, కళ్ళల్లో కోపం కనబడాలి; కాని, ఆకలి-ఆకలివల్ల కలిగిన ద్వేషం - కూడా ఉండాలి. గట్టిగా అరవాలి, కాని కంఠంలో నీరసంకూడా ఉండాలి. మిమ్మల్ని చూస్తే జాలితోపాటు భయంకూడా కలగాలి.

అన్నాడు ఆయన, 'ఒకసారి అని చూపిస్తారా?' అన్నాను. 'ఇవ్వన్నీ చెప్పడానికి మనకి తీరికలేదు, బ్రదర్! పొద్దున్నించి తిండిలేదు,' అన్నాడు ఆదోలా - గట్టిగా, కోపంగా, నీరసంగా, నావైపు కొరకొరతినేసేటట్టు చూస్తూ. 'ఓహో అలాగా చెప్పడం?' అనుకున్నాను.

'తినడానికి తిండీ, కట్టడానికి బట్టాలేవు, మహారాణీ!' అనాలి నేను మొదట. తర్వాత వన్నీ పెద్దపెద్ద సంస్కృత సమాసాలతో నిండిన వాక్యాలు. నేను స్టేజిమీదకు వెళ్ళే వరకూ, కాళ్ళు వణకడం ప్రారంభం కాలేదు. నేను నా పోర్షన్ చెప్పేసమయం వచ్చేస్తూంది. ఫైవ్, ఫోర్, త్రీ, టూ, వన్....స్టార్ట్! 'తినడానికి బట్టా, కట్టడానికి తిండీలేవు, మహారాజా!' అన్నాను. ఈ వాక్యం ప్రేక్షకులకు వినబడకుంటే, ఎంత బాగుండేది! కాని మా సాంకేతిక సహాయుడి దయవల్ల, ప్రేక్షకులచివర, చెప్పులు చేత్తోపట్టుకు నిలబడ్డ రాలుగాయి కుర్రాళ్ళ వరకూ స్పష్టంగా వినబడింది నావాక్యం. నేను సరిదిద్దుకోబోయి, 'తినడానికి కట్టా, బట్టడానికి తిండీలేవు, మహారాజా' అన్నాను. మళ్ళీ దిద్దుకోబోయి, 'తిండికి బట్టాలేదు; తిండికి తిట్టూలేదు' అన్నాను. ప్రేక్షకలోకం అంతావింది ఈమాటలు. ఘొల్లున నవ్వింది.

మా నాటకంలోసేనాధిపతివేషధారిముక్కు కొంచెం పొడుగు. దానికి సూటిగా పోయే మనిషి అతను, దాని చివర్నే కోపం కూడా కాపరం ఉండేది. మమ్మల్ని వధించడానికి (అట్టకత్ర) కత్తి పుచ్చుకు రంగం మీదకు ఎలాగూ ప్రవేశించాలి కొన్ని నిముషాల తర్వాత. నా మీద కోపంతో ఒళ్ళు మరచి పోయి ముందే ప్రవేశించాడు. కంగారులో అట్టకత్రకత్తిఎత్తి, పైనదూలాన్ని కొట్టాడు. ఇది చూస్తూన్న ప్రాంప్టరు 'దూలం, దూలం' అన్నాడు. లోకం వింది ఈ మాటలు తెరలోపలి మైకుద్వారా. 'దూలం సరే, నీ మొహం. కత్తి జాగత్త!' అంది. లోకం మాటలు వినడానికి సేనాపతికి గాని, అతని కత్తికిగాని ఆసమయంలో చెవులు లేకపోవడంచేత - అట్టకత్తిలో కొంత ఒరిగి, విరిగి, కిందపడింది.

తెర పరుగెత్తుకొచ్చి పడింది.

ఇది మొదటిసారి నేను నాటకంలో వేషం వేసినప్పటి సంగతి. □□□






పాటల టంకసాల శ్రీ ఘంటసాల

రచన: పి. బి. శ్రీనివాస్

క్రౌంచు గంటలా ఖంగుమని మ్రోగే కంఠంగల ఘంటసాల, ఆంధ్రుల అభిమాన గాయక సంగీత దర్శకులని ఘంటాపథంగా చెప్పవచ్చు. మూడు దశాబ్దాలుగా వీరు నాటిన కీర్తి ధ్వజం గగన చుంబనంచేస్తూ, అజేయమై విజయగర్వంతో యెత్తిన తల దించకుండా ఎగురుతోంది. వీరిని చిత్ర చతుర్ముఖులనవచ్చు. గాయక, సంగీత దర్శక, నిర్మాణక, నటకులుగా విలసిల్లుతున్న ఈ సినిమా బ్రహ్మ నాలుగు ముఖాలలోనూ, నటనా ముఖం వెనుకవైపుంది. చిన్నతనంలో డ్రామాల్లో నటించిన అనుభవం వున్నప్పటికీ, రానురాను నటనపై శ్రద్ధవహించక, సంగీతానికే సంపూర్ణంగా ప్రాముఖ్యమిస్తూ, రసిక మానస సామ్రాజ్యాభిషిక్తులై, గాయక చక్రవర్తులై విరాజిల్లుతున్నారు. గురుడు పదకొండోయింట పదిలంగా స్థిరనివాసం యేర్పరచుకున్నాడు.

కృష్ణాజిల్లాలోని గుడివాడ తాలూకాకు చెందిన చౌటపల్లి గ్రామం వీరి స్వగ్రామం. 1922, డిసెంబర్ నాలుగో తేదీన శ్రీ ఘంటసాల సూర్యనారాయణగారిసుతులై అవతరించారు, వీరి తండ్రిగారు తరంగాలూ అష్టపదులూ చక్కగాపాడేవారు. మృదంగం వాయించడంలో మంచి చెయ్యి. తనకొడుకు చేత ఐదవ ఏటనే, నగర సంకీర్తనలో పాడిస్తూ వుండేవారు. నృత్యం చేయిస్తుండేవారు.

ఘంటసాలకు సంగీతంలో సాపాసాలూ అలంకారాలూ నేర్పిన ప్రథమ గురువు తండ్రిగారే. ఇది అరుదైన అదృష్టం. ఎనిమిదేళ్ళప్రాయంలోనే నాటకాల్లో చిన్నికృష్ణుడివేషాలూ, ఆడపిల్లల వేషాలూ వేస్తూండేవారు. చదువుకునే రోజుల్లో, అన్నింటిలోనూ మంచి మార్కులే సంపాదించేవారే కాని ఎక్కాలతోటే పెద్ద చిక్కు వచ్చేది. టీచరు ఎక్కం వప్పజెప్పమన్నప్పుడు గొప్ప తిప్పలుపడేవారు. ఒక ఒక ఒకటీ, ఒక రెండు రెండూ.... అని రాగాలతో సాగదీస్తూ వెనక విద్యార్థి ప్రాంప్టింగ్ అందించేదాకా ఆగి మరీ రెండోది అందుకునేవారు. బంగారంలాంటి గొంతేమో - ఎక్కం పాడినా ఏమిపాడినా హాయిగా వుండేది. పద్యాలు ముద్దుగా, భావయుక్తంగా పాడేవారు. కనుకనే, మేష్టర్లు స్కూల్ ఇన్‌స్పెక్టరు తనిఖీకి



“అసలు పేరు గానలోల
మారుపేరు ఘంటసాల”
వ్యాసకర్తతో సంగీతకర్త

వచ్చినప్పుడు ఆయన్ని మెప్పించడంకోసం ఘంటసాల చేత ముమ్మందుగా పద్యాలు పాడించేవారు. లెక్కలపరీక్షలో మాత్రమే మరొకర్ని కాపీకొట్టేవారు కాని, మిగతా వాటిలో ఇతరులే కాపీకొట్టేవారు వీరిని.

మొత్తంమీద, ఒక్క ఏడాది తప్పకుండా థర్డుఫారందాకా గెంటుకొచ్చారు. వీరి పదకొండవ ఏటనే వీరి జనకులు స్వర్గస్థులయ్యారు. తదనంతరం చదువుకి మంగళం పాడి తన మేనమామ అయిన శ్రీ ర్యాలి పిచ్చిరామయ్యశాస్త్రిగారింట పెరిగారు. ఒకటి రెండేళ్ళ వరకూ, గుళ్ళోనూ గృహంలోనూ కాలక్షేపం చెబుతూ కాలక్షేపం చేసేవారు; ఆ సమయంలోనే వీరికి కొంతమంది శిష్యులుకూడా పోగయ్యారు.

1936లో పెదకళ్ళేపల్లి వెళ్ళి, నేటి సంగీత దర్శకులు శ్రీ సుసర్ల దక్షిణామూర్తిగారి మాతామహులైన శ్రీ దత్తాత్రేయ శాస్త్రిగారివద్ద మళ్ళీ సరళులు ప్రారంభించారు. కాని, అక్కడ గురుకులవాసం జరిగిందే తప్ప సంగీతం అంతగా అబ్బలేదు. అక్కడకూడా తరుచు నాటకాల్లో పాల్గొనేవారు. మరుసటి సంవత్సరం, సంగీతం కోసం “కూడవల్లి” వెళ్ళారు. కాని, పాటల్లో కన్నా పాక కళలో ప్రావీణ్యం సంపాయించగలిగారు. అంచేతే వీరి సంగీతం

మంచి పాకాన బడుతూవుంటుంది. స్వరాలు తేనెల రసాలూరుతూ వుంటాయి.

ఇలా నలభీముల్ని మరిపించేలా, పాక శాస్త్ర ప్రవీణుడైన పి ద వ. వీరికొకనాడు తన తండ్రిగారి అంత్యోపదేశం జ్ఞప్తికి వచ్చింది. సంగీతం నేర్చుకోడానికి సరియైన స్థలం విజయనగరం అన్న విషయం. వెంటనే వేలి ఉంగరం తాకట్టుపెట్టి, విజయనగరం చేరుకున్నారు.-జేబులో మిగిలిన ఒకే ఒక రూకతో. శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారివద్ద వయొలిన్ అభ్యసించాలనే అభిలాష ప్రకటించారు. కాని, వారు వీరి గాత్ర మాధుర్యం చవిచూచిన వెనక "అబ్బాయీ, నీ గొంతు అమూల్యమైంది. గాత్ర సంగీత సాధన చెయ్యి" అని సలహా యిచ్చారు. ఈ సలహాకి మన మందరం ఎంతైనా ఋణపడివున్నాం. కారణం, ద్వారం వారిలా సెలవియ్యకుండా వుండివుంటే శ్రీ ఘంటసాలవారి కంఠం కన్నా అధికంగా, మనం వారి ఫిడేలు వాయిద్యం వినడానికి మాత్రమే నోచుకుని వుండేవాళ్ళమేమో!

ద్వారంవారి ధర్మమా అని వీరు గాత్రపు తరగతిలో చేరి, ఆరేళ్ళ విద్యని నాలుగేళ్ళలోనే శ్రద్ధతో నేర్చుకుని, విద్వాన్ కోర్సు పూర్తిచేశారు. కాని మొదటి రెండేళ్ళూ మధుకరమెత్తి చదవవలసి వచ్చింది. తదనంతరం వీరి ప్రోగ్రెస్ కి సంతోషించి శ్రీ ద్వారం వారికి మహారాజావారి సత్రంలో భోజన వసతి వగైరా ఏర్పాట్లన్నీ చేశారు. ద్వారంవారి కళాశాలలో సీతారామశాస్త్రిగారు (నేడు ఘంటసాలకు సహాయకులైనసంగీతరావుగారి తండ్రిగారు)వోకల్ ప్రొఫెసరుగా వుండేవారు. వారివద్దనే శుశ్రూషచేసి విద్య సంగ్రహించారు. మారుతీ భక్త మండలి వారు వీరికి విజయనగరంనుండి వీడ్కోలిచ్చే సందర్భంలో ఘనమైన సన్మానం ఏర్పాటుచేసి, అభినవ కాళిదాసన్న ఖ్యాతి గొన్న శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారిచేత ఒక మీరజ్ తంబూరా బహూకరించారు. ఈ అపరసంగీత సాహిత్య సరస్వతి ఆశీర్వాదాలందుకుని వీరు తిరిగి చౌటపల్లి చేరారు. నాలుగు నెలలపాటు సాపాటుకి కూడా సంకటపడ్డారు. నెలకి మూడు రూకల జీతం చొప్పున ఆరుగురమ్మాయిలకి సంగీత శిక్షణ నిచ్చేవారు. కాని, ఆ శిష్యురాండ్ర పెద్దవాండ్రు వీరు ఆకొద్ది కాలంలో తమ పిల్లల పెళ్ళికి పనికివచ్చేటంతగానూ సంగీతం చెప్పలేదని భావించి బాధపడేవారట.

1942లో క్విట్ ఇండియా ఉద్యమం ముమ్మరంగా సాగుతున్న సమయాన బాపూజీ పిలుపువిని, కాంగ్రెసులోచేరి, బహిరంగసభల్లో ఉద్రేకంతో ఉద్వేగంతో ప్రజల నుత్తేజపరచి, ఉత్సాహపరచే విధాన ఎలుగెత్తిపాడి, పరప్రభుత్వపు టాగ్రహాని కెరయై చెఱసాలలో ఘంటసాల బందీకృతులయ్యారు. ఈ కారాగృహవాసంలోనే వీరికి శ్రీ మోపర్రుదాసుగారి మైత్రి లభించింది. వారివద్ద వీరు హరికథ నేర్చుకున్నారు. జైలు జీవితంలో అబ్బిన హరికథ బాణీ వీరు ప్రప్రథమంగా ప్రయివేటు రికార్డిచ్చిన "పాంథశ్రీ" పద్యాల్లో బాగా గోచరిస్తుంది- ఈ పద్ధతి వీరు ప్రవేశపెట్టారనే చెప్పవచ్చు. అంతకుముందు ప్రతి పద్యం, డ్రామాలపద్ధతిలోనే, తారస్థాయిలో





'ఓరీ దుందుభి' 'రుధిరోద్గారి' 'రక్తాక్షి' అనే పక్కిలో నడిచేది. ఈ పాతపద్ధతిని కరిగించి కొత్తమూసలోపోసి, పద్యాలకు వరసలల్లే విధంలో అభినందించతగ్గమార్పు తీసుకొచ్చారు. "అంజనరేఖ వాల్గనుల" అని మొదలయే ఈ 'కరుణశ్రీ' ఆరుపద్యాలూ, అందర్నీ ఆకర్షించాయి.

ఈ పద్యాలు నేనుకూడా పాటకచ్చేరీల్లో దంచేస్తూవుండేవాణ్ణి. శ్రీ ఘంటసాలని నేను తొలిసారిగా కలిసినప్పుడు నన్ను పరిచయం చేసిన శ్రీ వీణరంగారావుగారు వీరితో, నేను వారి పద్యాలు పాడి వినిపిస్తానని చెప్పగానే ఆయన గుండె గుభేలుమన్నదట తరువాత చెప్పారు.

అంతకుముందే పలు తారాపథాభిలాషులు వీరివద్ద వీరిపాటలే వీరి గొంతునే అనుకరిస్తూ పాడి వినిపించినప్పుడల్లా వీరనుకునేవారట. "ఇంత భయంకరంగా పాడుతున్నానా ఏమిటి చెప్మా" అని. గాభరా పడుతూ. ఆ కారణంగా, నేనుకూడా వీరి పద్యాలే వినిపించబోతున్నానని వినేసరికి, ఇది మరో వికట సంకటమనే తలపోసి అయిష్టంగానే వినసాగారట. నేను పాడిన పిదప వీరికి పట్టుకున్న బాధ వదిలి, హమ్మయ్య, నేను బాగా పాడుతున్నానన్నమాట" అని తనలో తానే ధీమాగా తమాయించుకున్నారుట. ఈ సంగతి మొన్న మీరు నాతో చెపుతున్నప్పుడు, నన్ను నేనే నమ్మలేకపోయా. నేను అంత బాగా పాడానని ఇంతటి ఆయన అంత అలా చెప్పేసరికి, నాఆనందానికి అవధే లేదంటే నమ్మండి. ఇలా చెప్పటానికి కూడా విశాల హృదయం కావాలి.

జైలువదిలి వీరు 1942 లో చౌటపల్లి మరలివచ్చారు. అక్కడెప్పుడూ భుక్తికి లోటే. ఓ ఏడాదిపాటు పాటుబడి మోపిదేవి అనే గ్రామంలో నాటకం కంపెనీ నడిపారు తన అధ్వర్యంలో. కాని అది చాలా నష్టాలపాలైంది. భోజన సదుపాయానికే కష్టపడుతున్న సమయాన, యింట్లో పెద్దలంతా వీరిని, వివాహం చేసుకోమని, విధవిధాలుగా వేధించి నిర్బంధింప దొడగారు. ఈ పెద్దల పోరు పడలేక, పిల్లని చూట్టానికని, పెద్దపులిపర్రు గ్రామం వెళ్ళినప్పుడే శ్రీ సముద్రాల రాఘవాచార్యులుగారు వీరి ఘంటాకంఠం విని అబ్బురపడి, తనతో మద్రాసు వస్తే సినిమాల్లో సదవకాశాలులభిస్తాయనీ, మంచి భవిష్యత్తు వుంటుందనీ చెప్పగానే, తను నడుపుతున్న నాటకం కంపెనీ మూసేసి, 20 రూకలతో చెన్నపట్నంచేరి, "నాయనా, నెత్తిమీద తేలుతుందోయ్ అంటే, నీచేత్తోనే తీసెయ్యవోయ్" అన్నట్లు సలహా నొసగిన సముద్రాల గృహంలోనే మూడు నెలలు పాటు సాపాటుతో సహా సకల సదుపాయాలూ, సౌకర్యాలూ సంతృప్తిగా అనుభవిస్తూ మకాం వేశారు. శ్రీ సముద్రాల వీరిని సదా తనతో తిప్పుకుంటూ, తన పలుకుబడినంతా వినియోగించి. సినీమా పరిశ్రమలోని పలువురు ప్రముఖులకి పరిచయం చేసి, కచ్చేరీలూ అవీ ఏర్పాటుచేసి, వీరి గాత్ర గాంభీర్యాన్ని అందరికీ చాటారు. సముద్రాల సహాయంవల్లనే రేడియోలో కూడా ప్రవేశం పొంది, పాడసాగారు వీరు. అక్కడ శ్రీ రజనీకాంతరావుగారు, వీరి పురోగతికెంతో తోడ్పడ్డారు. శ్రీ సముద్రాలే

వీరిని హెచ్. ఎమ్. వి. కి కూడా సిఫార్సు చేశారు. ఈనాడు యింటింటా గంట గంటా యెవ్వరి కంఠం వింటూ వుంటామో, ఇదే ఘంటసాల కంఠం మైకుకి పనికి రాదనీ, పాటలో పైకి వచ్చే సూచన లేవీ కనిపించడం లేదనీ పెదవి విరిచారట కొంతమంది పెద్ద మనుష్యులు - అనాడు. ఒలాంటి అడ్డూ సొడ్లు, నిరుత్సాహ కారక శక్తులూ, ప్రతీ కళాకారుడి ప్రథమ ప్రయత్నాల్లోనూ, తప్పవు. పైకి తీసుకు రావటానికన్నా, కిందికి దించేద్దామనే తలపులు గల మహామహా లెక్కువ మంది వుంటారు. ఏ పదార్థాన్నైనా, పైకి ఎత్తాలంటే కష్టంగాని, కిందపడేయడం ఎడమచేతిపని. భూమ్యాకర్షణ శక్తికూడా సహకరిస్తుంది.


శ్రీ సముద్రాల ఆశీర్వాద బలంతోనూ, వెన్నుదన్నుతోనూ, వీరు ఇలాంటి అడ్డంకు లనన్నిటినీ అతిక్రమించి పురోగమించారు.

స్వర్గీయ శ్రీ ఘంటసాల బలరామయ్య గారి కంపెనీలో ఘంటసాల, 'సీతారామ జననం' చిత్రంలో కోరస్‌లు పాడడానికీ, చిల్లర వేషాలెన్నో వేయడానికీ కలిపి 150 రూపాయిల జీతానికి కుదిరారు. శ్రీ అక్కినేని వీరు ఒకే సారి పరిచితులయ్యారీ చిత్రంలో. కానుకోసమని "కళ" గళాన్ని ఖండించడాని కిష్టపడక, కళాఖండాలు నిర్మించడానికే బద్ధ కంకణులైన శ్రీ బి. ఎన్. రెడ్డి "స్వర్గసీమ" చిత్రంలోనే ప్రథమంగా వీరొక యుగళగీతా న్నాలపించారు బహుముఖ ప్రతిభావతి, భానుసమ ప్రభావతి, ధీమతి శ్రీమతి భానుమతిగారితో కలిసి పాడిన 'ఓహో నా రాజా' అన్న పాటే అది. తదుపరి శ్రీ నాగయ్యగారి త్యాగయ్యలో గుంపులో గోవిందా అని బృందగానంలో పాల్గొనడంతో ఆగకుండా, సుందరేశ ముదిలియారుపాత్రకి, ఒకచక్కని శాస్త్రీయ గీతం కూడా పాడారు. చాలా పాత్రలుకూడా అభినయించారు.

"భరణీ పిక్చర్సు" స్థాపించిన భానుమతీ రామకృష్ణులు, వీరిని తమ మొదటి చిత్రం "రత్నమాల"లోనే స్వర్గీయ శ్రీ సి. ఆర్. సుబ్బరామన్‌గారికి సహాయకులుగా నియమించి, కొన్ని పాటలకి వరసలమర్చే అవకాశం అందించారు. "ఆగవే మరదలా" "దారి తెలియరాయె అమ్మా" వగైరా పాటలు ఘంటసాల కృతామరగీతాలే. "బాలరాజు" చిత్రానికి శ్రీ గాలిపెంచల నరసింహారావుగారితో కలిసి, జి. వెంకటేశ్వర్రావనే పేరుతో ఇచ్చిన సంగీతంలో ఎక్కువభాగం వీరిదేనట. ఓ దా ల్మరా జా (శోకగీతం), చెలియాకనరావా, రాజా రారా ఆదిగాగల వీరిగీతాలన్నీ ప్రతీ పెదవిపైనా నాట్యంచేశాయి.

'చెలియా కనరావా' అనేదే శ్రీ అక్కినేనికి ఘంటసాల ప్రథమంగా పాడిన పాటట. ఈ పాట విని వెంటనే పాడవి ఆంధ్రుడుండేవాడు కాడాదినాల్లో.

మొదట వీరు స్వయంగా సంగీత సారథ్యం వహించిన చిత్రం శ్రీమతి కృష్ణవేణి నిర్మించిన "లక్ష్మమ్మ కథ" అయినా ప్రజలముఖం మొదట చూసినది వీరి "కీలుగుఱ్ఱమే"నట. ఈ చిత్రంతో వీరిపేరు రెక్కలు కట్టుకొని కీలుగుఱ్ఱంలా వినువీధుల కెగసి పయనించింది. శ్రీమతి సరళ, ఘంటసాలల యుగళసంగీతం "కాదుసుమా కల కాదుసుమా" ఘంటసాల సోలో



"ఎవరు చేసినకర్మ"లు ప్రచండంగా పాప్యులర్ అయ్యాయి. ప్రథమ చిత్రమే అనేక కేంద్రాల్లో శతదినోత్సవాలు జరుపుకున్నాక వీరు సంగీత దర్శకులుగాకూడా స్థిరపడిపోయారు.

1949 ప్రాంతాల్లో విజయా సంస్థలో పర్మనెంటుగా కుదిరారు, "షావుకారు" "పాతాళ భైరవి" "పెళ్ళిచేసిచూడు" చంద్రహారం" చిత్రాలకి పనిచేసి, తదుపరి ఫ్రీలాన్సర్‌గా ఇతర సంస్థలకు కూడా పని చేయసాగారు. విజయవారి 'గుణసుందరి కథ' (తమిళం), మాయాబజారు, గుండమ్మకథ చిత్రాలకు కూడా అటీవలనే అందించారు సంగీతం. తొమ్మిది చిత్రాలుగా నిరాఘాటంగా సంగీత దర్శకత్వం కొనసాగిస్తున్న ఏకైక సంస్థ, వ్యాపార నిర్వహణాధురీణులైన శ్రీ సుందర్లాల్‌గారి "రాజశ్రీ" ప్రొడక్షన్ మరో చిత్రమేమిటంటే, నేను ఘంటసాల దర్శకత్వంలో ఇంతవరకూ ముత్యంగా, ముచ్చటగా పాడిన మూడు పాటలూ కూడా ఈ సంస్థకు చెందిన ఉప సంస్థవే (రాజ్యలక్ష్మి) "శాంతినివాసం", "రక్తసంబంధం", "గుడిగంటలు" అనే చిత్రాల్లో చెరొక పాటాపాడాను. మూడూ శ్రీమతి పి. సుశీలతో కలిసి ఆలపించిన ద్వంద్వగీతికలే. మూడూ బ్రహ్మాండమైన హిట్సే.

నాటి "కీలుగుఱ్ఱం" అధిరోహించి నేటి "గుడిగంటలు" దాకా దాదాపు ఎనభై చిత్రాలకు పైచిలుకు సంగీత మిచ్చారు. అయిదు వేలకు పైగా పాటలు పలు భాషలలో వినిపించారు. ప్రజా హృదయాల్ని దోచేసుకున్నారు. మకుటంలేని మహారాజుగా, 'గాయక సమ్రాట్'గా విలసిల్లుతున్నారు. వెలుగొందుతున్నారు, ఏదో వదో వదిహేనో చిత్రాల్ని మినహాయించి, తక్కినవన్నీ శత

దినోత్సవాలో, రజతోత్సవాలో, మరో ఉత్సవాలో జరిపించుకున్నవే. పాడినపాటలన్నీ అనేకంగా హిట్సే.

"కళ్యాణి" రాగంలో ఎన్నో పాటలు వస్తూవుంటాయి. కాని ఈ పాట ఘంటసాలదే అని నిస్సందేహంగా చెప్పేయగలిగే విధాన కొన్ని ప్రయోగాలపై వీరు తమ ముద్రవేసుకున్నారు. ఉదాహరణకి 'కళ్యాణి రాగంలో "ధని రి గమదపమగరి. నీ.గరిగా. రిసా" అన్న స్వరాల త్రోవలో రాగం అనుకుని చూడండి. అది ఖచ్చితంగా వీరి పేటెంటు సంగతేనని మీకే తెలిసిపోతుంది. ఇలా వీరు తరుచుగా ఉపయోగించే ప్రతీ రాగం యొక్క విశిష్టప్రయోగాలపైనా, కొన్ని అపురూపమైన ప్రత్యేక లక్షణాల శిల్పాలైన సంగతులపైనా, బిరకాలపైనా, ఘంటసాల ముద్రి గట్టిగా పడిపోయింది!

వీరి అభిమానరాగాలలో అతిముఖ్యమైనవి, కళ్యాణి, ఖీంప్లాస్, రాగేశ్వరి, భాగేశ్వరి, మాండ్, సింధుభైరవి, హంసానంది హంసధ్వని, మాల్కోస్, ఆది గాగలవి, అధికతరమైన సంఖ్యలో ఈ రాగాల్లోనే వినిపిస్తూ వుంటాయి వీరిగీతాలు.

సినీమాపాటలేకాక, వీరి బేసిక్ గ్రామోఫోన్ ప్రైవేట్ రికార్డులన్నీ రికార్డు బ్రేక్ సేల్సు రికార్డు చేసినవే. "గాలిలో నా బ్రతుకు" "బహుదూరపు బాటసారి" "అమ్మా సరోజినీదేవీ" "తే లేవోయ్ ఆశాజీవీ" "సౌంధ్య శ్రీ" "పుష్పవిలాపం" "కుంతీ విలాపం" "పుట్టబోయెడి బుల్లి బుజ్జాయి కోసమై" మున్నగు గీతికలన్నీ ప్రాక్టీసుచేసి పాడి, నేను కూడా పేరు కొట్టేసేవాణ్ణి. నా కాలేజీ రోజుల్లో.

చుక్కల్లా లెక్కలేని వీరిగీతాల్లోకొన్నింటిని జ్ఞాపకం చేసుకుందాం.

"షావుకారు"లో "ఏమనెనే," "పలుకరాదటే చిలుకా" "మారిపోవురాకాలమూ", "పెడదారి పడకె ఓ మనసా", "దీపావళి" లాంటి ముత్యాల మతాబాల పాటలు వన్నెల వెన్నెలలువెదజల్లాయి. "పాతాళ భైరవి"లో ప్రతీ పాటా ప్రజాదరణ పొందింది. "ఎంత ఘాటు ప్రేమయో" "ప్రణయ జీవులకు దేవివరాలే" అన్న లీల, ఘంటసాలల యుగళగీతులూ- ఆంధ్రి కే. సి. డే అనిపించుకున్న శ్రీ వి. జె. వర్మ పాడిన "ప్రేమకోసమై వలలో పడెనే" శ్రీ రేలంగి "ప్రేమగోల" జిక్కిగారి "వగలోయ్ వగలు" లీలగారి "తీయని వూహలు" ఘంటసాల "కనుగొనగలనో లేనో" అన్నఅన్ని పాటలూ మన్ని వెన్నంటాయి. "పెళ్ళిచేసిచూడు"లోని పిఠాపురం పాడిన "పెళ్ళిచేసి చూపిస్తాం" వి. జె. వర్మయమ బేస్‌లో పాడిన "పోవమ్మా బలి కావమ్మా" మరో డ్యూయెట్ "ఏమిటె నీ రభస ఓ మనసులోని మనసా" అన్న పింగళిగారి శర్కర పొంగలి లాంటి గీతం, నవ్వించాయి, ఏడిపించాయి, గిలిగింతలు పెట్టాయి. చంద్రిహారంలో ఎ. పి. కోమలగా రాలపించిన గీతం సుమ కోమలమైనది. "బ్రతుకు తెరువు"లో లీల, ఘంటసాలలువిడివిడిగాపాడిన"అందమెఆనందం" గీతం బిచ్చగాండ్రకు సైతం "బ్రతుకు తెరువు" కల్పించి చూపించింది. "లక్ష్మమ్మ కథలో శ్రీ ఎం. ఎస్. రామారావు పాడిన "ఏల యీ విషాదమూ", టి. జి. కమలాదేవిగారి "హృదయవీణ" మరువరాని మాణిక్యాలు. "పల్లెటూరు"లో ఘంటసాల స్త్రో "అనడకలోనా, ఆ చూపులోనా" వింటే చాలు నడక కనిపిస్తుంది.

"మాయాబజార్లో" మాధవపెద్ది పెద్ద గొంతుతో దిక్కులు దద్దరిల్లేట్లు "వివాహభోజనంబు" ఘటోత్కచుడికి తగినట్టుగా అరిచి పాడారు. వింతైన పాయసాన్ని ఉఫ్ అని ఊదిపారేశారు. ఈ పాట అరవంలో పాడినగాయకుడు రికార్డింగయిన మూడురోజులుదాకా లంఖణాలు కట్టాడట. పుంధైన గొంతువలన. ఇదే చిత్రంలో "నీకోసమె నే జీవించునది" అని లీలా ఘంటసాలలాలపించిన విరహగేయం విన్నవారినందర్నీ విరహంతో వేధిస్తుంది. "పరోపకారం" చిత్రంలో, శ్రీ ఏ. యం. రాజా కమ్మగా పాడిన "హృదయం ఊగిసలాడే ప్రతిహృదయం కలతలవాడా" అన్నది ప్రతిహృదయాన్ని ఊగించింది. "సతీ అనసూయ"లో శ్రీరంజని రాగంలో "మారుపల్కవదేమిరా" జావళి తన బరువైన కంఠంతో వినిపించిన శ్రీమతి ఎం. యల్. వసంతకుమారి రసికుల ఎదలో వసంత వికాసాన్ని చిగురెత్తించారు. ఇదే చిత్రింలో సుశీల 'ఘూర్జరి తోడి' రాగంలో "ఓ సూర్యదేవా" అని భక్తిమీర పాడారు. "కన్యాశుల్కం"లో గిరీశం పాత్రకు ప్రాణంపోసిన శ్రీ ఎన్. టి. రామారావుగారికని ఘంటసాల కొంటెగా పాడిన "చిటారుకొమ్మన మిఠాయిపొట్లం చేతికందదేం గురుడా" భలే హుషారైన గేయం. ఇదే చిత్రింలోని పుత్తడిబొమ్మ పూర్ణమ్మ గేయం కన్నీటి వెల్లువలు ప్రవహింపజేసింది. పెళ్ళిసందడిలోని లీల ఘంటసాలల "చమకో తారా" భలే సందడైన పసందైన పాట. "రావే ప్రేమలతా"అని శ్రీమతి బాలసరస్వతితో రాగేశ్వరిలో ఘంటసాల పాడినపాట రమ్యమైనది. "శభాష్ రాముడు"లో సుశీల మిశ్ర ఝుంఝూటిలో తీయగా పాడిన "రేయిమించెనోయి రాజా" శభాసుగావుంది.

"చిరంజీవులు"లో "కనుపాప కరువైన" "ఏనాటికైనా నీదానినైనా" అనే గీతాలు "చిరంజీవులు" "పైగరు రాముడు"లో జానకిగారు వినిపించిన వసూధిని సంగీత నాటిక, రాగమాలికలకు మచ్చుతునక. "సారంగధర"లో "అన్న నా భామిని, ఏమని, ఎపుడైనా" అన్న శృంగారగీతంలో మధ్య మధ్య వినసే నవ్వుల పువ్వులా, కిలకిలల కలకలలూ, శ్రోతలకి కితకితలెడతాయి. "భక్త రఘునాథ్"లో "సంసార జలధి దాటించేనావ"అని కాంభోజరాగంలో "జగన్నాథ పదసేవ" మహిమను భక్తితో కొనియాడిన లీలా ఘంటసాలలు ధన్యులు. వీరి సొంత చిత్రాలైన "సొంతవూరు" "పరోపకారం"లోని పాటలు, "పంటరైతా" "జోడెడ్లనడుమా""ఏమిప్రభూ ఏమిపరీక్ష" (లీలసోలో) మున్నగునవన్నీ ముత్యాల్లా మెరిశాయి. "రక్తసంబంధం"లో "ఓహో వయ్యారి వదిన" అన్న చిన్నారి చిలిపి గీతం వయ్యారంగా సాగింది. "వినాయక చవితి"లో "దినకరా శుభకరా" చక్కని కామవర్ధనిలో కమనీయంగా కుదిర్చారు. "దీపావళి"లో గంభీర పాత్రల నొక్కమ్మదిని గుర్తగొన్న శ్రీ గుమ్మడితో ఉమ్మడిగాఘంటసాలవినిపించిన"ఓదేవా!కనలేవా" గీతం కరుణారసపూరితం. "లవకుశ"లో

లవకుశులాలపించిన "వినుడు వినుడు రామాయణగాథ" మరియు ఘంటసాల సోలో "ఏ నిమిషానికి ఏమి జరుగునో" విని కంట తడిపెట్టని మనిషి వుండడు. ఈ సంక్రాంతి నాటినుండి గణగణా మ్రోగుతున్న "గుడి గంటలు"లో "నీలిమబ్బుల నీడలలోనా" అని నేనూ సుశీలగారూ పాడిన సి. నారాయణరెడ్డి గేయం, "దూరానా" అన్న సుశీల సోలో, జానకిగారి సోలపాటా, ఘంటసాలగారి సోలో శ్రీ దాశరథి గేయం. "నీలోన నన్నే నిలిపేవు నేడే" వగైరా గీతాలన్నీ, "ఘంటసాల"కీర్తిని "గుడిగంటలు" లోని గంటల్లా దశదిశలా మోత మోగిస్తాయని ఆశిస్తాను. మన ఘంటసాల ఘంటా కంఠం కలకాలం ఖంగుమని మ్రోగుతూనే వుండాలని. కవుల గంటాలొలికించే గేయాల్ని పలుకరించి పలికించే వీరి రాగరసయుతగాన మాధురులు,ఆలించే మనందర్నీ కులికించి పులకింప జేస్తూనే వుండాలనీ. వీరనవరత మాయురారోగ్యైశ్వర్యాలతో అలరారాలనీ ఆశిద్దాం! ఆ కరుణామయుడైన దేవుణ్ణి ప్రార్థిద్దాం! □□□



"పూజాఫలం"లో విజయలక్ష్మి

చిత్రగుప్తుని చైత్రయాత్ర

అక్కినేని నాగేశ్వరరావు — ఎక్కలేని ఎత్తుల్లేవు....

అసాధ్యాలనిపించే సమస్యలను, అజేయులనిపించే శత్రువులను ఎదిరించక పోవడం అనేకి-అపరాజితులమనిపించుకునే కొందరి జీవితాలలో రహస్యం అంటారు. అసాధ్యాలు అని కనేవినే వారందరికీ అనిపించే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని గెలిచేవారు. ఓడినా గర్వంగా నిలబడగలిగే మగసిరిగలవారూ అరుదు. వాళ్ళనే అచ్చ తెనుగులో హీరోలంటారు. హీరో నాగేశ్వర రావు జీవితంలో.అసాధ్యాలమీద విజయాలు సాధించడమే ప్రముఖంగా కనబడే లక్షణం. ఎక్కిన దారని గుర్రము గ్రక్కున వదలక పోవడం అతని పద్ధతి: సవారీకి పొగరుమోతు గుర్రాన్నే-ఇంకొకళ్ళు ఎక్కడానికి వెనకాడే రకాన్నే సాధించడం అతనికి సరదా. వృత్తి. జీవితలక్ష్యం. ఎదురుగుండా వున్న సమస్య సాధ్యాసాధ్య విచారణ చెయ్యకుండా ముందుకు దూకే అవివేకి కాదు: అసాధ్యమనిపిస్తే ఉరుదిమ్మాయా సానికి జంకే మనిషీకాదు.

ఇటీవల నాగేశ్వరరావు - ఆంధ్రరాజధానిలో తెలుగు సినిమా రాజధాని పతాకం ప్రతిష్ఠించాలని - అనుకున్నప్పుడు ఆప్త మిత్రులు. అన్నప్పుడు అభిమానులూ కూడా అది అసాధ్యమని సూచించారు. అనవసరమని సలహా యిచ్చారు. నీ కెందుకు అని హితవు చెప్పారు. తను హైదరాబాదు వెళ్తున్నాడు కాబట్టి అందరిని తీసుకుపోవాలని ఆయన ఉద్దేశ్యం అన్నారు కొందరు. కాని దార్యనాయకంగా అతన్ని. ఈ సమస్య అర్థంచేసుకున్నవారెవరూ ఈ మాట అనుకోరు: అనలేదు. కొందరి విమర్శ మాత్రం మరోవిధంగా తీవ్రంగా సాగింది. తెలుగు పరిశ్రమ తెలుగుదేశం పోవాలనడం వల్ల లేనిపోని భాషా భేదాభిప్రాయాలను కలిపినట్లవుతుందనీ - దేశమంతా నేషనల్ ఇంటెగ్రేషన్ కోసం తాపత్రయపడుతున్నప్పుడు ఇది తగదని ఈ వర్గంవారన్నారు.

తెలుగు సినిమా పరిశ్రమ తెలుగు దేశంలో ఉండాలనడం ప్రాంతీయాభిమానం కావచ్చుగాని ప్రాంతీయ దురభిమానం కాజాలదు. భాషా ప్రయుక్త రాష్ట్రాలను విభజించడమే ఆ యా ప్రాంతాల అభివృద్ధికి ఎవరికి వారు కృషిచేసుకునేందుకు అవకాశం ఇవ్వడంకోసం - ఎవరి డబ్బు వారు ఖర్చు పెట్టుకునే వసతికోసం జరిగింది. పూర్వం ఒకప్పుడు ఒక రాష్ట్రంపన్నుల డబ్బు ఇంకో రాష్ట్రంలో రోడ్లకి, [illegible]శ్రమలకి విద్యుద్దీపాలకి ఖర్చవుతుండేది. ఎదుగూ బొదుగూలేని కొన్ని రాష్ట్రాలు బాధపడవలసి వచ్చింది. తెలుగురాష్ట్రం ఏర్పడాలని కోరిన నాయకులు-అందుకు పేర్కొన్న కారణాలలో ఇదొకటి.



ఇవాళ శ్రీ నాగేశ్వరరావు అన్నదికూడా అదే. తెలుగు పెట్టుబడితో, తెలుగు వసూళ్ళతో నడిచే పరిశ్రమ డబ్బు తెలుగు దేశంలోనే ఖర్చయితే చాలా డబ్బు ప్రభుత్వానికి పన్నులరూపేణా లభిస్తుంది. ఎన్నో ఉప పరిశ్రమలు లేస్తాయి. ఎందరికో జీవనోపాధి లభిస్తుంది. నిరుద్యోగ సమస్య కొంతవరకు దారిన పడుతుంది. తెలుగు రాజధానిలో, సినిమా ఉపాంగాలుగా లలిత కళలన్నీ వికసిస్తాయి. అఖిలభారతస్థాయిలో అంతర్జాతీయ స్థాయిలో తెలుగుధనానికో విలువ, తెలుగుధనానికో వ్యక్తిత్వం ఏర్పడతాయి.

ఇందుకై అతను, ఏదో కమిటీ వారు ఏడాదిపాటు చెయ్యవలసిన పనిని స్వయంగా చేసి తెలుగు సినిమా నిర్మాణానికి సంబంధించిన వివరాలన్నిటినీ అందించాడు. ఈ డబ్బంతా హైదరాబాద్‌లో ఖర్చయితే ఎంత లాభమో వివరించాడు. ఈ విషయమై "సినిమా నటుడుగా, తెలుగు పౌరుడుగా, వ్యక్తిగా తన భావాలను పేర్కొంటూ ఒక వినతిపత్రం సమర్పించాడు"

మద్రాసులో ఖర్చయ్యే తెలుగు రూపాయిని హైదరాబాద్ తీసుకురావాలంటే రవాణాకి కొంతఖర్చవుతుంది. ఆ ఖర్చును ప్రభుత్వం భర్తీచేస్తే కొత్తల్లో యిక్కడకు వచ్చే నిర్మాతలకు అదనపునష్టం కలగకుండా చూస్తే దారి ఏర్పడుతుందని మిగతా వారంతా రావడానికి వసతులుంటాయని ప్రతిపాదించాడు. స్థూలంగా మద్రాసునుండి హైదరాబాద్‌కు [illegible] రావడానికి [illegible] ఖర్చు [illegible] [illegible] వేలు [illegible] 60 వేలు రూపాయలు [illegible]

స్థానికంగా ఉన్న స్టూడియోను అభివృద్ధి చేయడానికి మరో స్టూడియో నిర్మించడానికి ఋణసహాయం చేయాలని కోరాడు.

ఆంధ్రప్రభుత్వం ఈ సమస్య పరిశీలనకై ఒకఉపసంఘాన్ని నియమించింది. వారు, దరిమిలాను ఆంధ్రమంత్రివర్గం నాగేశ్వరరావు వినతిపత్రంలో చాలా అంశాలను గౌరవించి ఆమోదించారు.

హైదరాబాదులో తయారయే ప్రతి చిత్రానికి 50 వేలు సహాయ ధనంగా ఇవ్వడానికి, అక్కడి స్టుడియోల అభివృద్ధికి రెండేళ్ళపాటు వడ్డీలేకుండా ఋణం యివ్వడానికి, ఫిలింకాలనీ నిర్మాణానికి 200 ఎకరాల స్థలం సేకరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఇదికాక ఉత్తమ తెలుగు చిత్రానికి 50 వేలు బహుమతి యివ్వ నిశ్చయించింది. మన పరిశ్రమ మనదేశం చేరుకోడానికి యింతకన్న చక్కని రాజమార్గం ఎవ్వరూ వెయ్యలేరు. ఈవారివెంట చాలమంది రాగలరనడానికి సందేహం లేదు. ఇందుకు దోహదం చేస్తున్న ఆంధ్రప్రభుత్వాన్ని సర్వులూ అభినందిస్తున్నారు.

అసాధ్యాన్ని సుసాధ్యమనిపించే స్థాయికి తెచ్చిన అసహాయశూరుడు నాగేశ్వరరావును ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

పూజాఫలం

బి. యన్. రెడ్డిగారి చిత్రాలన్నిటిలో వలెనే "పూజా ఫలము"లో కూడా ఆయన కళాప్రియత్వం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. "మూసి అప్పలు"[illegible] హాస్యంకూడా ఈ [illegible] లో లగుమూరాడులో అందివ్వ[illegible]

[illegible] నాగేశ్వరరావు

మునిపల్లె రాజు "పూజారి" నవల ఆధారంగా నరసరాజు రచించిన ఈ చిత్రకథలో ముఖ్యాంశం ఒకటే-ఒక ఐశ్వర్యవంతుడయిన అమాయకుని జీవితాన్ని ఏ విధంగా ముగ్గురు స్త్రీలు మలుస్తారు అన్నది. మొదటి స్త్రీ "వాసంతి". ఆమె చనువును అపార్థం చేసుకుంటాడు నాయకుడు మధు. రెండవ స్త్రీ సీత తనలాంటి మూగదే అని అర్థం చేసుకోడు. మూడవ స్త్రీ నీలనాగిని వలలో సగం అర్థమయి-సగంకాక పడతాడు. చేతిలోని ఐశ్వర్యం చిక్కుల్లో పడితేగాని ఈ చిక్కు విడదు.

ఈ ప్రధాన కథాఘట్టాలను బి. యన్. రెడ్డి యెంత కళాత్మకంగా ఊహించారో దానికి అంత సంపూర్ణ న్యాయం చేకూర్చారు ముఖ్య భూమికలు ధరించిన నాగేశ్వరరావు, సావిత్రి, గుమ్మడి, జమున.

మధు పాత్ర చాల క్లిష్టమైనది. "బాటసారి" "పునర్జన్మ" చిత్రాల పాత్రలతో కొంత పోలిక వున్నది. కాని ఒక్క ఫ్రేములోకూడా నాగేశ్వరరావు నటనలో పాతదనం కనబడలేదు. సావిత్రి, గుమ్మడి ధరించిన పాత్రలుకూడా, నాయకుని పాత్రలాగే యెక్కువ మాటలాడే ప్రవృత్తి కలవి కావు. వీటిని ధరించినవి యింతటి కళాకోవిదులు కాబట్టి ఈ లేమిని కలిమిగా రూపొందించగలిగారు. తనకి తగినంత పెద్దపాత్ర కాకపోయినా "పెద్దతనం" చూపిన నటనలో వుందని సావిత్రి రుజువు చేసింది. మొదటి యువతి వాసంతిగా జమున చాలా చక్కగా నటించింది.

చిన్న వేషమైనా జగ్గయ్య బాగా రాణించాడు. రేలంగి, రమణారెడ్డి, రాజశ్రీ, కొత్త హాస్యనటుడు ప్రభావ్, ఎల్విజయలక్ష్మి నటన యథోచితంగా వుంది.

ఈ చిత్రానికి మరొక ముఖ్యమైన అలంకరణ ఎస్. రాజేశ్వరరావు సంగీతం, దేవులపల్లి కృష్ణశాస్త్రి, సి. నారాయణరెడ్డి వ్రాసిన పాటలు. పాటలుగా చెప్పుకోదగినవి జానకి పాడిన శీనయ్య పదం "శివదీక్షా పరురాలనురా" సి. యన్. నారాయణరెడ్డి "పగలే వెన్నెల" దేవులపల్లి రెండు పాటలు సుశీల పాడినవి "ఇది చల్లని వేళయినా" "అందేనా ఈ చేతులకందేనా" నాలుగు పాటలు విన్నతరువాత జన్మకే స్వంతమయే స్థాయిలో వున్నవి. నేపథ్య సంగీతం అత్యున్నతమైన విధాన అమర్చబడింది. నరసరాజు ముఖ్యపాత్రలను వ్రాసిన సంభాషణలు అతి చురుకుగా క్లుప్తంగా వున్నవి.

ఆత్మబలం

ఆత్మబలానికి ఆత్మ అగ్నిసంస్కార్ అనే చక్కని వంగకథ. ఆ ఆత్మకు మరో జ్యోతిని జోడించినది మధుసూదనరావు దర్శకత్వం. హంగులు అపూర్వమైన ఆత్రేయ పాటలు, మాటలు, కె. వి. మహదేవన్ సంగీతం. ఉపాంగాలు జీవనమల్లా అనుక్షణం కదులాడే గమనం, కళకళలాడే ఛాయ, హృదయంలో నిర్మలంగా ప్రతిధ్వనించే ప్రేమసన్నివేశాలు. వీటన్నిటికి తోడు నాగేశ్వరరావు, బి. సరోజాదేవి, జగ్గయ్య, కన్నాంబ, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, గిరిజ, నాగయ్యల తారాబలం.

తెలుగు చిత్రసీమకు కొత్తదయిన కథతో నిర్మింపబడిన ఈ చిత్రం అన్ని తరగతుల ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పటానికి సందేహం లేదు. కాస్త పొడుగాటి కథనమైనా, ఒక్క క్షణమైనా విసుగెత్తించక కదం త్రొక్కించిన దర్శకత్వ ప్రతిభ యిందుకు కొంత కారణం. మధుసూదనరావు మహిమ యిందులోనేకాదు చకోరీ చంద్రుల



"గుడిగంటలు"లో కృష్ణకుమారి, రామారావు

ప్రణయం మోహనంగా రూపొందించిన ప్రేమఘట్టాలలోను, తీయనివలలలా చిత్రించిన సంగీత దృశ్యాలను, యెక్కడా బిగి సడలకుండా యిమిడ్చిన హాస్యసన్నివేశాలలోను, చివరిదాకా ఉత్సుకతను పెంపొందించుకుంటూ వచ్చిన విధానంలోను ద్యోతకమవుతున్నది.

ఆత్రేయ సంభాషణలు, పాటలు యువరచయితలకు పాఠ్యగ్రంథాలు. ఒక్క అనవసరమైన మాట లేదు. కథాగమనానికి సంబంధించని మలుపులేదు. ఒక భావాన్ని అనవసరంగా నొక్కి వక్కాణించే తరుణం లేదు. చివరిపాట మినహాగా, అందానికి, శృంగారానికి మారుపేరుకాని పాటలేదు.

మహాదేవన్ వరుసలలో మనసుదోచే మహాత్మ్యంవున్నది. ఏపాటవిన్నా నోటికొట్టే పాతకాపైపోతున్నది. సి. నాగేశ్వరరావు ఛాయలో ముగ్ధుల్ని చేసే చల్లదనంవుంది. సుశీల ఘంటసాల హాయిగా పాడారు.

నాగేశ్వర్రావు ధరించిన పాత్రలో చెప్పుకోవలసినంత కొత్తదనంలేదు. కాని ఆయన స్థాయికి యెక్కడా తగ్గిపోని విధంగా నటించారు. బి.సరోజాదేవి చాలాగ్లామరస్‌గా వుంది. జగ్గయ్యది విశిష్టమైన పాత్ర. గుమ్మడి పాత్ర చాల చిన్నదయినా వారి అభిమానులకు యేమాత్రం నిరుత్సాహం కలిగించదు. కన్నాంబ తన సాటి తార లేదనిపించుకున్నది. రేలంగి, గిరిజ, రమణారెడ్డి హాస్యం ఆహ్లాదకరంగానే వుంది.

నిర్మాణంలో వున్న కొన్ని చిత్రాలు

1963 లో విడుదల అయిన లవకుశ, నర్తనశాల, శ్రీకృష్ణార్జున యుద్ధం మొదలైన పౌరాణిక చిత్రాలు విజయవంతం కావడంతో చాలమంది తెలుగు నిర్మాతలు పౌరాణిక చారిత్రక చిత్రాల నిర్మాణంపట్ల మొగ్గు చూపుతున్నారు.

ఇదివరలో అనురాగం చిత్రాన్ని తీసిన అనురూపా వారు "పల్నాటి యుద్ధం" చిత్రాన్ని తీయబోతున్నారు.

దీనిలో నాయకురాలు నాగమ్మ పాత్రను భానుమతి నిర్వహిస్తుంది. అనురాగం దర్శకుడు జి. రామినీడు ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహిస్తారు. మాటలను సదాశివబ్రహ్మం వ్రాస్తున్నారు.

జూపిటర్ ప్రొడక్షన్‌వారు తీసిన జానపద చిత్రం "మర్మయోగి" త్వరలోనే (బహుశా ఫిబ్రవరి మొదటివారంలో) విడుదల కావచ్చునని అనుకుంటున్నారు. రామారావు, కృష్ణకుమారి ముఖ్య పాత్రలు ధరించిన ఈ చిత్రానికి బి. ఎ. సుబ్బారావు దర్శకత్వాన్ని, ఘంటసాల సంగీత దర్శకత్వాన్ని వహించారు.

ఈస్టిండియావారు దీనిని ఆంధ్రలో విడుదలచేస్తారు.

విక్రమ్ ప్రొడక్షన్స్ వారి చరిత్రాత్మక చిత్రం "అమరశిల్పి జక్కన్న" చిత్రం త్వరలోనే విడుదల కాగలదనిభావిస్తున్నారు. నాగేశ్వరరావు, సరోజాదేవి యిందులో ముఖ్యభూమికలను ధరించారు. దీనికి బి. ఎస్. రంగా నిర్మాత, దర్శకుడు. విడుదల నవయుగ ఫిలింస్.

ఎ. వి. ఎమ్. సంస్థ, వాణిశ్రీ సంస్థ కలిసి తీస్తున్న "నాదీ ఆడజన్మే" అనే సాంఘిక చిత్రం పూర్తికావచ్చింది.


దీనిలో సావిత్రి, రామారావు, రంగారావు ప్రభృతులు నటిస్తున్నారు.

పద్మశ్రీవారి "మురళీకృష్ణ" చిత్రం వచ్చేనెలలో విడుదల కావచ్చునని అనుకుంటున్నారు. జమున, నాగేశ్వరరావు ఇందులో నాయికా నాయకులు. దర్శకుడు పి. పుల్లయ్య.

డి. బి. యన్. వారి "దాగుడు మూతలు" 12 రీళ్ళవరకు పూర్తయింది. ముళ్ళపూడి వెంకటరమణ దానికి కథను, మాటలను, వ్రాశారు. ఆదుర్తి సుబ్బారావు డైరెక్టు చేస్తున్నారు. సరోజాదేవి, రామారావు, గుమ్మడి, పద్మనాభం, రమణారెడ్డి, సూర్యకాంతం, శారద, రామలింగయ్య మొదలగువారు నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు కె. వి. మహదేవన్. నిర్మాత డి. బి. నారాయణ.

□□□




ముద్దబంతి పూవులో
మూగకళ్ళ ఊసులో
ఎనక జలమ బాసలూ
ఎందరికీ తెలుసులే...
మీ హృదయానికి
మృదుమధురమైన బాధను
చవి చూపే ప్రణయగాథ
BM
బాబూ మూవీస్
భాషకందని భావానికే
మోహనస్వరాలలో రూపకల్పన చేసిన
మహాదేవన్ సంగీతం
మూగమనసులు
నిర్మాత సి. సుందరం. దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు
NVKR